జాతీయ తెలుగు దినపత్రిక

ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

జనసందోహం మధ్య నాయక్ ముజఫర్ హుస్సేన్ శిరివెళ్ల సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్.

ప్రజాజ్యోతి
తెలుగు దిన పత్రిక

On this National Press Day

Our Newspaper reiterates its commitment to free, fair and ethical journalism.

November 16, 2026

కృష్ణ | సోమవారం 16 నవంబర్ 2026 | సంపుటి : 01 | సంచిక :293 | పేజీలు : 12 | వెల : 3/-

PRGI No. APTEL/26/A0119,

సంవత్సరం: శ్రీ పరాభవ నామ సంవత్సరం, మాసం: ఆశ్వయుజ మాసం శుక్లపక్ష: శరద్ ఋతువు: ఆయనం: దక్షిణాయణం విశేషం: అమావాస్య, దీపావళి, నరక చతుర్దశి, లక్ష్మీ పూజసూర్యోదయం: 6.03 సూర్యాస్తమయం: 5.19 చంద్రోదయం: 5.49 చంద్రాస్తమయం: 4.46 తిథి: బహుళ చతుర్దశి ఉ. 10.26 వరకు, తదుపరి అమావాస్య నక్షత్రం: స్వాతి పూర్తిగా ఉంది యోగం: ఆయుష్మాన్ తె. 3.44 వరకు, తదుపరి సౌభాగ్యం కరణం: శకుని ఉ. 10.26 వరకు, తదుపరి చతుష్పాదం రా. 10.43 వరకు, తదుపరి నాగం

Published from KRISHNA, GUNTOORU, VIJAYAWADA, VISHAKAPATANAM, TIRUPATHI | http://www.prajajyothinews.com | Mail: prajajyothidaily@gmail.com

రైతాంగంపై తీవ్ర ప్రభావం



అమరావతి

మురసు తుపాను ఆంధ్రప్రదేశ్‌పై తీవ్ర ప్రభావం చూపిందని, రాష్ట్రానికి తక్షణమే ఆర్థిక సాయం అందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. తుపాను వల్ల జరిగిన నష్టాన్ని అంచనా వేసేందుకు రాష్ట్రంలో పర్యటించిన కేంద్ర అంతర్ మంత్రిత్వ శాఖల బృందంతో ఆదివారం సీఎం వర్చువల్‌గా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో జరిగిన పంట, ఆస్తి నష్టాల వివరాలను వెల్లడించారు. ప్రాథమిక అంచనాల ప్రకారం తుపాను కారణంగా రాష్ట్రానికి రూ.2,484 కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు తెలిపారు. వరుస తుపాన్లు, ఎల్‌నినో ప్రభావం కారణంగా వ్యవసాయ రంగం తీవ్రంగా దెబ్బతిందని చంద్రబాబు వివరించారు. వ్యవసాయ రంగంలో 1,43,617 హెక్టార్లలో పంటలు దెబ్బతినగా, 1,86,063 మంది రైతులు నష్టపోయారని తెలిపారు. వీటివల్ల సుమారు రూ.875 కోట్ల మేర - మిగతా3లో

- మురసు దెబ్బకు రూ.2,484 కోట్ల నష్టం!
- తక్షణ సాయం అందించండి..
- కేంద్రానికి చంద్రబాబు విజ్ఞప్తి
- 1.43 లక్షల హెక్టార్లలో దెబ్బతిన్న పంటలు
- 1.86 లక్షల మంది రైతులకు నష్టం
- 1,385 కిలోమీటర్ల రహదారులు ధ్వంసం
- 60 ప్రాంతాల్లో కేంద్ర బృందం క్షేత్రస్థాయి పరిశీలన



మోదీపై అవినీతి మరక లేదు!

- కాంగ్రెస్‌పై అమిత్‌షా నిప్పులు..
- 12 లక్షల కోట్ల కుంభకోణాలంటూ ఆరోపణలు
- 12 ఏళ్ల పాలనలో నాలుగు అణాల అవినీతి ఆరోపణ కూడా లేదు
- రాహుల్‌కు అధికారం కావాలంటే గ్రామాల్లో పర్యటించాలి
- భారత్ సమిట్ వ్యాఖ్యలపై బీజేపీ--కాంగ్రెస్ మధ్య మాటల యుద్ధం

పట్టణ పోరుకు టీడీపీ అభ్యర్థుల ఖరారు

మేయర్, ఛైర్మన్ అభ్యర్థుల ప్రకటన!

మంగళగిరి--తాడేపల్లి మేయర్‌గా పేరం ఏడుకొండలు

10 మున్సిపాలిటీలు, 4 నగర పంచాయతీలకు అభ్యర్థుల వెల్లడి

నవంబర్ 26న పోలింగ్.. 30న ఓట్ల లెక్కింపు

అమరావతి

ఆంధ్రప్రదేశ్‌లో మిగిలిన పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తుండటంతో తెలుగుదేశం పార్టీ ఎన్నికల కసరత్తును వేగవంతం చేసింది. ఈ క్రమంలో పలు మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీలకు సంబంధించి మేయర్, ఛైర్మన్ అభ్యర్థుల పేర్లను అధికారికంగా ఖరారు చేసింది. కీలకమైన మంగళగిరి--తాడేపల్లి నగర పాలక సంస్థ మేయర్ అభ్యర్థిగా పేరం ఏడుకొండలును ఎంపిక చేసింది.

మున్సిపాలిటీ ఛైర్మన్ అభ్యర్థులు వీరే..

టీడీపీ ప్రకటించిన మున్సిపల్ ఛైర్మన్ అభ్యర్థుల జాబితాలో పది మంది పేర్లు ఉన్నాయి.


తణుకు: బసవ రామకృష్ణ, పాలకొల్లు: ఆబోతుల ఉషారాణి

నరసరావుపేట: ఎన్. రూపేశ్ గుప్తా, గుడివాడ: మారీదు కరుణ

శ్రీకాళహస్తి: పేట బాలాజీ, తాడిగడప: పీతా గోపీచంద్ - మిగతా3లో

ఏపీ, ఒడిశాలకు తుపాను హెచ్చరికలు జారీ..

- బంగాళాఖాతంలో తీవ్ర తుపానుగా బలపడనున్న వాయుగుండం
- గురువారం నాటికి ఆంధ్రప్రదేశ్ తీరానికి చేరుకునే అవకాశం
- ఉత్తరాంధ్ర జిల్లాల్లో గురు, శుక్రవారాల్లో భారీ వర్షాల సూచన
- కోస్తా తీరం వెంబడి గంటకు 40 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు
- మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లవద్దని అధికారుల హెచ్చరిక





శ్రీవారి భక్తులకు ఎస్వీ మ్యూజియం ఎంట్రీ

- ప్రత్యేక ఆకర్షణగా 'బ్రహ్మాండం గ్యాలరీ'
- లక్ష చదరపు అడుగుల విస్తీర్ణంలో ఆధునిక ఎస్వీ మ్యూజియం
- టీసీఎస్ సాంకేతిక సహకారంతో 14 ప్రత్యేక గ్యాలరీలు
- నవంబర్ 16 నుంచి సాధారణ భక్తులకు సందర్శన అవకాశం
- ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అనుమతి
- ప్రవేశ రుసుము ఒక్కొక్కరికి 50 రూపాయలు మాత్రమే

నెహ్రూ వారసత్వాన్ని చెరిపేయడం సాధ్యం కాదు!

- బీజేపీ, ఆరెస్సెస్‌పై కాంగ్రెస్ ధ్వజం
- నెహ్రూ చరిత్రను వక్రీకరించే ప్రయత్నాలు జరుగుతున్నాయి
- వాస్తవాలు, విజ్ఞానంతో దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలి
- ప్రధాని మోదీనే అతిపెద్ద చరిత్ర వక్రీకర్త.. జైరాం రమేశ్ వ్యాఖ్యలు



బలపడుతున్న వాయుగుండం



పట్టణ ఎన్నికల బరిలో జనసేన..

మేయర్, ఛైర్మన్ అభ్యర్థులను ఖరారు చేసిన పవన్!

శ్రీకాకుళం, కాకినాడ మేయర్ అభ్యర్థులుగా మహిళా నేతలు

రాజాం, భీమవరం, తాడేపల్లిగూడెం ఛైర్మన్ అభ్యర్థుల ప్రకటన

క్షేత్రస్థాయి సమీక్షల అనంతరం అభ్యర్థుల ఎంపిక



- 19 నుంచి అతి భారీ వర్షాలు!
- ఉత్తర దిశగా గంటకు 10 కి.మీ. వేగంతో పయనం
- 17 నాటికి తీవ్ర తుపానుగా మారే అవకాశం
- 19 నుంచి కోస్తాంధ్రలో అతి భారీ వర్షాలు
- కళింగపట్నం మినహా అన్ని పోర్టులకు హెచ్చరిక
- రాడార్లతో తుపాను కదలికలపై నిరంతర నిఘా
- తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచన

విశాఖపట్నం

ఆంధ్రప్రదేశ్ తీర ప్రాంతానికి మరోసారి తుపాను ముప్పు పొంచి ఉంది. బంగాళాఖాతంలో కొనసాగుతున్న వాయుగుండం క్రమంగా బలపడుతూ తుపానుగా మారే అవకాశం ఉండటంతో వాతావరణ శాఖ అప్రమత్తమైంది. ఏపీతో పాటు దక్షిణ ఒడిశా తీర ప్రాంతాలకు ముందస్తు హెచ్చరికలు జారీ చేసింది. ఈ నెల 19 నుంచి రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో అతి భారీ వర్షాలు కురిసే అవకాశముందని అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం ఆగ్నేయ, నైరుతి బంగాళాఖాతంలో వాయుగుండం - మిగతా3లో

అయ్యప్ప భక్తులకు శుభవార్త..

తెలుగు రాష్ట్రాల నుంచి కొల్లాంకు ప్రత్యేక రైళ్లు

ఎఎన్ కే ఇంగ్లీష్ మీడియం హై స్కూల్‌లో రాష్ట్రస్థాయి త్రోబాల్, వాలీబాల్ పోటీలను ప్రారంభించిన బీసీ ఇందిరా రెడ్డి



కోవెలకుంట్ల:నవంబర్=15 ప్రజాజ్యోతి కోవెలకుంట్ల పట్టణంలోని ఎఎన్ కే ఇంగ్లీష్ మీడియం హై స్కూల్‌లో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి త్రోబాల్, వాలీబాల్ ఛాంపియన్‌షిప్ పోటీలను రాష్ట్ర రోడ్లు మరియు భవనాల శాఖ మంత్రి వర్యులు బీసీ జనార్దన్ రెడ్డి గారి సతీమణి బీసీ ఇందిరా రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని రిబ్బన్ కట్ చేసి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని, క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, ఐకమత్యాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు.ఈ రాష్ట్రస్థాయి పోటీల్లో రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొంటున్నారు. విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తిని పెంపొందించి, వారి ప్రతిభను వెలికితీయడమే ఈ పోటీల ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో హైకోర్టు అడ్వకేట్, యూత్ స్పోర్ట్స్ ఎడ్యుకేషన్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చైర్మన్, ఎఎన్ కే ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ ప్రిన్సిపాల్ గాలేసాహెబ్ గారి అల్లిహుస్సేన్, టీడీపీ నాయకులు డాక్టర్ పేరా శ్రీధర్ రెడ్డి

కూటమి అభ్యర్థి కట్ట వేణుగోపాలు కు పూర్తి జనసేన మద్దతు.



ప్రజా జ్యోతి న్యూస్ దేవనకొండ.ప్రతినిధి రాఘవేంద్ర. దేవనకొండ: దేవనకొండ పట్టణ కూటమి అభ్యర్థి కట్ట వేణుగోపాల్‌కు జనసేన పార్టీ తరఫున సంపూర్ణ మద్దతు ఉంటుందని జనసేన నాయకులు, కార్యకర్తలు తెలిపారు. కూటమి ప్రభుత్వం తీసుకునే నిర్ణయాన్ని బట్టి ముందుకు సాగుతూ, కూటమి అభ్యర్థి విజయమే లక్ష్యంగా పనిచేస్తామని స్పష్టం చేశారు. కట్ట వేణుగోపాల్‌ను గెలిపించేందుకు జనసేన శ్రేణులు సమన్వయంతో క్షేత్రస్థాయిలో విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తామని తెలిపారు. కూటమి బలోపేతానికి పూర్తి సహకారం అందిస్తూ అభ్యర్థి విజయానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకురాలు సరోజమ్మ, కటికే ఉచ్చిరప్ప, రామాంజనేయులు. ఐటీడీపి రామాంజి తదితరులు పాల్గొన్నారు.

లింగంపల్లి సీజనల్ హాస్టల్‌లో బాలల హక్కుల వారోత్సవాలు

విద్యార్థులకు ఆటల పోటీలు..

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి



హోళగుంద, నవంబర్ 15, ప్రజా జ్యోతి న్యూస్ మండల పరిధిలోని లింగంపల్లి గ్రామంలో ఉన్న సీజనల్ హాస్టల్‌లో బాలల హక్కుల వారోత్సవాలను పురస్కరించుకుని ఎం.వి. ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు.ఈ సందర్భంగా ఎం.వి. ఫౌండేషన్ మండల కోఆర్డినేటర్ సేవా నాయక్ మాట్లాడుతూ సమాజంలో బాల కార్మిక వ్యవస్థను పూర్తిగా నిర్మూలించాలని, బాల్యవివాహాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ప్రతి చిన్నారికి నాణ్యమైన విద్య, సమాన హక్కులు, తగిన రక్షణ కల్పించినప్పుడే సమాజం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు.చిన్నారులతో పనులు చేయించడం చట్టరీత్యా నేరమని, బాలల హక్కులను ప్రతి ఒక్కరూ గౌరవించాలని సూచించారు. బడికి దూరంగా ఉన్న పిల్లలను గుర్తించి తిరిగి పాఠశాలల్లో చేర్పించేందుకు ప్రజలు, తల్లిదండ్రులు, సంబంధిత కమిటీలు సమష్టిగా కృషి చేయాలని కోరారు.ఈ సందర్భంగా బాల కార్మిక వ్యవస్థను నిర్మూలిద్దాం, బాల్యవివాహాలను అరికడదాం, ప్రతి బిడ్డకు నాణ్యమైన విద్య అందిద్దాం, బాలల హక్కులను కాపాడుదాం అంటూ నినాదాలు చేశారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ హనుమంతు, ఫీల్డ్ అసిస్టెంట్ హనుమేష్, బాలల హక్కుల పరిరక్షణ కమిటీ సభ్యుడు హనుమంతు రాయుడు స్వామి, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

న్యాయానికి ప్రాప్తి - న్యాయం అందరికీ, హక్కు అందరికీ

(ప్రజా జ్యోతి న్యూస్) నవంబర్ 15 ప్యాపిలి: హ్యూమన్ రైట్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో 67వ రోజు అవగాహన కార్యక్రమంగా "న్యాయానికి ప్రాప్తి – యాక్సెస్ టు జస్టిస్" అనే అంశంపై ప్రచారం నిర్వహించారు.భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 39 ప్రకారం, ప్రతి పౌరుడికి న్యాయానికి సమాన ప్రాప్తత కల్పించడం రాష్ట్రం యొక్క బాధ్యత. ఆర్థిక, సామాజిక, భౌగోళిక అడ్డంకులు ఎవరినీ న్యాయం నుండి దూరం చేయకూడదు. ప్రతి ఒక్కరికి న్యాయస్థానాలు, న్యాయ సలహా, న్యాయ సహాయం లభించడం ద్వారా న్యాయంపై నమ్మకం పెరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

న్యాయానికి ప్రాప్తి అంటే ఏమిటి?

సమాన న్యాయ ప్రాప్తి, ఆర్థిక అడ్డంకులు లేకపోవడం, న్యాయస్థానాల సులభ ప్రాప్తత, త్వరిత న్యాయం, ఉచిత న్యాయ సహాయం, న్యాయ సమాచారం అందుబాటు, మహిళలు, పిల్లలు, బలహీన వర్గాల రక్షణ, సులభమైన ప్రక్రియ, ప్రత్యామ్నాయ వివాద పరిష్కారం, న్యాయంపై విశ్వాసం అని వివరించారు.న్యాయం అందరికీ అందుబాటులో ఉంటేనే సమాజం సుస్థిరంగా, ప్రగతిశీలంగా ఉంటుంది. న్యాయం హక్కు, దానం కాదు" అని పేర్కొంది.న్యాయానికి ప్రాప్తి ప్రతి పౌరుడి హక్కు – న్యాయం అందితే, దేశం బలపడుతుంది, సమాజం సుభిక్షంగా ఉంటుంది.

కత్తిపూడిలో వైసీపీకి షాక్.. టీడీపీలోకి లువురు నాయకులు.

పసుపు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించిన ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ



కత్తిపూడి, నవంబర్ 15 (ప్రజాజ్యోతి న్యూస్): గ్రామస్థాయి నుంచి తెలుగుదేశం పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అన్నారు. శంఖవరం మండలం కత్తిపూడి గ్రామానికి చెందిన పలువురు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆదివారం తెలుగుదేశం పార్టీలో చేరారు. మరుకుర్తి శ్రీను, మాజీ వార్డు సభ్యుడు మరుకుర్తి సురేష్, మాజీ విద్యా కమిటీ చైర్మన్ పెయ్యాల శివ తదితరులు రాష్ట్ర రోడ్డు కార్పొరేషన్ డైరెక్టర్ వెన్న శివ, జడ్పీటీసీ సభ్యుడు కంచిబోయిన శ్రీను, టీడీపీ నాయకులు పెయ్యాల రమణ, సాధనాల లక్ష్మీబాబు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ సమక్షంలో టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి పసుపు కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు విజయం సాధించిన స్ఫూర్తితో రానున్న పంచాయతీ ఎన్నికల్లోనూ కూటమి అభ్యర్థుల విజయానికి ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేయాలని పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి మూడేళ్ల పాలనలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని, రానున్న రోజుల్లో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు.టీడీపీలో చేరిన వారిలో విశ్వనాథం, అప్పలరాజు, దుర్గ తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గాబు కృష్ణ, జనార్ధన్, సూర్యనారాయణ, శ్రీను, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

భగవాన్ సత్యసాయి సేవలు చిరస్మరణీయం



కోవెలకుంట్ల:నవంబర్=15 ప్రజాజ్యోతి భగవాన్ సత్యసాయి బాబా మానవాళికి గొప్ప సందేశం అందించారని సేవ మార్గం తో పాటు, ఆధ్యాత్మిక విలువలు ప్రపంచానికి అందించిన మహనీయుడని సాయి భక్తుడైన ప్రముఖ వైద్యులు డాక్టర్ శివారెడ్డి కొనియాడారు. కోవెలకుంట్ల పట్టణంలోని సత్య సాయి మందిరంలో సత్యసాయి జన్మదినం సందర్భంగా సత్యసాయి ఆరాధన ఉత్సవము ఘనంగా నిర్వహించారు.భగవాన్ సత్యసాయి 101 వ జన్మదినం సందర్భంగా కోవెలకుంట్ల పట్టణంలోని డాక్టర్ శివారెడ్డి కాలనీలో ఉన్న సత్యసాయి మందిరంలో సాయి భక్తులు అఖండ నామ సంకీర్తన కార్యక్రమం నిర్వహించారు . సాయి మందిరంలో శనివారం సాయంత్రం 6 గంటల కు అఖండ జ్యోతి వెలిగించి ఆదివారం సాయంత్రం వరకు అఖండ జ్యోతిని కొనసాగించారు. శనివారం రాత్రి అంతా సాయి కీర్తనలతో భక్తులు భజన కార్యక్రమం నిర్వహించారు . అనంతరం ఆదివారం ఉదయం నగర సంకీర్తన ,సాయి పల్లకి సేవ పట్టణంలోని పలు వీధుల గుండా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ప్రతి ఏటా నవంబర్ నెలలో సత్య సాయి జన్మదినం సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాల్లో సత్య సాయి మందిరాలు, సంస్థలు లలో సర్వలోక కళ్యాణ అర్థం ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా సాయి భక్తులు ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో పాల్గొనడం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సాయి భక్తులు శంకర్ రెడ్డి, రంగారెడ్డి , నాగేశ్వర్ రెడ్డి ,నాగరాజు , కృష్ణుడు, శివరామిరెడ్డి తదితరులతో పాటు స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సిరివెళ్ల సర్పంచ్ బరిలో జనసేన పసుల నరేంద్ర.. నామినేషన్ దాఖలు



నంద్యాల:సిరివెళ్ల =నవంబర్ =15 ప్రజాజ్యోతి సిరివెళ్ల: నంద్యాల జిల్లా సిరివెళ్ల మండల మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ ఎన్నికల నేపథ్యంలో జనసేన పార్టీ అభ్యర్థి పసుల నరేంద్ర సర్పంచ్ పదవికి తన నామినేషన్ దాఖలు చేశారు. సిరివెళ్ల గ్రామ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఎన్నికల బరిలో దిగుతున్నట్లు ఆయన తెలిపారు. గ్రామంలో తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ, వీధిలైట్లు తదితర సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఆయనకు మద్దతుగా నిలిచి ఎన్నికల్లో విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

జనసందోహం మధ్య నాయక్ ముజఫర్ హుస్సేన్ శిరివెళ్ల సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్.

ప్రజా ప్రతినిధులు వైసీపీ ప్రముఖులు మాజీ ప్రతినిధులు వెంట వచ్చి నాయక్ ముజఫర్ హుస్సేన్ గారి నామినేషన్ దాఖలుకు మద్దతుగా నిలిచిన జనం?



నంద్యాల సిరివెళ్ల:నవంబర్=15 ప్రజాజ్యోతి శిరివెళ్ల (మేజర్ గ్రామ పంచాయతీ).శిరివెళ్ల మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా నాయక్ ముజఫర్ హుస్సేన్ గారి నామినేషన్ జన సందోహం మధ్య కొనసాగింది. మాజీ ప్రజా ప్రతినిధులు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ప్రముఖులు ప్రజలు బంధుమిత్రులు అభిమానులు తరలి వచ్చి ముజఫర్ హుస్సేన్ గారి నామినేషన్ కు మద్దతుగా నిలిచారు. మంచికి మానవత్వానికి స్నేహభావానికి నిదర్శనంగా ముజఫర్ హుస్సేన్ శిరివెళ్ల మేజర్ గ్రామ పంచాయతీలో మంచి పేరు కలిగి ఉండడంతో ముజఫర్ హుస్సేన్ నామినేషన్ కార్యక్రమానికి కాదరభాదర,వెంకటేశ్వర పురం, కొట్టాలపల్లె శిరివెళ్ల గ్రామాల నుండి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు నాయక్ ప్రముఖులు నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. శిరివెళ్ల గ్రామ పంచాయతీ పరిధిలో అభివృద్ధి సంక్షేమంతో పాటు ప్రధాన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ముజఫర్ హుస్సేన్ నామినేషన్ అనంతరం ఆయన పేర్కొన్నారు. శిరివెళ్ల గ్రామంతో పాటు మజారా గ్రామాల అభివృద్ధికి ప్రధాన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ ఆదర్శవంతమైన పంచాయతీగా తీర్చిదిద్దుతానన్నారు. సమిష్టి నిర్ణయం సమిష్టి కృషితో ప్రజా సేవకునిగా శిరివెళ్లను ప్రగతి పథంలో కొనసాగిస్తానని ముజఫర్ నాయక్ ఆన్నారు.

నూతన వదూవరులను ఆశీర్వదించిన బీసీ.ఇందిరారెడ్డి



బనగానపల్లె:నవంబర్=15 ప్రజాజ్యోతి సంజామల మండల కేంద్రానికి చెందిన శ్రీమతి తొమ్మండ్రు భాగ్యలక్ష్మి మరియు రవికుమార్ దంపతుల ఆహ్వానం మేరకు నంద్యాల పట్టణంలోని యస్. ఎల్ ఎన్ యస్ వైభవం ఫంక్షన్ హాల్ నందు ఏర్పాటు చేసిన వారి కుమార్తె వివాహ వేడుకకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన శ్రీమతి బీసీ ఇందిరా రెడ్డి

నూతన వదూవరులను ఆశీర్వదించిన కాటసాని రామిరెడ్డి



బనగానపల్లె:నవంబర్=15 ప్రజాజ్యోతి బేతంచర్ల పట్టణం శ్రీ సాయి బాబా కళ్యాణ మండపం లో బనగానపల్లె మండలం రామకృష్ణాపురం గ్రామానికి చెందిన చింతల కేశవ రావు గారి కుమార్తె వివాహానికి హాజరు అయి నూతన వధూవరులను ఆశీర్వదించిన బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

రైతాంగంపై తీవ్ర ప్రభావం

-మొదటిపేజీ తరువాయి

పంట నష్టం సంభవించినట్లు వెల్లడించారు. ఉద్యాన పంటలకూ భారీ నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు.

1,385 కిలోమీటర్ల రోడ్లు ధ్వంసం

తుపాను ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా మౌలిక వసతులు దెబ్బతిన్నాయి. సుమారు 1,385 కిలోమీటర్ల మేర రహదారులు దెబ్బతినడంతో రూ.888 కోట్ల నష్టం జరిగినట్లు ప్రభుత్వ నివేదికలో పేర్కొన్నారు. ఆకస్మిక వరదల కారణంగా ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు, విద్యుత్ స్తంభాలు తీవ్రంగా దెబ్బతిన్నాయని కేంద్ర బృందం వెల్లడించింది.

విద్యుత్ వ్యవస్థకు భారీ నష్టం

తుపాను ప్రభావంతో విద్యుత్ రంగంలోనూ తీవ్ర నష్టం జరిగింది. రాష్ట్రవ్యాప్తంగా 10,192 హెచ్‌టీ (11 కేవీ) స్తంభాలు, 6,442 ఎల్‌టీ స్తంభాలు, 1,448 ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నాయి. అంతేకాకుండా 3,859 ఇళ్లు ధ్వంసమైనట్లు అధికారులు గుర్తించారు. సహాయక చర్యల కోసం ప్రభుత్వం ఇప్పటికే రూ.37 కోట్లు ఖర్చు చేసినట్లు కేంద్ర బృందానికి సమర్పించిన నివేదికలో వివరించింది.

ఉద్యాన పంటలకు రూ.337 కోట్ల నష్టం

ఉద్యాన రంగంలో 6,756 హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నాయి. దీంతో సుమారు రూ.337 కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు ప్రాథమికంగా అంచనా వేశారు. మామిడి, బొప్పాయి వంటి పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయని కేంద్ర బృందం తెలిపింది. పత్తి రైతుల్లో చాలామంది అధిక బీమా



ప్రీమియం కారణంగా పంటల బీమా చేయించుకోలేకపోయారని పేర్కొంది.

60 ప్రాంతాల్లో కేంద్ర బృందం పర్యటన

కేంద్ర హోంశాఖ సంయుక్త కార్యదర్శి చిత్తరంజన్ దాస్ నేతృత్వంలోని ఏడుగురు సభ్యుల బృందం రెండు బృందాలుగా విడిపోయి బాపట్ల, పల్నాడు, ఏలూరు, తూర్పుగోదావరి జిల్లాల్లో పర్యటించింది. సుమారు 60 ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలించింది. చీరాల, బాపట్ల, పర్చూరు, చిలకలూరిపేట, సూరప్పగూడెం, నిడమర్రు తదితర ప్రాంతాల్లో పంట పొలాలు, కాలువలు, రహదారులు, విద్యుత్ వ్యవస్థను పరిశీలించింది. మత్స్యకారుల బోట్లకు జరిగిన నష్టాన్ని కూడా అంచనా వేసింది. బాధిత రైతులు, మత్స్యకారులతో నేరుగా మాట్లాడి వివరాలు సేకరించింది.

వరి పంటకు 90 శాతం వరకు నష్టం

కేంద్ర బృందం పరిశీలనలో తూర్పుగోదావరి జిల్లాలో వరి పంటకు 80 శాతం, ఏలూరు జిల్లాలో 90 శాతం వరకు నష్టం జరిగినట్లు గుర్తించింది. గతంలో వచ్చిన అర్నబ్ తుపానుతో పోలిస్తే మురసు తుపాను ప్రభావం కొన్ని ప్రాంతాల్లో అధికంగా ఉందని వివరించింది. అయితే ప్రభుత్వం ముందస్తుగా కాలువలు, వాగుల్లో పూడికతీత పనులు చేపట్టడం వల్ల వరద నష్టం తీవ్రత కొంతమేర తగ్గిందని పేర్కొంది.

బాధితులకు అదనపు సాయం అందించాలి

ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులకు అధిక పరిహారం అందించే అంశాన్ని పరిశీలించాలని కేంద్ర బృందం సూచించింది. తుపాను బాధిత కుటుంబాలకు నెల రోజుల్లో మూడుసార్లు రేషన్ పంపిణీ చేయడం, పాఠశాల విద్యార్థులకు యూనిఫాంలు అందించడం, గిరిజనులకు ప్రత్యేక సాయం కల్పించడం వంటి అంశాలను ప్రభుత్వం పరిశీలించాలని తెలిపింది.

శాశ్వత పరిష్కారానికి కేంద్ర సహకారం

కోస్తాంధ్రకు తరచూ తుపాన్ల ముప్పు ఎదురవుతున్న నేపథ్యంలో భవిష్యత్తులో ఇలాంటి విపత్తులను సమర్థంగా ఎదుర్కొనేలా మౌలిక వసతులను బలోపేతం చేయాలని చంద్రబాబు కోరారు. రహదారులు, విద్యుత్ వ్యవస్థ, సాగునీటి కాలువలు, ఇతర కీలక వసతుల పునరుద్ధరణకు కేంద్రం ప్రత్యేకంగా నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. క్షేత్రస్థాయిలో సేకరించిన వివరాలతో త్వరగా సమగ్ర నివేదిక సమర్పించి రాష్ట్రానికి తక్షణ ఆర్థిక సాయం అందేలా చూడాలని కేంద్ర బృందానికి సూచించారు.

పోలవరం ముంపు ఎఫెక్ట్
మారనున్న మల్కన్‌గిరి-భద్రాచలం రైల్వే రూట్

ఒడిశాలోని మల్కన్‌గిరి నుంచి ఆంధ్రప్రదేశ్?లోని పోలవరం జిల్లా మీదుగా తెలంగాణలో భద్రాచలం, పాండురంగాపురం వరకు నిర్మించనున్న కొత్త రైల్వేలైన్‌లో కొంత భాగం పోలవరం జలాశయ ముంపు ప్రాంత పరిధిలో ఉన్నట్లు తేలింది. దీంతో ఎలైన్‌మెంట్ మార్చేందుకు అధికారులు క్షేత్రస్థాయిలో సర్వే చేస్తున్నారు. మల్కన్‌గిరి నుంచి భద్రాచలం, పాండురంగాపురం వరకు సుమారు 173.61 కిలోమీటర్ల మేర కొత్త రైల్వే లైన్‌ను రైల్వే శాఖ ఇటీవల మంజూరు చేసింది. ఇందులో ఒడిశా పరిధిలో మల్కన్‌గిరి, బడలి, పనిమట రాజన్‌గూడ, లచ్చిపేట, కందపల్లి, మోటు స్టేషన్లు నిర్మిస్తారు. ఆంధ్రప్రదేశ్?లోని పోలవరం జిల్లా పరిధిలో కుయుగూరు, సీతారామపురం, భీమవరం, రాజుపేట స్టేషన్లు వస్తాయి. తెలంగాణలో భద్రాచలం, సారపాక స్టేషన్ల మీదుగా ఈ లైన్ వెళ్తుంది. చివరగా పాండురంగాపురం స్టేషన్ వద్ద ప్రస్తుతమున్న డోర్నకల్-భద్రాచలం రోడ్-మణుగూరు రైల్వే లైన్‌లో ఈ కొత్త మార్గం కలుస్తుంది.

భూసేకరణ వేళ ముంపు గుర్తింపు

ఈ రైల్వే లైన్ ఆంధ్రప్రదేశ్?లోని పోలవరం జిల్లా పరిధిలో ఉన్న చింతూరు, కూనవరం, వరరామచంద్రపురం మండలాల్లో ఏకంగా 65 కిలోమీటర్ల మేర సాగుతుంది. ఈ పరిధిలోనే కుయుగూరు, సీతారామపురం, భీమవరం, రాజుపేట స్టేషన్లు ఏర్పాటు చేయాల్సి ఉంది. అయితే భూసేకరణ కోసం వెళ్లిన రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించగా ఇదంతా పోలవరం ముంపు పరిధిలోకి వస్తుందని గుర్తించారు. దీంతో అత్యధిక భాగం ముంపునకు గురవుతుందని వారు రైల్వే అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. రెవెన్యూ అధికారుల సమాచారంతో రైల్వే అధికారులు



పోలవరం కలెక్టర్‌తో పలు దఫాలు చర్చలు జరిపారు. ముంపు దృష్ట్యా ఇప్పటికే ప్రతిపాదించిన మార్గంలో లైన్ వేయడం సాధ్యం కాదని అధికారులు తేల్చిచెప్పారు. దీంతో ఎలైన్‌మెంట్‌ను మార్చేలా మళ్లీ క్షేత్రస్థాయిలో సర్వే ప్రారంభించారు. పోలవరం ముంపు ఏయే గ్రామాల వరకు ఉందనేది పరిగణనలోకి తీసుకుంటున్నారు. ఆ ముంపు ప్రాంతానికి ఎగువన ఎటువైపు నుంచి లైన్ వేయొచ్చో పరిశీలిస్తున్నారు. ప్రస్తుతం ఈ సర్వే తుది దశకు చేరుకుంది. ఆ వివరాలను త్వరలోనే రైల్వే బోర్డుకు పంపనున్నారు.

తొలుత ఈ ప్రాజెక్ట్ నిర్మాణానికి రూ.2,864 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేశారు. ఇప్పుడు పోలవరం జిల్లాలో ఎలైన్‌మెంట్ మారుతుండటంతో ముందుగా అనుకున్న స్టేషన్ల స్థానంలో కొత్తవి నిర్మించాల్సి వస్తుంది. భౌగోళిక పరిస్థితుల దృష్ట్యా కొన్ని చోట్ల టన్నెల్స్ (సొరంగాలు) కూడా నిర్మించాల్సి ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. వీటన్నింటి నేపథ్యంలో ప్రాజెక్ట్ వ్యయం పెరిగే అవకాశం ఉందని రైల్వే వర్గాలు చెబుతున్నాయి. ఈ రైల్వే లైన్ నిర్మాణానికి అత్యధికంగా అటవీ భూములే అవసరం కానున్నాయి.

అల్లూరి జిల్లాకు పర్యాటకుల క్యూ
ఆతిథ్యానికి అటవీ శాఖ రెడీ

చలికాలం వచ్చేసింది. మంచు సోయగాలను ఆస్వాదించేందుకు అల్లూరి జిల్లాకు పర్యాటకుల రాక మొదలైంది. ఈ నేపథ్యంలోనే ఏజెన్సీలో పర్యాటక సీజన్ ప్రారంభం కావడంతో సందర్శకులను ఆకట్టుకునేందుకు అటవీ శాఖ సన్నద్ధమైంది. ఇప్పటివరకు అడవుల పరిరక్షణకే పరిమితమైన అటవీ శాఖ, ఇకపై మన్యానికి వచ్చే టూరిస్ట్?లకు స్వయంగా అతిథి మర్యాదలు చేయనుంది. ఈ మేరకు సందర్శకులకు వసతులు కల్పించేలా చింతపల్లి అటవీ డివిజన్‌లో ఎకో టూరిజం ప్రాజెక్టులను లాంఛనంగా ప్రారంభించింది. ఈ ఏడాది పూర్తిస్థాయిలో పర్యాటకులకు ఆతిథ్యం ఇచ్చేలా సర్వం సిద్ధం చేసింది.

రాష్ట్ర ప్రభుత్వం మన్యంలో పర్యాటకాన్ని పెంపొందించేలా అడుగులు వేస్తోంది. ఈ క్రమంలోనే చింతపల్లి రేంజ్ పరిధిలోని కృష్ణాపురం పైనస్ తోటల్లో ఎకో టూరిజం అభివృద్ధికి రూ.60 లక్షలు కేటాయించింది. ఈ నిధులతో ఇప్పటికే అడవిలో పలు సదుపాయాలు కల్పించారు. దీనికి తోడు తాజాగా ఇక్కడ 'వనవిహారి' ప్రాజెక్టు పేరిట అదనంగా మరో రూ.70 లక్షలు విడుదల చేసింది. సందర్శకులు బస చేసేందుకు వీలుగా అన్ని సదుపాయాలతో కూడిన మూడు టెంటెడ్ కాటేజీలను సిద్ధం చేశారు. వీటితో పాటు పైనస్ తోటల్లో ప్రకృతి అందాలను ఆస్వాదించేలా ప్రత్యేక గుడారాలను ఏర్పాటు చేశారు.

ఆటవిడుపు కోసం ప్రత్యేక పార్కులు

కుటుంబాలతో సహా వచ్చే పర్యాటకులను ఆకట్టుకునేలా అటవీ శాఖ ప్రత్యేక దృష్టి పెట్టింది. పిల్లలు ఆడుకునేందుకు 'చిల్డ్రన్స్ ప్లే ఏరియా' పేరిట ప్రత్యేకంగా ఓ పార్కును



నిర్మించింది. ఇందులో ఊయలలు, జారుడు బల్లలు తదితర ఆటవస్తువులను సమకూర్చారు. సందర్శకులకు ఆటవిడుపుగా ఉండేందుకు ఆర్చరీ లాంటి క్రీడలతో అడ్వంచర్ పార్క్‌ను ఏర్పాటు చేస్తున్నారు. మన్యంలో లభించే చిరుధాన్యాలు, స్థానిక రుచులతో తయారు చేసిన ఆహార పదార్థాలను అందించేలా ప్రత్యేకంగా ఆహారశాలను నిర్మించారు. టూరిస్ట్?లు ఫొటోలు దిగేందుకు వీలుగా ప్రత్యేక సెట్టింగులు ఏర్పాటు చేశారు.

చింతపల్లి అటవీ శాఖ పరిధిలోని కృష్ణాపురంలో పైనస్ వృక్షాలు ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయి. చలికాలంలో ఈ వృక్షాల వద్ద ఉదయం పూట దట్టంగా మంచు అలుముకుంటుంది. ఈ ప్రకృతి సోయగం చూపరులను అమితంగా ఆకట్టుకుంటుంది. మంచు అందాలను ఆస్వాదించేందుకు దూర ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులు ఇక్కడ ఆగి ఫొటోలు దిగుతుంటారు. అందుకే అతిథి పర్యాటకం ప్రాజెక్టుకు పైనస్ వృక్షాలున్న కృష్ణాపురాన్నే అటవీ శాఖ ఎంపిక చేసింది. పర్యావరణానికి ఎలాంటి హాని తలపెట్టకుండా పూర్తిగా సహజసిద్ధ వనరులతోనే ఇక్కడ ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు.

ఈ ఏడాది దూర ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకుల కోసం అటవీ శాఖ ఆధ్వర్యంలో పకడ్బందీగా ఏర్పాట్లు చేశామని డీఎఫ్ఓ నరసింహారావు తెలిపారు. వనవిహారి ప్రాజెక్టు అమలులో భాగంగా ప్రత్యేక వసతులు కల్పిస్తున్నామని చెప్పారు. కేరళలో ప్రాచుర్యం పొందిన సెమీ పర్మినెంట్ కాటేజీలను ఇక్కడ మూడు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. వీటిల్లో డబుల్ బెడ్‌రూం, లివింగ్, డ్రస్సింగ్, వాషింగ్ రూం, అత్యాధునిక మరుగుదొడ్లు ఉంటాయన్నారు. చిన్నారుల కోసం ప్రత్యేకంగా చిల్డ్రన్ పార్క్, సాహస క్రీడల కోసం అడ్వంచర్ పార్క్‌తో పాటు ప్రత్యేకంగా వాకింగ్ ట్రాక్ కూడా సిద్ధం చేశామని నరసింహారావు వెల్లడించారు.

పట్టణ పోరుకు టీడీపీ అభ్యర్థుల ఖరారు..

-మొదటిపేజీ తరువాయి

పొన్నూరు: కంద్రు విజయలక్ష్మి
కందుకూరు: పిడికిటి వెంకటేశ్వర్లు
ఆమదాలవలస: కూన ప్రమీల
గూడూరు: చౌటూరి శిరీష

నగర పంచాయతీలకు అభ్యర్థుల ప్రకటన

నగర పంచాయతీ ఛైర్మన్ అభ్యర్థులుగా నలుగురిని పార్టీ ఖరారు చేసింది.
చింతలపూడి: కె. ఎస్తేర్ రాణి
పొదిలి: వరికుంట్ల అనిల్ కుమార్
అల్లూరు: తోటకూర సునీల్ కుమార్
బి. కొత్తకోట: కుడుము శ్రీనివాసులు

23 పట్టణ స్థానిక సంస్థల్లో ఎన్నికలు

రాష్ట్రవ్యాప్తంగా మిగిలిన 23 పట్టణ స్థానిక సంస్థలకు నవంబర్ 26న పోలింగ్ నిర్వహించనున్నారు. ఇందులో నాలుగు కార్పొరేషన్లు, 16 మున్సిపాలిటీలు, మూడు నగర పంచాయతీలు ఉన్నాయి. నవంబర్ 30న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు.

కూటమి పార్టీల్లో ఎన్నికల సందడి

ఈ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న కూటమి పార్టీలు అభ్యర్థుల ఎంపిక, ప్రచార వ్యూహాలపై దృష్టి సారించాయి. ఇప్పటికే బీజేపీ తాను పోటీ చేసే స్థానాల్లో అభ్యర్థులను ప్రకటించింది. తాజాగా జనసేన పార్టీ కేంద్ర కార్యాలయం కూడా తమ అభ్యర్థుల పేర్లను ఆదివారం సాయంత్రం అధికారికంగా వెల్లడించింది. దీంతో పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల వాతావరణం మరింత వేడెక్కింది.

పట్టణ ఎన్నికల బరిలో జనసేన..

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో మిగిలిన పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో జనసేన పార్టీ అభ్యర్థులను ఖరారు చేసింది. రెండు మున్సిపల్ కార్పొరేషన్లలో మేయర్ పదవులకు, మూడు మున్సిపాలిటీల్లో ఛైర్మన్ స్థానాలకు పోటీ చేసే అభ్యర్థుల పేర్లను పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ ప్రకటించారు. ఈ మేరకు జనసేన పార్టీ కేంద్ర కార్యాలయం ఆదివారం సాయంత్రం అధికారిక ప్రకటన విడుదల చేసింది.

రెండు కార్పొరేషన్లకు మహిళా అభ్యర్థులు

శ్రీకాకుళం, కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ల మేయర్ పదవులకు జనసేన మహిళా నేతలకు అవకాశం కల్పించింది.
- శ్రీకాకుళం: డాక్టర్ దానేటి రాధారాణి
- కాకినాడ: ఆకుల భవాని

ఈ రెండు కీలక నగరాల్లో మహిళా అభ్యర్థులను ఎంపిక చేయడం ద్వారా పార్టీ నాయకత్వం వారికి ప్రాధాన్యత ఇచ్చింది.

మూడు మున్సిపాలిటీలకు అభ్యర్థులు

మున్సిపల్ ఛైర్మన్ స్థానాలకు పోటీ చేసే అభ్యర్థుల వివరాలను కూడా పార్టీ వెల్లడించింది.
- రాజాం: బనిశెట్టి సౌజన్య లత
- భీమవరం: డాక్టర్ చుండూరి మల్లేశ్వరి
- తాడేపల్లిగూడెం: పాలూరు వెంకటేశ్వరరావు

సమీక్షల అనంతరం ఎంపిక

స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ తరఫున సమర్థులైన నాయకులను బరిలోకి దించాలనే లక్ష్యంతో జనసేన నాయకత్వం కసరత్తు చేసినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. క్షేత్రస్థాయిలో సమీక్షలు నిర్వహించడంతో పాటు పార్టీ శ్రేణుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాతే పవన్ కల్యాణ్ అభ్యర్థులను ఖరారు చేసినట్లు పేర్కొన్నాయి. అభ్యర్థుల ప్రకటనతో ఆయా ప్రాంతాల్లో జనసేన శ్రేణులు ఎన్నికల ప్రచారానికి సిద్ధమవుతున్నాయి.

నవంబర్ 26న పోలింగ్

రాష్ట్రంలో ఇటీవల ఎన్నికలు జరగకుండా మిగిలిన పట్టణ స్థానిక సంస్థలకు నవంబర్ 26న పోలింగ్ నిర్వహించనున్నారు. ఈ విడతలో మొత్తం 23 పట్టణ స్థానిక సంస్థలకు ఎన్నికలు జరగనున్నాయి. వీటిలో నాలుగు కార్పొరేషన్లు, 16 మున్సిపాలిటీలు, మూడు నగర పంచాయతీలు ఉన్నాయి. నవంబర్ 30న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. ఇప్పటికే బీజేపీ కూడా తాను పోటీ చేసే స్థానాల్లో అభ్యర్థులను ప్రకటించగా, తాజాగా జనసేన అభ్యర్థుల ప్రకటనతో కూటమి పార్టీల ఎన్నికల సన్నాహాలు మరింత ఊపందుకున్నాయి.

బలపడుతున్న వాయుగుండం



-మొదటిపేజీ తరువాయి

కొనసాగుతోంది. ఇది గంటకు సుమారు 10 కిలోమీటర్ల వేగంతో ఉత్తర దిశగా కదులుతోంది. ప్రస్తుతం చెన్నైకి 840 కిలోమీటర్లు, విశాఖపట్నానికి 1,010 కిలోమీటర్లు, ఒడిశాలోని గోపాల్‌పూర్‌కు 1,130 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉన్నట్లు వాతావరణ శాఖ వెల్లడించింది.

తీవ్ర తుపానుగా మారే అవకాశం

వాయుగుండం దక్షిణ, మధ్య పశ్చిమ బంగాళాఖాతంలో తుపానుగా బలపడే సూచనలు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. ఈ నెల 17వ తేదీ సాయంత్రానికి తీవ్ర తుపానుగా మారే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. అనంతరం మరో రెండు రోజుల్లో మరింత బలపడి ఆంధ్రప్రదేశ్ తీరం వైపు కదిలే అవకాశముందని పేర్కొంటున్నారు.

19 నుంచి భారీ వర్షాలు

తుపాను ప్రభావంతో ఈ నెల 19వ తేదీ నుంచి కోస్తాంధ్రలో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. కొన్ని ప్రాంతాల్లో అత్యంత భారీ వర్షాలు నమోదయ్యే పరిస్థితులు ఉన్నాయని వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది. తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అధికారుల సూచనలు పాటించాలని సూచిస్తున్నారు.

పోర్టులకు నంబర్-1 హెచ్చరిక

తుపాను ముప్పు నేపథ్యంలో కళింగపట్నం మినహా రాష్ట్రంలోని అన్ని పోర్టులకు నంబర్-1 ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. సముద్రంలో వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేనందున మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లే విషయంలో అధికారుల సూచనలు పాటించాలని హెచ్చరిస్తున్నారు.

రాడార్లతో నిరంతర పర్యవేక్షణ

వాయుగుండం కదలికలు, దిశ, తీవ్రతలో వస్తున్న మార్పులను వాతావరణ శాఖ అధికారులు వెదర్ డాప్లర్ రాడార్ల ద్వారా నిశితంగా పరిశీలిస్తున్నారు. తుపాను గమనం, తీరం దాటే ప్రాంతం, తీవ్రతపై తదుపరి బులెటిన్లలో మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

వాతావరణ శాఖ తాజా అంచనా

నవంబర్ 15న విడుదల చేసిన ఐఎండీ బులెటిన్ ప్రకారం ఈ వ్యవస్థ నవంబర్ 16న తుపానుగా, 17న తీవ్ర తుపానుగా బలపడే అవకాశం ఉంది. అనంతరం ఆంధ్రప్రదేశ్ తీరం దిశగా కదలవచ్చని అంచనా వేసింది. అయితే తుపాను తీరం దాటే ప్రాంతం, సమయం ఇంకా ఖరారు కాలేదు.

ప్రజలకు సూచన: తీర ప్రాంత ప్రజలు వాతావరణ శాఖ తాజా హెచ్చరికలను గమనించాలి. మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లే ముందు అధికారిక సూచనలు తప్పనిసరిగా పాటించాలి. భారీ వర్షాల నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.


పంచాయతీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలి

సీపీఎం నాయకుడు మేకల నాగేశ్వరరావు పిలుపు



కూనవరం నవంబర్ 15, (ప్రజా జ్యోతి ప్రతినిధి కిరణ్ బాబు), కూనవరం: స్థానిక పంచాయతీ ఎన్నికల్లో పార్టీ బలపరిచిన అభ్యర్థుల గెలుపు కోసం ప్రతి నాయకుడు, కార్యకర్త సమష్టిగా కృషి చేయాలని ఎంపీటీసీ పాయం సీతారామయ్య పిలుపునిచ్చారు.కూనవరం మండలంలోని సీపీఎం పార్టీ కార్యాలయం మార్తా శ్రీరామమూర్తి భవనంలో ఆదివారం సీపీఎం కార్యకర్తల సమావేశం మేకల నాగేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా పాయం సీతారామయ్య మాట్లాడుతూ ప్రతి నాయకుడు తమ తమ పంచాయతీ పరిధిలో ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేసి, పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని కోరారు. కార్యకర్తలంతా ఐక్యంగా పనిచేసి పంచాయతీ ఎన్నికల్లో పార్టీ బలాన్ని నిరూపించాలని అన్నారు.ఈ సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి బాబు బొర్రయ్య, మండల కమిటీ సభ్యులు పాయం సత్యనారాయణ, తాలూరి శ్రీనివాసరావు బొగ్గ సుబ్బయ్య, బొగ్గ రామారావు, తెల్లం తమ్మయ్య, వియిక కన్నయ్య, మాజీ సర్పంచ్ సోడా శంకర్, కర్నాటి నారాయణ, చౌడే శ్రీరాములు, నూప రాజు తదితరులు పాల్గొన్నారు.ం

కోవెలకుంట్లలో పంచాయతీ ఎన్నికలకు పోలీసుల ప్రత్యేక నిఘా



కోవెలకుంట్ల:నవంబర్=15 ప్రజాజ్యోతి పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో కోవెల కుంట్ల మండలంలో పోలీసు శాఖ అప్రమత్త మైంది. మండల పరిధిలోని వివిధ గ్రామా ల్లో ఉన్న సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయనున్నట్లు కోవెల కుంట్ల సీఐ హనుమంతు నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా శనివారం ఆయన మాట్లా డుతూ.. ఎన్నికల సమయంలో గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడిం చారు. ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో అలజ డులు సృష్టించే ప్రయత్నాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే అనుమానాస్పద వ్యక్తులపై ముందస్తు చర్యల్లో భాగంగా బైండోవర్ కేసులు నమోదు చేస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, సజావుగా జరిగేలా ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని, ఎన్నికల నియమ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సీఐ హనుమంతు నాయక్ సూచించారు.

మాల శ్రీనివాసులు కుటుంబానికి అండగా నిలిచిన రంగయ్య




నందవరం నవంబర్ 15(ప్రజా జ్యోతి): హాలహర్వి గ్రామానికి చెందిన మాల శ్రీనివాసులు మృతి పట్ల సమతా సైనిక్ దళ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధికార ప్రతినిధి చలువాడి రంగయ్య తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శ్రీనివాసులు పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం తనవంతుగా ఆర్థిక సహాయం అందించి మనోధైర్యం కల్పించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, రాజకీయంగా ఓటములు ఎదురైనా ప్రజాసేవలో వెనకడుగు వేయకుండా, ఆపదలో ఉన్న జాతి బిడ్డలకు ఆర్థికంగా అండగా నిలుస్తున్న రంగయ్య సేవలు అభినందనీయమన్నారు. బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయాలను ఆదర్శంగా తీసుకుని పల్లె నుంచి పట్టణం వరకు సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సమతా సైనిక్ దళ్ నాయకులు పరమేష్, రాముడు, రియాష్, వెంకటేష్ తదితరులు పాల్గొని కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

జడ్పీ చైర్మన్ పదవి చూడి ఉలిగయ్యకే ఇవ్వాలి!

:-పార్టీ కోసం 40 ఏళ్లుగా నిరంతర సేవలు.. ఆయన సేవలను గుర్తించాలి

నదిచాగి టీడీపీ యువ నాయకుడు రామన్న గౌడ్ డిమాండ్



కౌతాళం,నవంబర్ 15 ప్రజా జ్యోతి తెలుగు దేశం పార్టీ కోసం దాదాపు 40 ఏళ్లుగా నిరం తరం కృషి చేస్తూ,పార్టీ అభివృద్ధికి అంకితభా వంతో పనిచేసిన చూడి ఉలిగయ్యకు కర్నూలు జిల్లా పరిషత్ చైర్మన్ పదవిని కేటాయించాలని నదిచాగి టీడీపీ యువ నాయకుడు రామన్న గౌడ్ డిమాండ్ చేశారు.దశాబ్దాలుగా పార్టీకి సేవలందిస్తూ, ఎన్నో కష్టనష్టాలను ఎదుర్కొం టూ పార్టీ బలోపేతానికి కృషి చేసిన ఉలిగయ్య సేవలను పార్టీ అధిష్టానం గుర్తించాలని కోరారు. పార్టీ కోసం జీవితంలో విలువైన 40 ఏళ్ల కాలాన్ని అంకితం చేసిన ఆయనకు జడ్పీ చైర్మన్ పదవి ఇవ్వడం ద్వారా తగిన గుర్తింపు కల్పించాలని రామన్న గౌడ్ తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.పార్టీ కోసం నాలుగు దశాబ్దాలు గా పనిచేసిన చూడి ఉలిగయ్యకు జడ్పీ చైర్మన్ పదవి కేటాయించాలని రామన్న గౌడ్ డిమాండ్ చేశారు.

మహానంది - నవనందీశ్వర క్షేత్రం.

మహా నందీశ్వరుడు, అమ్మవారు కామేశ్వరీ దేవి.

నందీశ్వర నమస్తుభ్యం సాంబానందప్రదాయకం.

నంద్యాల శ్రీశైలం:నవంబర్=15ప్రజాజ్యోతి శ్రీ శైలము, మహానంది జంట దేవాలయాలు. జంటగా చెప్పుకుంటాము. అంటే ప్రక్కప్రక్కనే వున్నాయనికాదు. రెండూ కర్నూలు జిల్లాలో ఒకదానికొకటి 175 కిలోమీటర్ల దూరంలో వుంటాయి. నల్లమల అడవులలో శ్రీ శైలం కొండమీద వుంటే, మహానంది దిగువన నంద్యాల పట్టణ సమీపంలో వుంటుంది.

కానీ....

శ్రీ శైలం అనంగానే మహానంది, మహానంది అనంగానే శ్రీశైలం మన మనోఫలకం మీద తళుక్కుమంటాయి. బహుశా శివయ్య, ఆయన వాహనం నంది కదూ అందుకనేమో.ఒకసారి నందికి తన పేరుతో శివక్షేత్రం ఏర్పడాలని మనసులో కోరిక కలిగిందట.

తథ్ఖలితమే....

మహానంది క్షేత్ర ఆవిర్భావం. పేరులోనే వున్నది మహా...నంది. సుమారు1500 ల సంవత్సరాల నాటి ఆలయం.నంద్యాలలో దిగి మహానంది వెలుతుంటే దారి పొడుగునా అరటితోటలు, చుట్టు అలముకున్న నల్లమల అడవులు, సెలయేరుల గలగల, ఆహ్లాదకర వాతావరణం... ఇప్పుడు అప్పుడు అనిలేదు అన్ని కాలాల్లోను భక్తులను ఆకర్షిస్తూనే ఉంటుంది. ఆలయం దరిదాపులకు రాంగానే రండి రండి ఇదే ఆలయం అని చెప్తూ పెద్ద నల్లరాతి నంది నేరుగా ఆలయాన్ని, ఆలయంలోని పరమశివుని చూస్తూ ఆలయం ముందే వుంటుంది. కోనేరులు, రాజ గోపురం, ఆలయం, దాని వెనుక భాగాన కనిపించే ఎత్తైన కొండలు. ప్రకృతి సౌందర్యమంతా ఇక్కడే వుంటుంది.

ఆలయ స్థలపురాణానికి వస్తే .....

నందన మహారాజు గోశాలలో "కపిల" అనే గోవు వుండేది. మిగిలిన ఆవులతో కలసి అరణ్యంలోకి మేతకు వస్తున్న కపిల రోజూ ఆ దాపున వున్న పుట్టలోకి క్షీరాన్ని వదులుతూ వుండేది. అది గమనించిన గోపాలకుడు ఒకరోజు చాటుగా వచ్చి అక్కడ ఏమున్నదో చూడాలని కుతూహలంతో ఇంకా ఇంకా దగ్గరకు వస్తాడు. గోపాలకుని చూసిన గోవు తొట్రుపడి కదులుతుంది. దాని కాళ్లు పుట్ట మీద పడి పుట్ట కొద్దిగా చీలుతుంది. గిట్టల ముద్ర పడుతుంది. పుట్టలో కూచుని రోజూ కపిల గోవు ఇస్తున్న క్షీరాన్ని తాగుతున్న శివయ్య అదే పుట్టరూపంగా మారి పోతాడు.ఇదీ టూకీగా ఈ ఆలయ చరిత్ర. నేటికీ మనం చూసే శివలింగం మీద ఆవు గిట్టల ముద్రలు వుంటాయి.చిన్న శివలింగం. స్వయంభువు. ప్రతిరోజూ ఉదయము, సాయంకాల మూ 6:00 నుంచీ 6:30 వరకూ మహా మంగళ హారతి సమయంలో నిజరూప దర్శనం వుంటుంది. అప్పుడు పుట్ట ఆకారంతో వెలసిన స్వామిని మనం కళ్లారా చూడవచ్చు. అలంకారం అయిన తరువాత రజత నాగాభరణంతో పుష్పాలం కారాలతో పుట్ట కనిపించదు. శివలింగం మీద ఆవు గిట్టల ముద్రలు వున్నట్లు కనబడతాడు. గర్భాలయంలోని శివలింగం కిందనుంచీ ఐదు జలధారలు ఉద్భవించి నిరంతరం నీరు ఊరుతూ వుంటుంది. స్పర్శ దర్శన సమయంలో శివలింగాన్ని స్పృశించినపుడు మన చేతులకు తడి తగులుతుంది. ఇదీ గర్భాలయంలో వుండే స్వామి వారి దర్శనం.

ఇహ ఆలయం విషయానికి వస్తే.....

ఆలయం లోపలికి వస్తూనే రెండు పుష్కరిణిలు. బ్రహ్మ గుండం, విష్ణు గుండం. అవి దాటి లోపలి ప్రాకారంలోకి వెలితే రుద్ర గుండమని మరో పుష్కరిణి. ఇదే అసలయిన కోనేరు. ఈ ఆలయ ప్రత్యేకత కూడా ఇదే. గర్భాలయంలో స్వామివారి పీఠభాగంలోనుంచీ వచ్చే ఐదు జలధారలూ అంతర్వాహినిగా వచ్చి నందిముఖంలోనుంచీ ఈ గుండంలోకి వస్తాయి. ఇందులోని నీరు క్లిష్టర్ క్లియర్ గా వుంటాయి. చిన్న గుండుసూది పడినా కనిపించేటంత స్వచ్ఛంగా వుంటాయి. ఈ కోనేరులో స్నానం చేయటం బాగుంటుంది. కోనేరులోని నీటి ఉష్ణోగ్రత కాలానుగుణంగా మారుతూ వుంటుంది. ఎండాకాలం చల్లగానూ. చలికాలం గోరు వెచ్చగానూ వుంటాయి. ఏటెల్లకాలమూ కోనేరులో నీరు సరిగ్గా ఐదు అడుగుల లోతు వుంటాయి. ఏ కాలమూ ఏ మార్పు వుండదు. పుష్కరిణి మధ్యలో వసంతమండపమని ఒక చిన్న మండపం అందులో ఐదు శివలింగాలు వుంటాయి. నందిముఖంగా నీరు రుద్ర గుండంలోకి వస్తే, రుద్ర గుండంలోని నీరు రెండు వేపులా రెండు కాలువల ద్వారా రాజగోపురం బయట వున్న బ్రహ్మ గుండం, విష్ణు గుండాలలోకి వచ్చేలా ఏర్పాటు చేశారు. అక్కడ నుంచీ బయటకు వెళతాయి. అలా వెళ్లిన నీరు నేటికీ 10,000 ఎకరాల ముక్కాల సాగుకు ఉపయోగపడుతుందట. మహానందీశ్వరాలయానికి ఈ కోనేరులే ప్రత్యేక ఆకర్షణ. ఉదయం 5:30 నుంచీ రాత్రి తొమ్మిది గంటల వరకూ నిర్విరా మంగా మహానందీశ్వరుని దర్శనం వుంటుంది. గర్భాలయం లో మహానందీశ్వరుని చూచి బయటికి వస్తే అమ్మవారి ఆలయం. కామేశ్వరీ సన్నిధి. అమ్మ దర్శనం కూడా అయ్యాక క్షేత్రపాలకుడు కోదండరామస్వామి ఆలయం. తెల్లని పాలరాతి సీతారామలక్ష్మణులు, ఆంజనేయస్వామివారల విగ్రహాలు వుంటాయి. ఆ ప్రక్కనే పంచ పాండవులు ప్రతిష్టించిన ఐదు శివలింగాలు. వాటికి చిన్న చిన్న ఆలయాలు వుంటాయి. ఎక్కడ చూసినా శివమయం. దేని ప్రాముఖ్యత దానిదే. నవగ్రహాలు. రాహుకేతులకు ప్రత్యేక మండపం. ఇక్కడ రాహుకేతు గ్రహ శాంతి పూజలు జరుగుతాయట. "వినాయక నందీశ్వరుడు" ఆలయం . నవ నందులలో ఒకటి. మహానంది చుట్టూ సుమారు పదిహేను కిలోమీటర్ల పరిధిలో 'నవనందు ఓలు' అని తొమ్మిది ఈశ్వరాలయాలు వున్నాయి. అందులో ప్రధానమైనది మహానంది. రెండవది వినాయక నందీశ్వరుడు. ఈయనే ఆలయ ప్రాకారంలో వున్న వినాయక నందీశ్వరుడు. ఈ ఆలయంలో శివలింగాన్ని సాక్షాత్తు వినాయకుడు ప్రతిష్టించాడట. గరుడ నంది. మహానందీశ్వరాల యానికి సుమారు అర కిలోమీటరు దూరంలో వుంటుందీ గరుడ నందీశ్వరాలయం.తల్లి వినతను దాస్యవిముక్తురాలిని చేయటం కోసం బయలుదేరిన గరుత్మంతుడు ఇక్కడ ఈశ్వరుని గురించి తపస్సు చేశాడట. గరుత్మంతుడు ప్రతిష్టించటాన గరుడ నందీశ్వరునిగా పిలుస్తారు. అతి పురాతనమైన ఆలయమట. తరువాత సూర్యనంది. గరుడనంది నుంచీ సుమారు 11 కిలోమీటర్ల దూరంలో నంద్యాల వెళ్లే మార్గంలో తమ్మడపల్లి గ్రామంలో సూర్యనందీశ్వరాలయం వస్తుంది. సూర్యుడు శివుని గురించి తపస్సు చేసి ప్రతిష్టించిన లింగం. అమ్మవారు శ్రీ గౌరీ పరమేశ్వరిదేవి.

ఈ ఆలయం చూసుకుని నంద్యాల చేరితే....

ప్రథమ నంది – నంద్యాల పట్టణంలో చామ కాలువ ఒడ్డున" ప్రథమ నంది" ఆలయం ఉన్నది. బ్రహ్మదేవుని కోరిక మేరకు పరమేశ్వరుడు తనకు తానుగా వెలసిన చోటు ప్రథమ నంది. గర్భాలయంలో 'కేదారేశ్వర లింగం' అమ్మ వారు 'కేదారేశ్వరి మాత'. నాగనంది – నంద్యాల ఊరిలో ఆర్టీసీ బస్టాండుకు దగ్గరలో ఉన్న శ్రీ ఆంజనేయ కోదండ రామాలయం ముఖమండపంలో నాగ నందీశ్వరుడు ఉంటాడు.సోమనంది – నంద్యాల పట్టణం ఆత్మకూరు బస్టాండుకు సమీపంలో శ్రీ సోమ నందీశ్వరాలయం వున్నది. చంద్రుడు ప్రతిష్ఠించిన శివలింగం. అమ్మవారు సోమేశ్వరి దేవి. శివనంది – నంద్యాలకు సుమారు 14 కిలోమీటర్లు దూరంలో కడమ కాల్వ



గ్రామంలో "శివ నందీశ్వరాలయం" ఉంది. ఆలయంలో స్వామి రుద్ర నందీశ్వరుడు. అమ్మవారు పార్వతిదేవి. చివరిగా విష్ణునంది. దీనినే కృష్ణనంది అనికూడా అంటారు. శివనందీశ్వరస్వామి ఆలయానికి సుమారు మూడు కిలోమీటర్ల దూరంలో తెలుగు గంగ కాల్వకు సమీపంలో ప్రకృతి అందాల మధ్య "విష్ణు నందీశ్వరాలయం" ఉంది. విష్ణునందీశ్వరుడు, అమ్మవారు భవానీ మాత. దేవాలయం చుట్టూ పురాతన కాలం నాటి కోనేరు, నవగ్రహాలు, వినాయక, విష్ణు, లక్ష్మి మందిరాలు ఉన్నాయి. ఆలయానికి సమీపంలో చక్కని సెలయేరు. ఈ తొమ్మిది నందులను ఒకరోజు సూర్యోదయం నుంచీ సూర్యాస్తమయం లోపు చూడటం విశేషం కార్తీక పౌర్ణమి నాడు స్థానికులు, చుట్టు ప్రక్కల ప్రాంతాల వారు పాద యాత్రగా నవనందులను దర్శిస్తూ 'నంది మండలం' ప్రదక్షిణ చేస్తారూ ముందుగా నంద్యాల బస్టాండు సమీపంలోని మల్లిఖార్జున స్వామిని దర్శించుకుని ఆలయంలోని సాక్షి గణపతికి విన్నవించుకుని ప్రదక్షిణ మొదలు పెడతారూ. నవనందీశ్వరాలయాలన్నీ చూసి తిరిగి మల్లిఖార్జున స్వామి ఆలయానికి చేరుతారూ అంతటితో యాత్ర పూర్తి అవుతుంది. ఎలాగబ్బా ఇన్ని ఆలయాలు వెతుక్కుంటూ వెళ్లాలా అనుకోనవసరం లేదు. ఇక్కడే ఆటోలు, టాక్సీల వాళ్లు వుంటారు. నవనందులను చూపించాలని మాట్లాడుకుంటే వాళ్లే తీసుకు వెళతారు. సుమారు 1000 నుంచీ 1500 ల రూపాయల వరకూ తీసుకుంటారు.స్పర్శ దర్శనానికి, నిజరూప దర్శనానికి టికెట్టు వుంటుంది. 100, 50 అనుకుంటా. అభిషేకానికి 500. ఈ నవనందీశ్వరులలో మహానంది, సూర్యనంది, సోమనంది, శివనంది, విష్ణునంది ఆలయాలు ఉదయం 6 గంట నుంచీ రాత్రి 8 గంటల వరకూ ఎపుడయినా దర్శనం చేసుకోవచ్చు.రోజు మొత్తం దర్శనం వుంటుంది. మిగిలిన వాటికి మధ్యాహ్నం విరామం వుంటుంది.టైములు చూసుకుని ఆ ప్రకారం ప్లాన్ చేసుకుంటే సూర్యోదయం నుంచీ సూర్యాస్తమయంలోపు తేలికగా నవనందులనూ దర్శించుకోవ చ్చు.మన రాష్ట్రంలోనే మనకు కూతవేటు దూరంలో వున్న సుప్రసిద్ధ శివాలయం మరి...ఏదీ మిస్సవకుండా అన్నీచూడం కర్నూలు జిల్లా నంద్యాల నుంచి సుమారు 18 కిలోమీటర్ల దూరంలో వున్నదీ మహానంది.

నమః శివాభ్యాం
వృష వాహనాభ్యాం
విరించి విష్ణీంద్ర సుపూజితాభ్యాం
విభూతి పాటీర విలేపనాభ్యాం
నమో నమః శంకరపార్వతీభ్యాం !!

రెండు రోజుల్లోనే అంతర్‌జిల్లా దొంగల ముఠా అరెస్ట్

రూ.4 లక్షల విలువైన వెండి వస్తువులు, వాహనాలు స్వాధీనం



బాపట్ల నవంబర్ 15 (ప్రజాజ్యోతి జిల్లా ప్రతినిధి) కర్లపాలెం సెంటర్‌లోని ప్రిన్స్ జ్యువెలరీ షాపులో జరిగిన చోరీ కేసును బాపట్ల జిల్లా పోలీసులు రెండు రోజుల్లోనే ఛేదించారు. వరుస దొంగతనాలకు ప్రణాళిక సిద్ధం చేసుకున్న అంతర్‌జిల్లా ముఠాకు చెందిన నలుగురిని అరెస్ట్ చేసి, వారి నుంచి రూ. 4 లక్షల విలువైన 2.387 కిలోల వెండి వస్తువులు, మహీంద్రా థార్ కారు, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ బి. ఉమామహేశ్వర్ ఐపీఎస్ కేసు వివరాలను వెల్లడించారు.ఈ నెల 10వ తేదీ తెల్లవారుజామున కర్లపాలెం సెంటర్‌లోని ప్రిన్స్ జ్యువెలరీ షాపు షట్టర్‌ను గడ్డపార, ఇనుప రాడ్డుతో పగులగొట్టి వెండి ఆభరణాలను దొంగిలించారు. షాపు యజమాని షేక్ అబ్దుల్ ఖాదర్ జిలానీ ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్పీ పర్యవేక్షణలో బాపట్ల డీఎస్పీ సిహెచ్. చంద్ర మౌళి ఆధ్వర్యంలో రూరల్ సీఐ బి. హరికృష్ణ, కర్లపాలెం ఎస్ఐ ఎస్. రవీంద్ర ప్రత్యేక బృందంగా ఏర్పడి సీసీ కెమెరాల ఫుటేజీ, సాంకేతిక ఆధారాలతో నిందితులను గుర్తించారు.వేజెండ్ల జోసెఫ్ అలియాస్ జుషప్ (24), మహమ్మద్ అబ్దుల్ రషీద్ (26), సైదుల మనోజ్ కుమార్ (24), తోమాటి వంశీ (26)లను అరెస్ట్ చేశారు. వీరు బాపట్ల, కర్లపాలెం, చెరుకుపల్లి, అంగళకుదురు, చేబ్రోలు ప్రాంతాల్లో ఇళ్లు, బంగారు ఆభరణాల దుకాణాల వద్ద రెక్కీ నిర్వహించి వరుస దొంగతనాలకు ప్రణాళిక రచించినట్లు ఎస్పీ తెలిపారు.నిందితుల నేర చరిత్రను పరిశీలిస్తే జోసెఫ్‌పై మూడు, రషీద్‌పై ఎనిమిది, మనోజ్ కుమార్‌పై ఒకటి, వంశీపై ఒక కేసు నమోదై ఉన్నాయి. రషీద్‌పై ఉన్న కేసుల్లో ఆరు దొంగతనం, రెండు గంజాయి కేసులు ఉన్నాయి.ఈ కేసును వేగంగా ఛేదించిన డీఎస్పీ సిహెచ్. చంద్ర మౌళి, సీఐ బి. హరికృష్ణ, ఎస్ఐ ఎస్. రవీంద్ర, హెడ్ కానిస్టేబుళ్లు ఐ. నరేష్, కె. శ్రీనివాసరావు, కానిస్టేబుళ్లు వి. శివ శంకర్ రావు, డి. రాకేష్ వర్మ, హోంగార్డు ఎం. దిలీప్ రెడ్డిలను ఎస్పీ అభినందించి నగదు బహుమతులు అందజేశారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ ఎల్. సుధాకర్, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

శబరి ప్రెస్ క్లబ్ నూతన అధ్యక్షుడిగా ప్రేమ్‌నాథ్

కార్యదర్శి గా సత్య ఏకగ్రీవ ఎన్నిక



చింతూరు నవంబర్ 15 ప్రజాజ్యోతి చింతూరు శబరి ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. మండలం లోని మిట్టవాడ గ్రామం వద్ద గల సోకులేరు నది తీరాన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మాజీ శబరి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు మస్తాన్ జానీ అధ్యక్షతన క్లబ్ సభ్యుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా క్లబ్ భవిష్యత్తు కార్యక్రమాలు, జర్నలిస్టుల ఐక్యత, ప్రెస్ క్లబ్ అభివృద్ధిపై సభ్యులు చర్చించారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.అధ్యక్షుడిగా పరంకుశం ప్రేమ్‌నాథ్, కార్యదర్శిగా మనం రిపోర్టర్ సత్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గౌరవాధ్యక్షుడిగా మస్తాన్ జానీ, ఉపాధ్యక్షుడిగా షాజహాన్ ను ఎన్నుకున్నారు.అలాగే స్టీరింగ్ కమిటీ సభ్యులు గా బెజవాడ నరేష్ కుమార్,మునగంటి భాస్కరాచారి,టీ శ్రీను , పెరుమాళ్ దేవుడు, ఎస్.కె. షరీఫ్‌లను ఎంపిక చేశారు. సభ్యులందరూ ఒకే మాటపై నిలిచి నూతన కార్యవర్గానికి మద్దతు తెలపడంతో ఎన్నికలు ఎలాంటి పోటీ, భేదాభిప్రాయాలు లేకుండా ఏకగ్రీవంగా ఆహ్లాదంగా ముగిశాయి.ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ జర్నలిస్టుల మధ్య ఐక్యతను మరింత బలోపేతం చేయాలని, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని అభిప్రాయపడ్డారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల గొంతుకగా నిలుస్తూ, జర్నలిస్టుల సంక్షేమం కోసం అందరూ కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు.నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, కార్యదర్శులతో పాటు కార్యవర్గ సభ్యులకు పలువురు జర్నలిస్టులు అభినందనలు తెలియజేశారు. ఈ సమావేశంలో శబరి ప్రెస్ క్లబ్ సభ్యులు, జర్నలిస్టు మిత్రులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ముత్యాలమ్మ తల్లికి బోనాల సమర్పణ!

ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్న కృష్ణవరం

ప్రత్యేక పూజలు, అభిషేకాలు.. భక్తులతో కిటకిటలాడిన ఆలయం





ఎటపాక, నవంబర్ 15 (ప్రజాజ్యోతి): పోలవరం జిల్లా ఎటపాక మండలం కృష్ణవరం గ్రామంలో నూతనంగా ప్రతిష్ఠించిన శ్రీ ముత్యాలమ్మ అమ్మవారి ఆలయంలో ఆది వారం బోనాల మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహిం చారు. ఈ సందర్భంగా గ్రామంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. తెల్లవారుజాము నుంచే మహిళలు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకుని భక్తిశ్రద్ధలతో అమ్మ వారికి బోనాలు సమర్పించారు. మహోత్సవాన్ని పురస్కరించు కుని ఆలయ అర్చకులు అమ్మవారికి పంచామృత అభిషేకాలు, కుంకుమార్చనలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు.

అనంతరం మహిళలు పసుపు, కుంకుమలతో సర్వాంగసుంద రంగా అలంకరించిన బోనాల కుండలను నెత్తిన ధరించి, డప్పు వాయిద్యాలు, మంగళ వాయిద్యాల నడుమ ఊరేగిం పుగా ఆలయానికి చేరుకున్నారు. భక్తిపారవశ్యంతో అమ్మ వారికి బోనాలు, నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించు కున్నారు. గ్రామంలో పాడిపంటలు సమృద్ధిగా పండాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని భక్తులు అమ్మవారిని ప్రార్థించారు. నూతన ఆలయ ప్రతిష్ఠ అనంతరం నిర్వహించిన ఈ బోనాల మహోత్సవం గ్రామంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. భక్తుల రాకతో ఆలయ పరిసరాలు సందడిగా మారగా, ఎటుచూసినా భక్తి భావం వెల్లివిరిసింది. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు, యువకులు, మహిళలు, గ్రామస్థులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

రూ .2 కోట్ల ఆఫర్‌కు కూటమి నేతల కౌంటర్....
సర్పంచ్ అభ్యర్థి గెలిస్తే రూ.15 కోట్లతో కత్తిపూడి అభివృద్ధి...

వేలంపాట రాజకీయాలు కాదు.. అభివృద్ధిలో పోటీ పడాలి -- వైసీపీ నేతలకు కూటమి నాయకుల సవాల్

గతంలో మీ అభ్యర్థి సర్పంచ్‌గా ఉన్నప్పుడు గ్రామానికి ఎందుకు అభివృద్ధి చేయలేకపోయారు?



శంఖవరం:నవంబర్, 15 (ప్రజాజ్యోతి న్యూస్) కత్తిపూడి గ్రామ సర్పంచ్ ఎన్నిక ఏకగ్రీవం కోసం వైసీపీ నేతలు ప్రకటించిన రూ.2 కోట్ల ఆఫర్‌పై కూటమి నాయకులు ఘాటుగా స్పందించారు. రూ.2 కోట్లతోనే ఆగిపోవాల్సిన అవసరం లేదని, కూటమి బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి వెన్నా పద్మ శివ విజయం సాధిస్తే రూ.15 కోట్ల నిధులతో కత్తిపూడి గ్రామాన్ని సమగ్రంగా అభివృద్ధి చేసి చూపిస్తామని సవాల్ విసిరారు. గ్రామ అభివృద్ధిపై చిత్తశుద్ధి ఉంటే రాజకీయ విమర్శలు, వేలంపాట ప్రకటనలు పక్కనపెట్టి అభివృద్ధి కార్యక్రమాలపై పోటీ పడాలని వైసీపీ నాయకులకు సూచించారు.కత్తిపూడి టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో కూటమి నాయకులు కేళంగి జన, గాబు సుభాష్ మాట్లాడుతూ వైసీపీ నేతలు చేస్తున్న ప్రకటనలను తీవ్రంగా తప్పుబట్టారు. ఇటీవల జరిగిన ఎంపీటీసీ ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పును జీర్ణించుకోలేక వైసీపీ నాయకులు ప్రజల దృష్టిని మళ్లించేందుకు ఇలాంటి ప్రకటనలు చేస్తున్నారని విమర్శించారు. ప్రజల మద్దతు పొందడం కంటే డబ్బు ప్రలోభాలతో రాజకీయాలు చేయాలనుకోవడం సరైన పద్ధతి కాదని అన్నారు.వైసీపీ ప్రభుత్వ హయాంలో కత్తిపూడిలో మీ పార్టీ అభ్యర్థి సర్పంచ్‌గా కొనసాగిన సమయంలో గ్రామ అభివృద్ధికి రూ.2 కోట్లు ఖర్చు చేసి ఉంటే నేడు ఇలాంటి ఆఫర్లు ప్రకటించాల్సిన అవసరం వచ్చేది కాదని ప్రశ్నించారు. అప్పట్లో గ్రామ ప్రజల సమస్యలు, మౌలిక వసతుల కల్పన ఎందుకు గుర్తుకు రాలేదని నిలదీశారు. అధికారంలో ఉన్నప్పుడు చేయలేని అభివృద్ధిని ఇప్పుడు ఎన్నికల సమయంలో ప్రకటనలకే పరిమితం చేయ డం ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నమేనని పేర్కొన్నారు.

రూ.2 కోట్లు కాదు.. రూ.15 కోట్లతో అభివృద్ధి చేస్తాం!

కత్తిపూడి గ్రామ ప్రజలకు అభివృద్ధిపై స్పష్టమైన భరోసా ఇవ్వడమే తమ లక్ష్యమని కూటమి నాయకులు తెలిపారు. కూటమి బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి వెన్నా పద్మ శివను ప్రజలు భారీ మెజారిటీతో గెలిపిస్తే రూ.15 కోట్లతో గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని ప్రకటించారు. ఇప్పటికే రూ.4.35 లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు వెల్లడించారు. రానున్న రోజుల్లో గ్రామంలో దీర్ఘకాలికంగా ఉపయోగపడే మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తామని చెప్పారు.కూటమి ప్రభుత్వం, ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా, కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ సహకారంతో కత్తిపూడి గ్రామ రూపురేఖలు మార్చేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతామని వివరించారు. గ్రామ ప్రజల చిరకాల ఆకాంక్ష అయిన కళ్యాణ మండపం నిర్మాణం, డ్రైనేజీ వ్యవస్థ మెరుగుదల, రహదారులు తదితర మౌలిక వసతుల అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. అర్హులైన నిరుపేదలకు మూడు సెంట్ల ఇంటి స్థలాలు అందించడం, అర్హులకు ప్రభుత్వ పెన్షన్లు మంజూరయ్యేలా కృషి చేయడం వంటి సంక్షేమ కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తామని హామీ ఇచ్చారు.ఎన్నికల సమయంలో కేవలం డబ్బు ఆశ చూపించడం వల్ల గ్రామానికి శాశ్వత అభివృద్ధి జరగదని, ప్రజల అవసరాలను గుర్తించి వాటిని పరిష్కరించే నాయక త్వాన్ని ఎన్నుకోవాల్సిన బాధ్యత ఓటర్లపై ఉందని కూటమి నాయకులు పేర్కొన్నారు. కత్తిపూడి ప్రజలు అభివృద్ధిని కోరుకుంటున్నారని, వారి ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేసే అభ్యర్థి వెన్నా పద్మ శివ అని తెలిపారు. ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా ఆశీస్సులతో ఎన్నికల బరిలో నిలిచిన ఆమెను భారీ మెజారిటీతో గెలిపించాలని గ్రామ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.కత్తిపూడిని రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి పథంలో నడిపించడమే తమ ప్రధాన లక్ష్యమని, గ్రామానికి అవసరమైన నిధులు, ప్రభుత్వ సహకారం తీసుకొచ్చి ప్రజలకు మెరుగైన సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తామని కూటమి నాయకులు స్పష్టం చేశారు.ఈ మీడియా సమావేశంలో జడ్పీటీసీ కంచిబోయిన శ్రీను, సొసైటీ అధ్యక్షుడు గాబు కృష్ణమూర్తి, మాజీ ఎంపీటీసీ సాధనాల లక్ష్మీబాబు, నీటి సంఘం అధ్యక్షుడు దేశిలంక వెంకటరమణ, ఎంపీటీసీలు కొయ్యా రమణ, గాబు శివ,జనసేన నాయకులు కరణం సుబ్రహ్మణ్యం, బిజెపి నాయకులు బొమ్మిడి లావరాజు, నాయకులు పెయ్యల సూర్యనారాయణ, పెయ్యల రామకృష్ణ, రామిశెట్టి వీరబాబు, నక్కా శ్రీను, శివ తదితరులు పాల్గొన్నారు.

చింతూరులో రోడ్డు ప్రమాదం.లారీ ఢీకొని యువకుడు మృతి.



మానవత్వం చాటుకున్న ఎస్ ఐ సంతోష్ కుమార్

చింతూరు నవంబర్ 15 ప్రజాజ్యోతి చింతూరులోని ఫారెస్ట్ గెస్ట్ హౌస్ ముందు ఆదివారం ఉదయం వేగం తో వచ్చిన లారీ ఢీకొని ఒక వ్యక్తి మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే విఆర్ పురం మండలం చింతరేవుపల్లి గ్రామానికి చెందిన ముత్యాల రాజకుమార్ (22) తన స్నేహితుడు దుర్గాప్రసాద్ ఇద్దరు కలిసి మోతుగూడెం సమీపంలోని పోల్లూరు గ్రామంలోని దారాలమ్మ గుడికి ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. చింతూరు చేరగానే లారీ స్పీడ్ గా రావడంతో దుర్గాప్రసాద్ రోడ్డు బయట వైపుకు దూకి ప్రాణాలతో బయటపడ్డాడు. రాజ్ కుమార్ లారీ కిందపడి ప్రాణాలు కోల్పోయాడు. కరెక్టుగా లారీ వెనుక టైర్ల కింద పడటంతో తల మొత్తం చిద్రమైపోయింది. స్నేహితుడు కళ్ళముందే ప్రాణాలు కోల్పోవడంతో దుర్గాప్రసాద్ షాక్ కు గురయ్యాడు. ఈ సమాచారం తెలుసుకున్న చింతూరు ఎస్ఐ సంతోష్ కుమార్ వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని ప్రమాదం జరిగిన తీరుని గమనించారు. మృతుడి వివరాలు తెలుసుకున్నారు. ఎవరు ఏమిటని చూడకుండానే, మృతదేహాన్ని స్వయంగా ఎస్సై రోడ్డు పక్కకి జరిపి మానవత్వాన్ని చాటు కున్నారు. అనంతరం కేసు నమోదు చేసుకొని, మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.



పార్టీ కోసం జీవితాన్నే త్యాగం చేసిన నాయకుడు ఉలిగయ్య.... తెదేపా రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి అడివప్ప గౌడ్

:-జడ్పీటీసి మెంబర్ ఉలిగయ్యకు జిల్లా పరిషత్ చైర్మన్ ఇవ్వాలి,

పార్టీ కోసం అహర్నిశలుగా కృషిచేసిన జడ్పీటీసి మెంబర్ ఉల్లిగయ్య...



కౌతాళ,నవంబర్ 15 ప్రజా జ్యోతి కర్నూల్ జిల్లా పరిషత్ చైర్మన్ పదవిని కౌతాళం మండలంలో అత్యధిక మెజార్టీతో ఘన విజయం సాధించిన జడ్పీటిసి మెంబర్ మరియు టిడిపి సీనియర్ నాయకులు ఉలిగయ్యకు ఇవ్వాలని తెదేపా రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి అడివప్ప గౌడ్ విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా అడివప్ప గౌడ్ మాట్లాడుతూ పార్టీ కోసం తన జీవితాన్నే త్యాగం చేసిన నాయకుడు ఉలిగయ్య అని అన్నారు.దాదాపు పార్టీ కోసం 40 ఏళ్లుగా నిరంతరం కృషి చేశారని అన్నారు. మండలంలో 22 ఎంపిటిసిలు గాను 20, జడ్పిటిసి 9102 ఓట్లు మెజార్టీతో గెలవడం అంటే అది ఆయన వ్యక్తిగత గెలుపు కాదు,ప్రజలు ఆయన మీద పెట్టుకున్న నమ్మకానికి నిదర్శనం అని అన్నారు. ఉలిగయ్య అనుభవం, ఆయన సేవలు ఈ జిల్లాకు ఎంతో అవసరం అని అన్నారు.జెడ్పిటిసి మెంబర్ ఉలిగయ్యకు పట్ల ఏమి ఆలోచించకుండా జిల్లా పరిషత్ చైర్మన్ కచ్చితంగా ఇవ్వాల్సిందే అని అడివప్ప గౌడ్ తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు,మంత్రి లోకేష్ నాయుడు ఉలిగయ్యను గుర్తించి జడ్పీ చైర్మన్ ఇవ్వాలని అడివప్ప గౌడ్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమం లో ఆది బసవరాజు గౌడ,మేటి బసవరాజ్ గౌడ, మారిష మరియు వల్లూరు తెలుగు తమ్ముళ్లు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన..





ప్రజా జ్యోతి జిల్లా బ్యూరో సుబ్బు కంటి చూపు లేకుంటే జీవితం అంధకారమే.. పామిడి పట్టణంలోని వాసవి కళ్యాణ మండపం నందు (15-11-26)(ఆదివారం) పామిడి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి ఆపరేషన్ల మెగా వైద్య శిబిరం నిర్వహించడం జరిగింది. లయన్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు మరియు ప్రభుత్వ ఆయుష్ వైద్యాధికారి డాక్టర్ నల్లపాటి తిరుపతి నాయుడు శంకర కంటి ఆసుపత్రి (బెంగుళూరు) కంటి వైద్య నిపుణులు డాక్టర్ మాట్లాడుతూ.....కంటి సంరక్షణ కొరకు ముందు జాగ్రత్తలు మరియు నివారణ చర్యలు గురించి తెలియజేసారు. బ్యాక్టీరియా, వైరస్,ఫంగస్, సూక్ష్మ క్రిముల నుండి కళ్ళను రక్షించుకోవాలని తెలియజేశారు. కళ్ళు మన శరీరంలో చాలా సున్నితమైన అవయవాలు వాటిని చాలా జాగ్రత్తగా సంరక్షించుకోవాలన్నారు. పామిడి లయన్స్ క్లబ్ అధ్యక్షులు పట్రా శ్రీనివాసులు మాట్లాడుతూ.....కళ్ళు మానవునికి దేవుడిచ్చిన అత్యంత బహుమతి అని అన్నారు.ఈ అందమైన ప్రపంచాన్ని చూపించే అవయవాలు కళ్ళు అన్నారు. కంటి చూపు బాగుంటే ఎవరి పనులు వారే చూసుకోగలరని వ్యాఖ్యానించారు. కంటి వైద్య నిపుణులు డాక్టర కంటి వైద్య శిబిరానికి వచ్చిన 120 మందిని పరీక్షించి అందులో 47. మందిని. కంటి ఆపరేషన్ కు రెఫర్ చేశారు. ఈ శిబిరానికి వచ్చిన వారికి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ వైద్య శిబిరం నందు డిస్టిక్ వైర్ పర్సన్స్ డాక్టర్ శాంతి ప్రియ డాక్టర్ మురళీకృష్ణ జయరాం రావు కమిత్మర్ రఘువీర్ రావు మానవ హక్కుల కమిషన్, పర్యావరణ పరిరక్షణ దక్షణ భారత దేశ సెక్రటరీ ఆవుల ప్రసాద్, క్లబ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పట్రా నరేష్ కుమార్, డైరెక్టర్స్ పట్ర రాకేష్, అంజి నాయక్ నల్లయ శంకర కంటి ఆసుపత్రి ఆర్గనైజింగ్ మేనేజర్ శివ, శంకర హాస్పిటల్ సిబ్బంది మరియు లక్ష్మీ హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

గాలివీడు మండలంలో సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు నామినేషన్ల దాఖలు



గాలివీడు:నవంబర్ 15 ప్రజాజ్యోతి.మండలంలో గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. ఇందులో భాగంగా సర్పంచ్ స్థానాలకు వివిధ గ్రామాల నుంచి నామినేషన్లు అందాయి.

సర్పంచ్ స్థానాలకు దాఖలైన నామినేషన్ల వివరాలు:

- బోరెడ్డిగారిపల్లి -- 1 (టీడీపీ)
- గరుగుపల్లి -- 1 (టీడీపీ)
- ఘోరం చెరువు -- 1 (టీడీపీ)
- నూలివీడు -- 2 (టిడిపి)
- పందికుంట -- 1(టిడిపి)
- తూముకుంట -- 3(టిడిపి)

వార్డు సభ్యుల స్థానాలకు దాఖలైన నామినేషన్ల వివరాలు:


- గరుగుపల్లి -- 1 (టిడిపి)
- ఘోరం చెరువు -- 1(టిడిపి)
- కొర్లకుంట -- 1(టిడిపి)
- తూముకుంట -- 1(టిడిపి)
- వెలిగెళ్ళు -- 1(టిడిపి)
- గోపనపల్లి -- 1(టిడిపి)

ఎంపీడీవో సమాచారం మేరకు మొత్తంగా సర్పంచ్ స్థానాలకు 9 నామినేషన్లు, వార్డు సభ్యుల స్థానాలకు 6 నామినేషన్లు దాఖలయ్యాయి. దీంతో మండలంలో గ్రామ పంచాయతీ ఎన్నికల సందడి మొదలైంది.

గోదావరి తీరాన పరుగుల పండుగకు రంగం సిద్ధం!

డిసెంబర్ 6న భద్రాచలంలో 'అవంతిక గోదావరి రివర్ మారథాన్--2026'
ప్రచారానికి వాకర్స్ క్లబ్, యువ క్రీడాకారుల విశేష స్పందన
5కె నుంచి 42కె వరకు నాలుగు విభాగాల్లో పోటీలు
నవంబర్ 22తో ముగియనున్న రిజిస్ట్రేషన్ల గడువు





ఎటపాక, నవంబర్ 15 (ప్రజాజ్యోతి): మహానగరాలకే పరిమితమైన భారీ మారథాన్ పరుగుల పోటీకి ప్రముఖ పుణ్యక్షేత్రం భద్రాచలం వేదిక కానుంది. పవిత్ర గోదావరి నది తీరాన డిసెంబర్ 6న నిర్వహించనున్న 'అవంతిక గోదావరి రివర్ మారథాన్--2026'కు నిర్వాహకులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ కార్యక్రమంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు చేపట్టిన ప్రచార కార్యక్రమానికి స్థానిక వాకర్స్ క్లబ్ సభ్యులు, పోలీసు ఉద్యోగార్థులు, క్రీడాకారుల నుంచి విశేష స్పందన లభించింది. మారథాన్ ప్రచారంలో భాగంగా ఆదివారం ఉదయం 'సొసైటీ ఫర్ తెలంగాణ రన్నర్స్' బృందం భద్రాచలం జూనియర్ కళాశాల మైదానాన్ని సందర్శించింది. ఉదయపు నడక కోసం వచ్చిన వాకర్స్ క్లబ్ సభ్యులను కలిసి మారథాన్ నిర్వహణ ఉద్దేశం, పోటీల విభాగాలు, రిజిస్ట్రేషన్ వివరాలను తెలియజేశారు. ఈ సందర్భంగా క్లబ్ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తూ తాము కూడా మారథాన్‌లో పాల్గొంటామని, కుటుంబ సభ్యులు, స్నేహితులను సైతం భాగస్వాములను చేస్తామని నిర్వాహకులకు హామీ ఇచ్చారు.

యువతలో ఉత్సాహం.. క్రీడాకారుల మద్దతు

మైదానంలో ఎస్ఐ, పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగాల కోసం శిక్షణ పొందుతున్న అభ్యర్థులు, వివిధ క్రీడా బృందాలు, స్థానిక రన్నింగ్ గ్రూపుల సభ్యులు మారథాన్‌లో పాల్గొనేందుకు ఆసక్తి కనబరిచారు. ప్రతిరోజూ సాధనలో భాగంగా పరుగులు తీస్తున్న యువతకు తమ శారీరక సామర్థ్యాన్ని పరీక్షించుకోవడంతోపాటు, క్రీడల్లో మరింత ఉత్సాహంగా రాణించేందుకు ఈ పోటీలు చక్కటి వేదికగా నిలుస్తాయని నిర్వాహకులు వివరించారు.

గోదావరి అందాలను ప్రపంచానికి చాటేలా..

గోదావరి నది తీరాన భారీ స్థాయిలో మారథాన్ నిర్వహించడం ద్వారా భద్రాచలం ప్రాంత పర్యాటక ప్రాధాన్యతను, తెలంగాణ చరిత్ర, సంస్కృతి, ప్రకృతి అందాలను ప్రపంచానికి పరిచయం చేయడమే ప్రధాన లక్ష్యమని నిర్వాహకులు పేర్కొన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఖమ్మం, కొత్తగూడెం, భద్రాచలం, మణుగూరు, పాల్వంచ, ఇల్లెందు, సత్తుపల్లి తదితర ప్రాంతాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. పరుగులో అనుభవం లేనివారు సైతం పాల్గొనేలా ప్రత్యేకంగా 5కె విభాగాన్ని ఏర్పాటు చేశామని, ఇందులో పరుగెత్తలేని వారు నడుస్తూ కూడా గమ్యాన్ని చేరుకోవచ్చని తెలిపారు. యువతతోపాటు కుటుంబ సభ్యులు, చిన్నారులు, అన్ని వయసుల వారు ఈ పరుగుల పండుగలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

మారథాన్ వివరాలు ఇవే..

డిసెంబర్ 6, 2026 ఆదివారం భద్రాచలంలోని హరిత హోటల్ సమీపంలో ఈ మారథాన్ జరగనుంది. 5కె, 10కె, 21కె (హాఫ్ మారథాన్), 42కె (ఫుల్ మారథాన్) విభాగాల్లో పోటీలు నిర్వహిస్తారు. పాల్గొనే ప్రతి ఒక్కరికీ ప్రత్యేక టీ-షర్ట్, మెడల్‌తోపాటు అల్పాహారం అందిస్తారు. రిజిస్ట్రేషన్లకు నవంబర్ 22 చివరి తేదీ అని, గడువు పొడిగింపు ఉండదని నిర్వాహకులు స్పష్టం చేశారు. గ్రూపులుగా పాల్గొనదలచిన వారు నిర్వాహకులను నేరుగా సంప్రదించవచ్చని సూచించారు. ఆసక్తి ఉన్నవారు వెబ్‌సైట్ ద్వారా వివరాలు తెలుసుకొని పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

షఫీ కుటుంబాన్ని పరామర్శించిన బుట్ట శివ నీలకంఠ



ఏమ్మిగనూరు, నవంబర్ 15 (ప్రజాజ్యోతి): పట్టణంలోని 44వ వార్డులో నివాస గృహం కూల్చివేతతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న షఫీ కుటుంబాన్ని బుట్టా ఫౌండేషన్ అధినేత, మాజీ ఎంపీ బుట్టా రేణుక భర్త బుట్టా శివ నీలకంఠ పరామర్శించారు.ఈ సందర్భంగా కూల్చివేసిన నివాసాన్ని సందర్శించి బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడి వారి పరిస్థితిని, ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. కుటుంబ పరిస్థితిపై స్పందించిన ఆయన ఆర్థిక సహాయం అందజేసి అండగా నిలిచారు. కుటుంబ సభ్యులు అధైర్యపడవద్దని, కష్టకాలంలో అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా కల్పించారు.ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ డి. నజీర్ అహమ్మద్, పట్టణ అధ్యక్షుడు కామర్తి నాగేశప్ప, 44వ వార్డు అభ్యర్థి ఇబ్రహీం, కరే రాము, గుడికల్ అల్తాఫ్, బనవాసి బసిరెడ్డి, తిమ్మాపురం బోయ బజారి, కడివెల్ల ఊరుకుందు గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

తెదేపా పార్టీపై విమర్శలు గుప్పించిన రాజీవ్ రెడ్డి



ఎమ్మిగనూరు, నవంబర్ 15 (ప్రజాజ్యోతి): ఎమ్మిగనూరు మున్సిపల్ ఎన్నికల్లో అధికార కూటమి నేతలు పలు వార్డులు, గ్రామాల్లో రిగ్గింగ్‌కు పాల్పడ్డారని వైసీపీ నియోజకవర్గ ఇంచార్జి రాజీవ్ రెడ్డి ఆరోపించారు. ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 24వ వార్డులో రిగ్గింగ్ జరుగుతోందని వెళ్లగా పోలీసులు తనను అడ్డుకున్నారని, తమ ఏజెంట్లను బెదిరించారని తెలిపారు. టీడీపీకి చెందిన వ్యక్తి 15 ఓట్లు వేసినట్లు ఫొటో ఆధారాలు ఉన్నాయని పేర్కొన్నారు.పార్లపల్లి, నాగులాదిన్నె గ్రామాల్లో తమ ఏజెంట్లను బయటకు పంపించి అక్రమాలకు పాల్పడ్డారని, ఓట్ల వివరాలు అడిగినా అధికారులు ఇవ్వడం లేదని విమర్శించారు. పోలీసులు అధికార పార్టీకి ఒక న్యాయం, ప్రతిపక్షానికి మరో న్యాయం చేయడం సరికాదన్నారు. అలాగే వైసీపీకి మద్దతు తెలిపాడనే కారణంతో షఫీ గుడిసెను ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా కూల్చివేశారని ఆరోపించారు. కూటమి నేతలు రాజకీయ కక్షసాధింపు చర్యలు మానుకొని ప్రజాస్వామ్య విలువలను కాపాడాలని రాజీవ్ రెడ్డి డిమాండ్ చేశారు.

సజీవమైన మానవ మూర్తి డాక్టర్ బాబ్జి

డాక్టర్ బాబ్జి సంస్మరణ సభలో ఆచార్య ప్రసాద రాజు గురూజీ.



పాలకొల్లు. ప్రజాజ్యోతి.రిపోర్టర్ కొట్టి రామం. నవంబర్ 15. ప్రజలందరి మనసులో చిరస్థాయిగా నిలిచి ఉన్నంతవరకు డాక్టర్ బాబ్జి సజీవమైన మానవ మూర్తిగా నిలిచి ఉంటారని ఆచార్య ప్రసాద్ రాజు గురూజీ అన్నారు. ఈ నెల 4న దివంగతులైన పాలకొల్లు పట్టణ ప్రముఖ వైద్యులు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బాబ్జి సంస్మరణ సభ ఆదివారం పాలకొల్లులో త్సవటపల్లి నగర్ లో విద్యావేత్త మద్దాల వాసు అధ్యక్షతన జరిగింది. ఈ సభలో ప్రసాద్ రాజు గురూజీ మాట్లాడుతూ ఓంకారం నుండి శబ్దాంతం వరకు సాగే జీవన యాత్రలో డాక్టర్ బాబ్జి మహోన్నతమైన వ్యక్తిగా ప్రసిద్ధి పొందారన్నారు. డాక్టర్ బాబ్జి నుండి వైద్య సేవలు విద్య, ఆధ్యాత్మిక సామాజిక సేవలు అందుకున్న వారి హృదయాలలో డాక్టర్ బాబ్జి చిరస్థాయిగా నిలిచి ఉంటారన్నారు. రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు వంగా నరసింహారావు మాట్లాడుతూ పుట్టక నీది మరణం నీది మధ్య బ్రతుకంతా సమాజానిది అన్నట్లు డాక్టర్ బాబ్జి తన జీవితమంతా సమాజానికి సేవలందించడానికి వినియోగించారన్నారు. పాలకొల్లు పట్టణ ప్రముఖ వ్యక్తిగా నిలబడటమే కాకుండా పాలకొల్లుకు ఎంతో పేరు ప్రఖ్యాతులు తెచ్చారన్నారు. ఛాంబర్స్ అధ్యక్షులు కారుమూరి నరసింహారావు మాట్లాడుతూ లయన్స్ సేవలతో పాలకొల్లుకు ఎంతో పేరు తెచ్చిన డాక్టర్ బాబ్జి తన లాంటి వారిని సేవా రంగంలో ఎంతో ముందుకు నడిపించారన్నారు. డాక్టర్ కె ఎస్ పి ఎన్ వర్మ మాట్లాడుతూ వారి కుటుంబం నాలుగు తరాలు నుంచి వైద్య సేవలు అందిస్తున్నదని డాక్టర్ బాబ్జి తాను వైద్య రంగం లో నిలిచి కుటుంబ పేరు ప్రతిష్టలను మరింత పెంచారన్నారు. పాలకొల్లు ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు అప్పటి ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి తో సమన్వయంగా ఉంటూ నోటి నుండి సేవలు ఆరోగ్యశ్రీ సేవలను ముందుకు తీసుకు వెళ్లారన్నారు. మద్దాల వాసు మాట్లాడుతూ డాక్టర్ సజీవమైన మానవ మూర్తి డాక్టర్ బాబ్జి.

డాక్టర్ బాబ్జి సంస్మరణ సభలో ఆచార్య ప్రసాద రాజు గురూజీ.

పాలకొల్లు. ప్రజాజ్యోతి.రిపోర్టర్ కొట్టి రామం. నవంబర్ 15. ప్రజలందరి మనసులో చిరస్థాయిగా నిలిచి ఉన్నంతవరకు డాక్టర్ బాబ్జి సజీవమైన మానవ మూర్తిగా నిలిచి ఉంటారని ఆచార్య ప్రసాద్ రాజు గురూజీ అన్నారు. ఈ నెల 4న దివంగతులైన పాలకొల్లు పట్టణ ప్రముఖ వైద్యులు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బాబ్జి సంస్మరణ సభ ఆదివారం పాలకొల్లులో త్సవటపల్లి నగర్ లో విద్యావేత్త మద్దాల వాసు అధ్యక్షతన జరిగింది. ఈ సభలో ప్రసాద్ రాజు గురూజీ మాట్లాడుతూ ఓంకారం నుండి శబ్దాంతం వరకు సాగే జీవన యాత్రలో డాక్టర్ బాబ్జి మహోన్నతమైన వ్యక్తిగా ప్రసిద్ధి పొందారన్నారు. డాక్టర్ బాబ్జి నుండి వైద్య సేవలు విద్య, ఆధ్యాత్మిక సామాజిక సేవలు అందుకున్న వారి హృదయాలలో డాక్టర్ బాబ్జి చిరస్థాయిగా నిలిచి ఉంటారన్నారు. రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు వంగా నరసింహారావు మాట్లాడుతూ పుట్టక నీది మరణం నీది మధ్య బ్రతుకంతా సమాజానిది అన్నట్లు డాక్టర్ బాబ్జి తన జీవితమంతా సమాజానికి సేవలందించడానికి వినియోగించారన్నారు. పాలకొల్లు పట్టణ ప్రముఖ వ్యక్తిగా నిలబడటమే కాకుండా పాలకొల్లుకు ఎంతో పేరు ప్రఖ్యాతులు తెచ్చారన్నారు. ఛాంబర్స్ అధ్యక్షులు కారుమూరి నరసింహారావు మాట్లాడుతూ లయన్స్ సేవలతో పాలకొల్లుకు ఎంతో పేరు తెచ్చిన డాక్టర్ బాబ్జి తన లాంటి వారిని సేవా రంగంలో ఎంతో ముందుకు నడిపించారన్నారు. డాక్టర్ కె ఎస్ పి ఎన్ వర్మ మాట్లాడుతూ వారి కుటుంబం నాలుగు తరాలు నుంచి వైద్య సేవలు అందిస్తున్నదని డాక్టర్ బాబ్జి తాను వైద్య రంగం లో నిలిచి కుటుంబ పేరు ప్రతిష్టలను మరింత పెంచారన్నారు. పాలకొల్లు ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు అప్పటి ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి తో సమన్వయంగా ఉంటూ నోటి నుండి సేవలు ఆరోగ్యశ్రీ సేవలను ముందుకు తీసుకు వెళ్లారన్నారు. మద్దాల వాసు మాట్లాడుతూ డాక్టర్ సజీవమైన మానవ మూర్తి డాక్టర్ బాబ్జి.

డాక్టర్ బాబ్జి సంస్మరణ సభలో ఆచార్య ప్రసాద రాజు గురూజీ.

పాలకొల్లు. ప్రజాజ్యోతి.రిపోర్టర్ కొట్టి రామం. నవంబర్ 15. ప్రజలందరి మనసులో చిరస్థాయిగా నిలిచి ఉన్నంతవరకు డాక్టర్ బాబ్జి సజీవమైన మానవ మూర్తిగా నిలిచి ఉంటారని ఆచార్య ప్రసాద్ రాజు గురూజీ అన్నారు. ఈ నెల 4న దివంగతులైన పాలకొల్లు పట్టణ ప్రముఖ వైద్యులు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బాబ్జి సంస్మరణ సభ ఆదివారం పాలకొల్లులో త్సవటపల్లి నగర్ లో విద్యావేత్త మద్దాల వాసు అధ్యక్షతన జరిగింది. ఈ సభలో ప్రసాద్ రాజు గురూజీ మాట్లాడుతూ ఓంకారం నుండి శబ్దాంతం వరకు సాగే జీవన యాత్రలో డాక్టర్ బాబ్జి మహోన్నతమైన వ్యక్తిగా ప్రసిద్ధి పొందారన్నారు. డాక్టర్ బాబ్జి నుండి వైద్య సేవలు విద్య, ఆధ్యాత్మిక సామాజిక సేవలు అందుకున్న వారి హృదయాలలో డాక్టర్ బాబ్జి చిరస్థాయిగా నిలిచి ఉంటారన్నారు. రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు వంగా నరసింహారావు మాట్లాడుతూ పుట్టక నీది మరణం నీది మధ్య బ్రతుకంతా సమాజానిది అన్నట్లు డాక్టర్ బాబ్జి తన జీవితమంతా సమాజానికి సేవలందించడానికి వినియోగించారన్నారు. పాలకొల్లు పట్టణ ప్రముఖ వ్యక్తిగా నిలబడటమే కాకుండా పాలకొల్లుకు ఎంతో పేరు ప్రఖ్యాతులు తెచ్చారన్నారు. ఛాంబర్స్ అధ్యక్షులు కారుమూరి నరసింహారావు మాట్లాడుతూ లయన్స్ సేవలతో పాలకొల్లుకు ఎంతో పేరు తెచ్చిన డాక్టర్ బాబ్జి తన లాంటి వారిని సేవా రంగంలో ఎంతో ముందుకు నడిపించారన్నారు. డాక్టర్ కె ఎస్ పి ఎన్ వర్మ మాట్లాడుతూ వారి కుటుంబం నాలుగు తరాలు నుంచి వైద్య సేవలు అందిస్తున్నదని డాక్టర్ బాబ్జి తాను వైద్య రంగం లో నిలిచి కుటుంబ పేరు ప్రతిష్టలను మరింత పెంచారన్నారు. పాలకొల్లు ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు అప్పటి ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి తో సమన్వయంగా ఉంటూ నోటి నుండి సేవలు ఆరోగ్యశ్రీ సేవలను ముందుకు తీసుకు వెళ్లారన్నారు మద్దాల వాసు మాట్లాడుతూ డాక్టర్ బాబ్జి 50 ఏళ్ల పాటు వైద్య సేవలు అందించారని 50 లక్షల మంది పేషెంట్లను చూశారని 50 వేలు వరకు ఆపరేషన్లు చేశారని వైద్య రంగాన్ని ఆయన సేవారంగంగా భావించారని అన్నారు. మాజీ మంత్రి చెరుకువాడ శ్రీ రంగనాథరాజు మాట్లాడుతూ తాను అత్తిలి ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు పాలకొల్లు ఎమ్మెల్యేగా ఉన్న బాబ్జి తనకు బాగా పరిచయమయ్యారని ఆయన ఉన్నత విలువల గురించి కలిగిన వ్యక్తిగా గుర్తించానని పార్టీలు వేరైనా తాము కలిసి పని చేశామని అన్నారు. ఎంతో ఉన్నత విలువలు కలిగిన ఇటువంటి వ్యక్తిని డాక్టర్లు రాజకీయ నాయకులు ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. గజల్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఎన్నో రంగాలలో సేవలందించిన డాక్టర్ బాబ్జి లో ఆధ్యాత్మిక భావన ఉండేదని ఆయన మృత్యువు దరిచేరుతున్నా ఆయన నిబ్బరంగానే ఉండేవారన్నారు. పాలకొల్లు లో డాక్టర్ బాబ్జి విగ్రహాన్ని ఏర్పాటు చెయ్యాలని ముందు తరాల వారికి డాక్టర్ బాబ్జి ఆదర్శ జీవితం గురించి తెలుస్తుందన్నారు. డాక్టర్ బాబ్జి మనవడు నిహార్ డాక్టర్ ముచ్చర్ల సంజయ్ అడ్డాల వాసు అడబాల రమణ కొట్టి భాస్కరరావు ముచ్చర్ల శ్రీరామ్ చుండూరి శ్రీరంగ చేగొండి సూర్య ప్రకాష్ అంగర రామ్మోహన్ పట్టణ ప్రముఖులు అభిమానులు డాక్టర్ బాబ్జితో తమకున్న అనుబంధాన్ని తెలిపారు. తొలుత డాక్టర్ బాబ్జి చిత్రపటానికి పుష్పాలతో నివాళులర్పించారు.

కూటమి ప్రభుత్వం బలపరిచిన టిడిపి అభ్యర్థిగా సర్పంచ్ పదవికి నామినేషన్ వేయనున్న నూతక్కి అపర్ణ...!!



జి.కొండూరు :(నవంబర్ 15,ప్రజా జ్యోతి బ్యూరో భట్టిప్రోలు నాగేశ్వరరావు): ఈనెల 26వ తేదీన జరగనున్న గ్రామపంచాయతీ ఎన్నికల్లో భాగంగా జి.కొండూరు మండల పరిధిలోని గడ్డమణుగు గ్రామపంచాయతీ సర్పంచ్ కూటమి ప్రభుత్వం బలపరిచిన తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా మాజీ ఎంపీటీసీ మెంబర్ నూతక్కి అపర్ణ నామినేషన్ వేయనున్నారు. నూతక్కి అపర్ణ గతంలో ఎంపీటీసీ మెంబర్ గా గ్రామంలో మౌలిక వసతులు ఏర్పాటుకు తన వంతు కృషి చేశారని అలాగే పలు సేవా కార్యక్రమాలను నిర్వహించడంతో పాటు... అందర్నీ కలుపుకొని పోతూ, మహిళ నాయకురాలిగా ప్రజల్లో మంచి గుర్తింపు పొందారని గ్రామస్తులు, పలువురు అభిప్రాయపడుతున్నారు. గ్రామ అభివృద్ధి కోసం గ్రామంలో ప్రతి ఒక్కరు ఐక్యతగా కలిసి నూతక్కి అపర్ణ గెలుపు కోసం కృషి చేస్తామని పలువురు గ్రామస్తులు పత్రికా ముఖంగా తెలపడం అభినందనీయం...!గ్రామంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసే నాయకులు లేకపోవడం చాలా బాధాకరమని గ్రామస్తులు పలువురు అభిప్రాయపడుతున్నారు. ఏది... ఏమైనా గ్రామంలో అన్ని వర్గాల ప్రజలతో ఎంపీటీసీ గుజ్జర్లపూడి సాంబశివరావు,గ్రామ పార్టీ మాజీ అధ్యక్షులు పావులూరి సాంబశివరావు,బల్లెం వేణు కోటేశ్వరరావు, డిసీ చైర్మన్ బొబ్బూరి వెంకట్రావు, ఎస్సీ సెల్ నాయకులు కొడాలి దేవిడ్ రాజ్,మైనార్టీ నాయకులు షేక్ మీరావలి,గంప పుల్లారావు,సూది రెడ్డి సురేష్,బమ్మనేని బాలయ్య అలాగే పార్టీలకు అతీతంగా గ్రామ పెద్దల సహకారంతో సర్పంచ్ గా నామినేషన్ వేయనున్నట్లు నూతక్కి అపర్ణ పత్రికా ముఖంగా తెలిపారు.

కంబదూరు నూతన ఎస్ఐ గా గోపి యాదవ్ బాధ్యతల స్వీకరణ



కంబదూరు నవంబర్: 15(ప్రజా జ్యోతి) న్యూస్ రిపోర్టర్ ఖాన్, కంబదూరు మండల పోలీస్ స్టేషన్‌కు నూతన ఎస్ఐ గా గోపి యాదవ్ బదిలీపై విచ్చేసి ఆదివారం పదవీ బాధ్యతలను స్వీకరించారు. ఇంతకుముందు ఈయన అనంతపురం 4వ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐగా విధులు నిర్వహిస్తూ, అక్కడి నుంచి బదిలీపై కంబదూరుకు వచ్చారు. కాగా, కంబదూరు పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ గా విధులు నిర్వహించిన లోకేష్ కుమార్ బదిలీపై వెళ్లడంతో ఆయన స్థానంలో గోపి యాదవ్ బాధ్యతలు చేపట్టారు.

గిరిజనుల అభ్యున్నతికి విద్యే కీలకం.కలెక్టర్ వినోద్ కుమార్

బాపట్ల నవంబర్ 15 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి) గిరిజనుల హక్కులు, భూమి, సంస్కృతి, ఆత్మగౌరవ పరిరక్షణ కోసం బ్రిటిష్ పాలకులకు వ్యతిరేకంగా పోరాడిన భగవాన్ బిర్సా ముండా జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ వి. అన్నారు. గిరిజన సమాజం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలంటే విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రతి చిన్నారిని బడికి పంపే బాధ్యత సమాజమంతా తీసుకోవాలని పిలుపునిచ్చారు.భారత ప్రభుత్వ గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో బిర్సా ముండా 151వ జయంతి, జన్‌జాతీయ గౌరవ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా బిర్సా ముండా చిత్రపటానికి కలెక్టర్ పూలమాలలు వేసి నివాళులర్పించి, జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉల్గులాన్ మహా ఉద్యమానికి నాయకత్వం వహించి గిరిజనుల్లో ఐక్యత, చైతన్యం నింపిన బిర్సా ముండా పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. గిరిజనులు విద్య, వైద్యం, ఆర్థిక స్వావలంబనతో పాటు సామాజికంగా ఎదగాలని, మూఢనమ్మకాలను విడనాడి శాస్త్రీయ దృక్పథంతో ముందుకు సాగాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ చేరేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు.అనంతరం నవంబర్ 1 నుంచి 14వ తేదీ వరకు గురుకుల ఆశ్రమ పాఠశాలల్లో నిర్వహించిన



చిత్రలేఖనం, వ్యాసరచన, వ్యక్తిత్వ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు కలెక్టర్ ప్రశంసాపత్రాలు అందజేశారు. కలెక్టరేట్‌లో ప్రారంభించిన గ్రంథాలయానికి పుస్తకాలు అందించి విద్యార్థులకు ఉపయోగపడేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో ఎన్‌జీఓ ప్రతినిధులు భగవాన్ దాసు, తిరువీధుల శంకర్ ప్రసాద్, దేవరకొండ రాము బిర్సా ముండా సేవలను వివరించారు. జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి దాసరి అమర సుబ్బయ్య, సర్వశిక్ష అభియాన్ పీఓ శ్రీనివాసులు, జిల్లా పర్యాటక శాఖ అధికారి బెన్హర్, డీఎంహెచ్ఓ డాక్టర్ ఎస్. విజయమ్మ, డీసీహెచ్ఎస్ డాక్టర్ పద్మావతి, స్వర్ణ గ్రామం/స్వర్ణ వార్డుల జిల్లా మేనేజర్ రాజేష్, జిల్లా ఆడిట్ అధికారిణి రాజ్యం, గిరిజన సంఘాల నాయకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, గిరిజన గురుకుల పాఠశాల విద్యార్థినులు పాల్గొన్నారు.

ఐటీడీఏ ఆధ్వర్యంలో ఘనంగా భగవాన్ బిర్సా ముండా జయంతి వేడుకలు





జనజాతీయ గౌరవ్ దివస్ సందర్భంగా ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడా పోటీలు

చింతూరు నవంబర్ 15 ప్రజాజ్యోతి గిరిజనుల హక్కులు, ఆత్మగౌరవం, సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణ కోసం తన జీవితాన్ని అంకితం చేసిన గొప్ప గిరిజన స్వాతంత్ర్య సమరయోధుడు, విప్లవ వీరుడు భగవాన్ బిర్సా ముండా జయంతి వేడుకలను ఆదివారం చింతూరు ఐటీడీఏ పి ఓ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా చింతూరు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి మరియు సబ్ కలెక్టర్ చిట్టపులి నరేంద్ర పడాల్ ఆధ్వర్యంలో భగవాన్ బిర్సా ముండా విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. గిరిజన సమాజ అభ్యున్నతికి, హక్కుల సాధనకు, బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా ఆయన చేసిన పోరాటాన్ని ఈ సందర్భంగా స్మరించుకున్నారు. భగవాన్ బిర్సా ముండా ఆశయాలు, పోరాట స్ఫూర్తి నేటి యువతకు, ముఖ్యంగా గిరిజన విద్యార్థులకు ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. జనజాతీయ గౌరవ్ దివస్ వేడుకల్లో భాగంగా చింతూరు ఐటీడీఏ పరిధిలోని వివిధ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు పలు కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా సాంస్కృతిక ప్రదర్శనలు, సంప్రదాయ కళారూపాలు, ఆటల పోటీలు, వివిధ క్రీడా పోటీలు నిర్వహించి విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ప్రోత్సహించారు.విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా ఈ కార్యక్రమాల్లో పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు, క్రీడాస్ఫూర్తి, సాంస్కృతిక విలువలను పెంపొందించేందుకు దోహదపడతాయని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు అధికారి చిట్టపులి నరేంద్ర పడాల్ మాట్లాడుతూ, భగవాన్ బిర్సా ముండా జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని, ఆయన చూపిన ధైర్యం, పోరాట పటిమ, సమాజం పట్ల నిబద్ధతను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. గిరిజన విద్యార్థులు విద్యతో పాటు క్రీడలు, సాంస్కృతిక రంగాల్లో కూడా రాణించి ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. గిరిజన వారసత్వ సంపద, సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడంతో పాటు గిరిజన మహనీయుల చరిత్రను విద్యార్థులకు తెలియజేయడమే జనజాతీయ గౌరవ్ దివస్ వేడుకల ప్రధాన ఉద్దేశమని తెలిపారు.ఈ కార్యక్రమాల్లో ఐటీడీఏ అధికారులు, వివిధ శాఖల అధికారులు, ఆశ్రమ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బద్వేల్ రాజకీయ చరిత్రను తిరగరాసిన నాయకుడిపై బురదజల్లడం తగదు!

ఎమ్మెల్సీ గోవిందరెడ్డి వ్యాఖ్యలను ఖండించిన టీడీపీ యువ నాయకుడు కొంకుల రవి

బద్వేల్ స్టాఫ్ రిపోర్టర్ నవంబర్ 15 (ప్రజా జ్యోతి) బద్వేల్ రాజకీయ చరిత్రలో ఎన్నో ఏళ్లుగా ఉన్న రికార్డులను తిరగరాస్తూ తెలుగుదేశం పార్టీకి ఘన విజయాన్ని అందించిన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి మంచూరు సూర్యనారాయణ రెడ్డిపై నిరాధార ఆరోపణలు చేయడం తగదని టీడీపీ యువ నాయకుడు కొంకుల రవి అన్నారు. రాజకీయంగా సుదీర్ఘ అనుభవం కలిగిన ఎమ్మెల్సీ గోవిందరెడ్డి స్థాయిలో ఉన్న వ్యక్తి ఆధారాలు లేకుండా ఇలాంటి ఆరోపణలు చేయడం సమంజసం కాదని ఆయన తీవ్రంగా ఖండించారు.బద్వేల్ మున్సిపాలిటీలో తెలుగుదేశం పార్టీ విజయానికి మంచూరు సూర్యనారాయణ రెడ్డి ఎంతో కష్టపడ్డారని, పార్టీ శ్రేణులను సమన్వయం చేసుకుంటూ బాధ్యతాయుతంగా వ్యవహరించి విజయానికి బాటలు వేశారని రవి పేర్కొన్నారు. పార్టీ జెండాను బద్వేల్‌లో రెపరెపలాడించేందుకు ఆయన చేసిన కృషి మరువలేనిదన్నారు. ప్రజలు ఇచ్చిన తీర్పే ఆయన నాయకత్వానికి నిదర్శనమని తెలిపారు. బద్వేల్ మున్సిపాలిటీలోని 40 వార్డుల్లో 39 వార్డులు ఏకగ్రీవం కాగా, ఒక వార్డులో ఎన్నిక జరగడం, తెలుగుదేశం పార్టీ రికార్డు స్థాయి విజయాన్ని నమోదు చేయడం వెనుక ప్రజల విశ్వాసం, పార్టీ నాయకులు, కార్యకర్తల కృషి ఉన్నాయని అన్నారు. ఈ విజయాన్ని జీర్ణించుకోలేకనే కొందరు నాయకులు విమర్శలకు దిగుతున్నారని కొంకుల రవి వ్యాఖ్యానించారు. 40 మంది కౌన్సిలర్లకు పదవులు కేటాయించేందుకు లక్షల రూపాయలు తీసుకున్నారంటూ మంచూరు సూర్యనారాయణ రెడ్డిపై ఆరోపణలు చేయడం బాధాకరమని, ఆరోపణలు చేసే ముందు వాటికి తగిన ఆధారాలు చూపించాలని ఆయన డిమాండ్ చేశారు. రాజకీయ విమర్శలు విధానాలు, ప్రజా సమస్యలు, అభివృద్ధి అంశాలపై ఉండాలి తప్ప వ్యక్తిత్వాన్ని కించపరిచేలా ఉండకూడదన్నారు. 25 ఏళ్ల రాజకీయ అనుభవం, సుదీర్ఘ రాజకీయ ప్రస్థానం ఉందని చెప్పుకునే నాయకులు ప్రజలకు చేసిన సేవలు, సాధించిన అభివృద్ధి ఏమిటో కూడా ప్రజలకు వివరించాలని గోవిందరెడ్డిని ఉద్దేశించి ప్రశ్నించారు. మంచూరు సూర్యనారాయణ రెడ్డి బద్వేల్ బాధ్యతలు చేపట్టిన తర్వాత ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తూ, సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తున్నారని తెలిపారు. ప్రజల మధ్య ఉంటూ, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్న నాయకుడిపై ఆధారాలు లేని ఆరోపణలు చేయడం మానుకోవాలని కొంకుల రవి హితవు పలికారు. తెలుగుదేశం పార్టీ సాధించిన విజయాన్ని రాజకీయంగా ఎదుర్కోలేక వ్యక్తిగత విమర్శలకు దిగడం సరికాదని ఆయన స్పష్టం చేశారు.



"ధూంధాం"గా లకావత్ వెంకటప్రసాద్ నాయక్ నామినేషన్...!!



జి.కొండూరు :(నవంబర్ 15,ప్రజా జ్యోతి బ్యూరో భట్టిప్రోలు నాగేశ్వరరావు): జికొండూరు మండల పరిధిలోని కట్టుబడిపాలెం గ్రామపంచాయతీ సర్పంచ్ గా కూటమి ప్రభుత్వం బలపరిచిన టిడిపి అభ్యర్థి లకావత్ వెంకటప్రసాద్ నాయక్ ఆదివారం "ధూంధాం"గా నామినేషన్లు వేశారు. ఈ నామినేషన్ సందర్భంగా గ్రామంలో తెలుగుదేశం పార్టీ నాయకులతో... జనసేన పార్టీ నాయకులతో...భారతీయ జనతా పార్టీ నాయకులతో... కార్యకర్తలతో.. బైకులకు జెండాలు కట్టి,కారులు,ఆటోలతో వందలాది మంది జన సమీకరణతో సర్పంచ్ అభ్యర్థిగా లకావత్ వెంకటప్రసాద్ నాయక్ నామినేషన్ కి తరలి వెళ్లారు. ఈ సందర్భంగా కార్యకర్తలు కూటమి ప్రభుత్వం వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీలో హోరెత్తించారు. ఈ సందర్భంగా లకావత్ వెంకటప్రసాద్ నాయక్ రెండు చేతులెత్తి నమస్కరిస్తూ పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరు తనకు ఓటు వేయాలని, తాను గెలిపిస్తే గ్రామంలో డ్రైనేజీలను ఏర్పాటు చేయిస్తానని త్రాగునీటి సమస్య తలెత్తకుండా చూస్తానని, హర్షత కలిగిన వారికి రేషన్ కార్డులు, పెన్షన్లు పంపిణీ చేయిస్తానని కాలుష్య నియంత్రణకు కృషి చేస్తానని ఓటర్లను అభ్యర్థించారు. కార్యకర్తల ఉత్సాహ నడుమ ర్యాలీ జరిగింది.

సర్పంచ్ పదవికి ఇండిపెండెంట్ అభ్యర్థిగా నామినేషన్ వేయనున్నట్లు మెండం చిన్న బాబు ప్రకటన..!!




జి.కొండూరు :(నవంబర్ 15,ప్రజా జ్యోతి బ్యూరో భట్టిప్రోలు నాగేశ్వరరావు): జి.కొండూరు మండల పరిధిలోని ఆత్కూరు గ్రామానికి చెందిన మెండం చిన్నబాబు మొదటి నుండి తెలుగుదేశం పార్టీలో చురుకైన పాత్ర పోషించాడు. మండలంలో అలాగే నియోజకవర్గంలో పార్టీ పరంగా ఎలాంటి కార్యక్రమాలు జరిగినా తూచ-తప్పకుండా హాజరవుతూ.... నీతి- నిజాయితీ కలిగిన యువనేతగా పార్టీలో గుర్తింపు పొందాడు. బీఎస్సీ వరుకు విద్యాభాసం చేసి రాజకీయాలపై మంచి అవగాహన కలిగిన యువ నాయకుడిగా, కార్యకర్తగా... పార్టీలో గుర్తింపు తెచ్చుకున్నారు. సరైన ఉద్యోగం లేకపోయినా నిరుత్సాహపడకుండా 6సంవత్సరాలు పాటు ఉపాధి హామీ పథకం ద్వారా ఫీల్డ్ ఆఫీసర్ గా గ్రామంలోని... 300 కుటుంబాలకు పనులు కల్పించి,కార్మిక నాయకుడి గా మంచి పేరు సంపాదించారు. గ్రామంలో ప్రతి ఒక్కరితో వ్యక్తిగతంగా మంచి పరిచయాలు ఉన్నాయి. ఈ తరుణంలో ఆత్కూరు గ్రామంలో అత్యధిక మంది గ్రామ ప్రజలు ఓటర్లు మెండం చిన్నబాబుని సర్పంచ్ గా పోటీ చేయమని ఒత్తిడి తీసుకురావడంతో చిన్న బాబు సర్పంచ్ గా పోటీకి సిద్ధపడ్డారు. కానీ గ్రామంలో ఒకరిద్దరు నాయకులు తనను సర్పంచ్ అభ్యర్థిగా ప్రకటించకుండా వారి స్వార్థం కోసం ఓకే ఇంటిలో రెండు, మూడు ఉద్యోగాలు కలిగిన వయస్సు పై పడిన వ్యక్తిని సర్పంచ్ గా చూపించి పార్టీ బలహీన పడటానికి పరోక్షంగా కారణమవుతున్నారని ఎస్సీలకు రాజ్యాంగం కల్పించిన హక్కులకు కొందరు ఆటంకం కల్పిస్తున్నారని అందుకే డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జగ్జీవన్ రాం... స్ఫూర్తితో తాను టిడిపి రెబల్ అభ్యర్థిగా ఇండిపెండెంట్ సర్పంచ్ గా పోటీ చేయడానికి నామినేషన్లు వేయనున్నట్లు మెండెం చినబాబు ఆదివారం పత్రికా ముఖంగా తెలిపారు. ఈ సందర్భంగా మెండం చిన్నబాబు మాట్లాడుతూ తను సర్పంచ్ గా గెలుపొందితే గ్రామ సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తానని చిన్నబాబు తెలిపారు.

ఎల్ఎల్సీ కాలువలో గుర్తుతెలియని యువకుడి మృతదేహం



హొళగుంద, నవంబర్ 15, ప్రజా జ్యోతి న్యూస్ – మండల పరిధిలోని ఎల్ఎల్సీ కాలువలో గుర్తుతెలియని యువకుడి మృతదేహం కనిపించడం స్థానికంగా కలకలం రేపింది. ఆదివారం సాయంత్రం 56వ డీపీ సమీపంలోని 185వ కిలోమీటర్ రాయి వద్ద కాలువ నీటిలో మృతదేహం కొట్టుకుపోతుండటాన్ని స్థానికులు గుర్తించారు.కాలువలో మృతదేహాన్ని గమనించిన స్థానికులు వెంటనే అప్రమత్తమయ్యారు. అయితే, ఈ విషయాన్ని సంబంధిత అధికారులకు తెలియజేసేలోపే కాలువలో నీటి ప్రవాహ వేగానికి మృతదేహం కొట్టుకుపోయినట్లు స్థానికులు తెలిపారు. మృతదేహం ఎవరిది? యువకుడి మరణానికి గల కారణాలేమిటి? అనే విషయాలు తెలియాల్సి ఉంది.

నూతన వధూవరులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపిన చిప్పగిరి జనసేన పార్టీ మండల కన్వీనర్ కే చిరంజీవి గారు!



రామదుర్గం గ్రామానికి చెందిన శ్రీమతి ఎం దేవి ఎం రాజు గారు మరియు రామదుర్గం అజయ్ గార్ల ఆహ్వానం మేరకు, గుంతకల్ పట్టణంలోని చైత్ర కన్వెన్షన్ హాల్ లో నిర్వహించిన వారి కుమార్తె చి! లా! సౌ! నందిని మరియు చి! విజయ్ కుమార్ గార్ల వివాహ వేడుకకు చిప్పగిరి జనసేన పార్టీ మండల కన్వీనర్, హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన వధూవరులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేసి, వారి నూతన జీవితానికి శుభం కలగాలని ఆశీర్వదించారు

పాలకొల్లు మున్సిపల్ చైర్ పర్సన్ కూటమి అభ్యర్థిగా ఉషారాణి

మంత్రి నిమ్మల రామానాయుడు ఆశీస్సులతో ఎన్నికల బరిలోకి జీవి సతీమణి ఉషారాణి.

పాలకొల్లు. ప్రజాజ్యోతి రిపోర్టర్ కొట్టి రాము. నవంబరు 15: పాలకొల్లు మున్సిపల్ చైర్మన్ పీఠాన్ని కైవసం చేసుకోవడమే లక్ష్యంగా కూటమి పార్టీలు పక్కా రాజకీయ వ్యూహంతో ముందుకు సాగుతున్నాయి. ఇందులో భాగంగా బీసీ మహిళకు చైర్మన్ స్థానం రిజర్వు కావడంతో తూర్పు కాపు సామాజిక వర్గానికి చెందిన గండేటి వెంకటేశ్వరరావు (జీవి) సతీమణి ఉషారాణిని కూటమి చైర్మన్ అభ్యర్థిగా ఖరారు చేశారు. ఉన్నత విద్యావంతురాలు, ఉపాధ్యాయ వృత్తిలో అనుభవం కలిగిన ఉషారాణి అభ్యర్థిత్వం ఇప్పుడు పాలకొల్లు రాజకీయాల్లో ఆసక్తికరంగా మారింది.ఎమ్మెస్సీ పూర్తి చేసిన ఉషారాణి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేశారు. ప్రజాసేవలో ప్రత్యక్షంగా భాగస్వాములు కావాలనే లక్ష్యంతో స్వచ్ఛంద పదవీ విరమణ చేసి ఎన్నికల బరిలోకి దిగుతున్నారు. అందరితో కలిసిమెలిసి ఉండే స్వభావం, ప్రజలతో సత్సంబంధాలు, వివిధ అంశాలపై అవగాహన ఆమెకు అదనపు బలంగా మారనున్నాయి. విద్యావంతురాలిగా పట్టణ అభివృద్ధి, ప్రజా సమస్యలు, పరిపాలన అంశాలపై సమర్థవంతంగా పనిచేయగలరనే అంచనాలు వ్యక్తమవుతున్నాయి.

జీవి రాజకీయ అనుభవం.. ఉషారాణికి అదనపు బలం

ఉషారాణి అభ్యర్థిత్వం వెనుక ఆమె భర్త గండేటి వెంకటేశ్వర రావు (జీవి) రాజకీయ అనుభవం, ప్రజా సంబంధాలు కీలకంగా నిలుస్తున్నాయి. ప్రస్తుతం పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడిగా కొనసాగుతున్న జీవి గతంలో మున్సిపల్ కౌన్సిలర్‌గా ఎన్నికై, కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మున్సిపల్ కౌన్సిల్ ఫ్లోర్ లీడర్‌గా సమర్థవంతంగా పనిచేశారు. మున్సిపల్ పరిపాలన, పట్టణ సమస్యలు, కౌన్సిల్ వ్యవహారాలపై ఆయనకు విశేష అనుభవం ఉంది.పార్టీలోనూ పలు కీలక బాధ్యతలు నిర్వహించారు. జిల్లా బీసీ సెల్ కార్యదర్శిగా, రాష్ట్ర బీసీ సెల్ జాయింట్ సెక్రటరీగా, జిల్లా తెలుగు యువత ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. వివిధ సామాజిక వర్గాల నాయకులు, కార్యకర్తలు, ప్రజలతో ఆయనకు ఉన్న పరిచయాలు రాజకీయంగా కలిసివచ్చే అవకాశముంది.మంత్రి నిమ్మల రామానాయుడుతో కుటుంబానికి రాజకీయపరంగానే కాకుండా మంచి సన్నిహిత సంబంధాలు ఉండడంతో ఆయన ఆశీస్సులతో ఉషారాణి ఎన్నికల బరిలోకి దిగుతున్నారు. తూర్పు కాపు సామాజిక వర్గంతో పాటు ఇతర సామాజిక వర్గాల్లోనూ జీవి కుటుంబానికి ఉన్న పరిచయాలు, పార్టీ శ్రేణులతో ఉన్న అనుబంధం కూటమికి కలిసివచ్చే అంశాలుగా భావిస్తున్నారు. ఒక పక్క ఉషారాణికి ఉన్న విద్యార్హతలు, ఉపాధ్యాయురాలిగా విశేష అనుభవం. మరో పక్క భర్త జీవి కి ఉన్న రాజకీయ అనుభవం, పట్టణంలో ఉన్న ప్రజా సంబంధాలు కలసి కూటమి అభ్యర్థికి బలమైన పునాదిగా మారనున్నాయి.మున్సిపల్ చైర్మన్ పీఠాన్ని దక్కించుకోవాలనే లక్ష్యంతో కూటమి నేతలు ఎన్నికల వ్యూహాలకు పదును పెడుతున్నారు. ప్రస్తుత రాజకీయ సమీకరణాలు, సామాజిక వర్గాల మద్దతు, జీవి కుటుంబానికి



ఉన్న పరిచయాలను పరిశీలిస్తే ఉషారాణి గెలుపుపై కూటమి వర్గాలు ధీమా వ్యక్తం చేస్తున్నాయి.

చిప్పగిరిలో వైసీపీ తరఫున లిఖిత రెడ్డి, డాక్టర్ అలేఖ్య కీర్తి కిరణ్ రెడ్డి సర్పంచ్ అభ్యర్థుల నామినేషన్లు



చిప్పగిరి, నవంబర్ 15 (ప్రజా జ్యోతి): చిప్పగిరి గ్రామ పంచాయతీ సర్పంచ్ స్థానానికి వైఎస్సార్‌సీపీ తరఫున ముగ్గురు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. ఆదివారం నామినేషన్ల ప్రక్రియలో భాగంగా కీర్తిశేషులు నందకిశోర్ రెడ్డి సతీమణి లిఖిత రెడ్డి, కీర్తి కిరణ్ రెడ్డి సతీమణి అలేఖ్య రెడ్డి, సర్వర్ ఖాన్ సతీమణి తమ నామినేషన్ పత్రాలను సమర్పించారు. వీరు వైఎస్సార్‌సీపీ తరఫున సర్పంచ్ స్థానానికి పోటీ చేసేందుకు నామినేషన్లు దాఖలు చేయడంతో గ్రామంలో ఎన్నికల ప్రక్రియపై ఆసక్తి నెలకొంది.గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేస్తుండటంతో చిప్పగిరిలో రాజకీయ కార్యకలాపాలు ఊపందుకున్నాయి. సర్పంచ్ స్థానానికి పోటీ చేసేందుకు అభ్యర్థులు ముందుకు రావడంతో గ్రామంలో ఎన్నికల వాతావరణం కనిపిస్తోంది. నామినేషన్ల దాఖలు సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు అభ్యర్థులకు మద్దతుగా పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ మల్లికార్జున, చిప్పగిరి ఎంపీటీసీ-2 సభ్యుడు సర్వర్ ఖాన్, సుధీర్ కుమార్ పాల్గొన్నారు.

నంచర్ల సర్పంచ్ అభ్యర్థిగా టీడీపీ తరఫున శివలింగ సతీమణి వంచేటి చెన్నమ్మ నామినేషన్



చిప్పగిరి, నవంబర్ 15 (ప్రజా జ్యోతి): చిప్పగిరి మండలం నంచర్ల గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా తెలుగుదేశం పార్టీ తరఫున మాజీ ఎంపీటీసీ నంచర్ల శివలింగ సతీమణి వంచేటి చెన్నమ్మ నామినేషన్ దాఖలు చేశారు. ఆదివారం చిప్పగిరి పంచాయతీ సచివాలయంలో నిర్వహించిన నామినేషన్ల ప్రక్రియలో భాగంగా ఆమె తన నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి (ఆర్ఓ)కు అందజేశారు.నంచర్ల గ్రామంలో సర్పంచ్ స్థానానికి టీడీపీ తరఫున పోటీ చేసేందుకు చెన్నమ్మ నామినేషన్ వేయడంతో పార్టీ శ్రేణుల్లో ఆసక్తి నెలకొంది. గ్రామ అభివృద్ధి, ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనిస్తూ ఎన్నికల్లో ముందుకు సాగేందుకు అభ్యర్థులు సిద్ధమవుతున్నారు. నామినేషన్ దాఖలు కార్యక్రమానికి టీడీపీ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు హాజరై చెన్నమ్మకు మద్దతు తెలిపారు.ఈ కార్యక్రమంలో చిప్పగిరి జడ్పీటీసీ అడ్వకేట్ వలి, సొసైటీ చైర్మన్ కొండా రామాంజనేయులు, టీడీపీ చిప్పగిరి మండల కన్వీనర్ కొండా పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

కృష్ణవరంలో కన్నులపండువగా ముత్యాలమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టాపన

డప్పు వాద్యాల నడుమ అమ్మవారికి ఘనంగా బోనాల సమర్పణ

సనాతన ధర్మ పరిరక్షణలో భాగంగా విగ్రహాన్ని అందించిన రాజమండ్రి దాత

అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తజనం

ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్న గ్రామం





ఎటపాక, నవంబర్ 15 (ప్రజాజ్యోతి): పోలవరం జిల్లా, చింతూరు డివిజన్, ఎటపాక మండలం కృష్ణవరం గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ శ్రీ ముత్యాలమ్మ తల్లి దేవాలయంలో విగ్రహ ప్రతిష్టాపన మరియు బోనాల సమర్పణ మహోత్సవాలు అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధల నడుమ జరిగాయి. గ్రామస్తులందరి సమష్టి కృషి, సహాయ సహకారాలతో సుందరమైన దేవాలయాన్ని నిర్మించుకున్న కృష్ణవరం వాసులు మూడు రోజుల పాటు ఆధ్యాత్మిక వాతావరణంలో మునిగితేలారు.

శాస్త్రోక్తంగా విగ్రహ ప్రతిష్టాపన

ఈ నెల 13వ తేదీన (శుక్రవారం) వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య నూతన దేవాలయ ప్రారంభోత్సవం జరిగింది. అదే రోజు మధ్యాహ్నం 12:30 గంటల శుభ ముహూర్తంలో గ్రామ దేవత శ్రీ ముత్యాలమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు.

దాతృత్వాన్ని చాటుకున్న సమరసత సేవా ఫౌండేషన్

సనాతన హిందూ ధర్మ పరిరక్షణ ధ్యేయంగా, సమరసత సేవా ఫౌండేషన్ గోదావరి విభాగం కన్వీనర్ శ్రీ బండ్ల రామశంకర్ వారి చొరవతో రాజమండ్రి వాస్తవ్యులు శ్రీ వక్కినేని కృష్ణబాబు వారు ఈ అమ్మవారి విగ్రహాన్ని వితరణగా అందించారు. గ్రామస్తులు కోరిన వెంటనే స్పందించి విగ్రహాన్ని బహూకరించిన దాతలకు గ్రామ పెద్దలు, భక్తులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

డప్పు చప్పుళ్ల మధ్య బోనాల జాతర

ప్రతిష్టాపన కార్యక్రమంలో భాగంగా ఆదివారం గ్రామంలో బోనాల ఉత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. గ్రామంలోని ప్రతి ఇంటి నుండి మహిళలు భక్తిశ్రద్ధలతో బోనాలను ఎత్తుకుని, డప్పు వాయిద్యాలు, మంగళ వాయిద్యాల నడుమ ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని అమ్మవారికి నైవేద్యాలు, బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ మహోత్సవంలో సుమారు 500 మందికి పైగా భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఘనంగా జిల్లాస్థాయి తైక్వాండో పోటీలు

ప్రజా జ్యోతి జిల్లా బ్యూరో సుబ్బు జిల్లా తైక్వాండో అసోషియేషన్ ఆధ్వర్యంలో అనంతపురం నగరంలోని డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ ఇండోర్ స్టేడియంలో జిల్లా స్థాయి తైక్వాండో పోటీలను ఘనంగా నిర్వహించారు.ఈ పోటీలకు జిల్లా నలుమూలల నుండి 120మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ప్రముఖ పారిశ్రామిక వెత్త సంఘసేవకుడు బొంబాయి రమేష్ నాయుడు ముఖ్య అతిధిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు క్రమశిక్షనతో కఠోరమైన సాధన చెసి అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. తైక్వాండో క్రీడ వల్ల చాలా ఉపయోగాలున్నాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అననం తరం పోటీలను ప్రారంభించారు.జిల్లా తైక్వాండో అసోషియేషన్ అధ్యక్షులు కె. శాంతరాజ్ మాట్లాడుతూ జిల్లా స్థాయిలో మొదటి రెండవ స్థానాలను సాధించిన క్రీడా కారులని ఈ నెల 23వ తేదీన జరిగిబోయే రాయలసీమ స్థాయి పోటీలకి ఎంపిక చేస్తామని అన్నారు.ఈ పోటీలకి ముఖ్య సాంకేతిక నిపుణులుగా ఛాంపియన్స్ తైక్వాండో అకాడమీ రామాంజి



నేయులు వ్యవరించారు. ఈ పోటీల అనంతరం ముగింపు కార్యక్రమనికి జిల్లా క్రీడాల అభివృద్ధి అధికారిణి మంజుల హాజరైయి విజేతలకు పతకాలను బహుకరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా తైక్వాండో కార్యదర్శి తులసి రామ్ మరియు సత్యసాయి జిల్లా కార్యదర్శి రామాంజినేయులు శిక్షకులు బి.రాజేష్ మరియు స్పేరోస్ రాష్ట్ర మాజీ అధ్యక్షులు బి. తిరుమల్లయ్య రాస్ బయో ఫార్మ్ ఎండీ. రామచంద్ర హెగ్డే వెంకటనాయుడు బాబు నాయుడు రామ మోహన్ రెడ్డి ప్రేమ్ కుమార్ రాగే రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణాపురంలో పంచాయతీ ఎన్నికలపై పోలీసుల అవగాహన సమావేశం

చింతకొమ్మ దిన్నె ప్రజాజ్యోతి 15/11/26 పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో గ్రామ ప్రజలకు పోలీసుల అవగాహన సి కె దిన్నె సి ఐ బాల మధిలేటి ఎస్ ఐ శ్రీనువాలు రెడ్డి రానున్న గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణపై పోలీసులు ప్రజలకు అవగాహన కల్పించారు.జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు జిల్లావ్యాప్తంగా పోలీసులు గ్రామాల్లో పర్యటిస్తూ ప్రజలకు ఎన్నికలపై అవగాహన కల్పిస్తున్నారు. ఇందులో భాగంగా చింతకొమ్మదిన్నె పోలీస్ స్టేషన్ పరిధిలోని రోడ్డు కృష్ణాపురం గ్రామంలో సీఐ బాల మద్దిలేటి ఆధ్వర్యంలో గ్రామస్థులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎన్నికల సమయంలో ఎలాంటి ఘర్షణలు, గొడవలకు పాల్పడకుండా ప్రతి ఒక్కరూ సంయమనం పాటించాలని సూచించారు. గ్రామంలో ప్రశాంత వాతావరణం కొనసాగిం



చేందుకు పోలీసులకు సహకరించాలని కోరారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సర్పంచ్ నామినేషన్ మొదటిరోజు విజయవంతం





గోపవరం నవంబర్ 15 ప్రజా జ్యోతి న్యూస్,... బద్వేల్ **మండలం:** పుట్టాయిపల్లి పంచాయతీ సర్పంచ్ నామినేషన్ కార్యక్రమం ప్రారంభం బద్వేల్ మండలం, పుట్టాయిపల్లి పంచాయతీ సర్పంచ్ ఎన్నికల నామినేషన్ ప్రక్రియ మొదటి రోజు ముగిసింది.ఈ సందర్భంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మద్దతుతో సర్పంచ్ అభ్యర్థిగా వంకెల జయరాం రెడ్డి సతీమణి వంకెల రుక్మిణమ్మ తన నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. ఈ కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వంకెల పెద్ద పోలి రెడ్డి హాజరయ్యారు.అనంతరం, గొడుగునూరు గ్రామం 10వ వార్డు మెంబర్ పదవికి వైఎస్ఆర్సిపి మద్దతు దారుడు అల్లూరి విజయ్ తన నామినేషన్‌ను దాఖలు చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు. వంకెల జయరామి రెడ్డి.అల్లూరి రాజా గంట చిట్టిబాబు .అల్లూరి దానం .పాణ్యం పెంచలయ్య అల్లూరి ఎలియా .గంట విజయ్

లయన్స్ క్లబ్ ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన



ప్రజా జ్యోతి జిల్లా బ్యూరో సుబ్బు కంటి చూపు లేకుంటే జీవితం అంధకారమే కళ్ళను జాగ్రత్తగా కాపాడుకోవాలి డాక్టర్ నల్లపాటి తిరుపతి నాయుడు పామిడి పట్టణంలోని వాసవి కళ్యాణ మండపంలో ఆదివారం పామిడి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి ఆపరేషన్ల మెగా వైద్య శిబిరానికి ప్రజల నుండి విశేష స్పందన లభించింది. ఈ శిబిరంలో బెంగళూరులోని శంకర కంటి ఆసుపత్రి వైద్య నిపుణులు డాక్టర్ శరణ్య 120 మందికి కంటి పరీక్షలు నిర్వహించి వారిలో 47 మందిని ఉచిత కంటి ఆపరేషన్లకు ఎంపిక చేశారు.ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రభుత్వ ఆయుష్ వైద్యాధికారి డాక్టర్ నల్లపాటి తిరుపతి నాయుడు మరియు డాక్టర్ శరణ్య మాట్లాడుతూ కళ్ళు శరీరంలో అత్యంత సున్నితమైన అవయవాలని వాటి సంరక్షణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. బ్యాక్టీరియా వైరస్ ఫంగస్ వంటి సూక్ష్మక్రిముల బారిన పడకుండా కళ్ళను కాపాడుకోవాలని తద్వారా అంధత్వాన్ని నివారించవచ్చని తెలిపారు.అనంతరం పామిడి లయన్స్ క్లబ్ అధ్యక్షులు పట్రా శ్రీనివాసులు డిస్ట్రిక్ట్ చైర్ పర్సన్ జయరాం రావు మాట్లాడుతూ కళ్ళు మానవునికి దేవుడిచ్చిన అత్యంత విలువైన బహుమతి అని అన్నారు.కంటి చూపు బాగుంటేనే ఈ అందమైన ప్రపంచాన్ని చూడగలమని ఇతరులపై ఆధారపడకుండా ఎవరి పనులు వారు సొంతంగా చేసుకోగలరని పేర్కొన్నారు. శిబిరానికి విచ్చేసిన వారందరికీ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ వైద్య శిబిరంలో డిస్ట్రిక్ట్ చైర్ పర్సన్స్ డాక్టర్ శాంతి ప్రియ డాక్టర్ మురళీకృష్ణ జయరాం రావు కమిత్మర్ రఘువీర్ రావు మానవ హక్కుల కమిషన్ ఢ పర్యావరణ పరిరక్షణ దక్షిణ భారతదేశ కార్యదర్శి ఆవుల ప్రసాద్ పాల్గొన్నారు. అలాగే క్లబ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పట్రా నరేష్ కుమార్ డైరెక్టర్లు పట్ర రాకేష్ అంజి నాయక్ నల్లయ్య శంకర కంటి ఆసుపత్రి ఆర్గనైజింగ్ మేనేజర్ శివ శంకర ఆసుపత్రి మరియు లక్ష్మీ ఆసుపత్రి సిబ్బంది పాల్గొని శిబిరాన్ని విజయవంతం చేశారు.

హక్కుల సాధన కోసం ఒక్కటైన ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు

సమాన పనికి సమాన వేతనం, కనీస వేతన కాలమానం అమలు చేయాలని డిమాండ్

జిల్లా కమిటీ ఎన్నిక.. అధ్యక్షుడిగా జి. పృథ్వీనాథ్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కోనేటి లక్ష్మీనారాయణ



కడప 15/11/26 ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం, హక్కుల సాధన కోసం ఉద్యోగులంతా ఐక్యంగా పోరాడాలని నాయకులు పిలుపునిచ్చారు. నవ్యాంధ్రప్రదేశ్ మెడికల్ అండ్ హెల్త్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం కడప నగరంలోని నాగార్జున మహిళా డిగ్రీ కళాశాలలో జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లాలోని వివిధ ఏరియా ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.ఈ సందర్భంగా ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి పరిష్కార మార్గాలపై చర్చించారు. ముఖ్యంగా సమాన పనికి సమాన వేతనం, కనీస వేతన కాలమానం అమలు, ఉద్యోగ భద్రత, కాంట్రాక్టు విధానం తదితర అంశాలను ప్రస్తావించారు. గత రెండు వేతన సవరణ సంఘాల కాలంలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు జరిగిన ఆర్థిక నష్టాలను వివరించారు. హక్కుల సాధన కోసం ఉద్యోగులంతా ఐక్యంగా ఉండాలని నాయకులు సూచించారు.

ముఖ్య అతిథుల ప్రసంగాలు

ఈ సమావేశానికి ఆంధ్రప్రదేశ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గురునాథ్, మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఈశ్వర్, ప్రధాన కార్యదర్శి దొరసాని, సంయుక్త కార్యదర్శి లోకేష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. నంద్యాల, శ్రీ సత్యసాయి జిల్లాల అధ్యక్షులు సైతం పాల్గొని ఉద్యోగుల సమస్యలు, సంఘటిత పోరాట ఆవశ్యకతపై మాట్లాడారు.

నూతన జిల్లా కమిటీ ఎన్నిక

సమావేశంలో నవ్యాంధ్రప్రదేశ్ మెడికల్ అండ్ హెల్త్ అసోసియేషన్ కడప జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా జి. పృథ్వీనాథ్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కోనేటి లక్ష్మీనారాయణ, కోశాధికారిగా రామచంద్ర యాదవ్, అధ్యక్షుడిగా బాబును ఎన్నుకున్నారు. సహాధ్యక్షులుగా పాపిరెడ్డి, వెంకట్ సాయి నాయుడు ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా జయసుధ, పి. లత, ఎల్. సుదర్శన్ రెడ్డి, నాగేంద్ర; సంయుక్త కార్యదర్శులుగా పీరా నాయక్, ఆవుల రాజేష్ బాబు, రవికుమార్, బాబ్జాన్; కార్యనిర్వాహక అధ్యక్షులుగా రాజారత్నం, మస్తానమ్మ, వీరేంద్ర, గఫూర్ ఎన్నికయ్యారు.నిరంజన్, మహేష్ బాబు, సుబహాన్, ప్రవీణ్ కుమార్ ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా, శ్యామ్ జకరయ్య, శివాంజలి దేవ, మరియమ్మ, వెంకటరెడ్డి, పరిమళ, కాటం కుమార్, బత్తల శ్రీనివాసులు, గంగరాజు, బీరం ప్రసాద్, ఎన్. రాజా కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు.నూతన కమిటీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తూ, సంఘాన్ని బలోపేతం చేయాలని సమావేశంలో తీర్మానించారు.

టీడీపీ సీనియర్ కార్యకర్త మృతి పార్టీకి తీరని లోటు





:=మృతుడి కుటుంబానికి రూ.10 వేల రూపాయలు ఆర్థిక సాయం అందించిన వల్లూరి పట్టాభి

కౌతాళం, నవంబర్ 15 ప్రజా జ్యోతి కుంబలనూరు క్యాంపునకు చెందిన టీడీపీ సీనియర్ కార్యకర్త మృతి పార్టీకి తీరని లోటని కౌతాళం మండల టీడీపీ జనరల్ సెక్రటరీ వల్లూరి పట్టాభి అన్నారు.గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆయన, పరిస్థితి విషమించడంతో నిన్న మృతి చెందారు.విషయం తెలుసుకున్న వల్లూరి పట్టాభి మృతదేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి, అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం రూ.10,000 ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలను ఎప్పటికీ మరచిపోమని, బాధిత కుటుంబానికి తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో టీడీపీ కార్యకర్తలు విజయభాస్కర్, బళ్లారి మల్లేష్, సాయి,శ్రీకాంత్, బసవ,గోవిందు, సిద్ధేశ్ తదితరులు పాల్గొన్నారు.

21 పంచాయతీల్లో వైసీపీ జెండా ఎగురవేయడమే లక్ష్యం!







టీపీవీడులో వైఎస్సార్‌సీపీ ముఖ్య నేతల ప్రత్యేక సమావేశం

ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల విజయంపై హర్షం.. క్లీన్ స్వీప్‌కు దిశానిర్దేశం

ఎటపాక, నవంబర్ 15 (ప్రజాజ్యోతి): రాబోయే పంచాయతీ ఎన్నికల్లో ఎటపాక మండలంలోని మొత్తం 21 పంచాయతీల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేయడమే ఏకైక లక్ష్యంగా ప్రతి ఒక్కరూ సమష్టిగా పనిచేయాలని వైసీపీ నాయకులు పిలుపునిచ్చారు. రంపచోడవరం నియోజకవర్గ ఇంచార్జి, మాజీ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి ఆదేశాల మేరకు ఆదివారం ఎటపాక మండలం టీపీవీడు గ్రామ పంచాయతీ తోటపల్లిలో మండల పార్టీ అధ్యక్షుడు ఆకుల వెంకటరామా రావు ఆధ్వర్యంలో ముఖ్య నేతల ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు చింటూ, కురినాల బుజ్జి, మండల అధ్యక్షుడు ఆకుల వెంకట రామారావు మాట్లాడుతూ.. ఇటీవల జరిగిన ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులకు భారీ మెజారిటీ అందించిన ప్రజలకు, పార్టీ గెలుపు కోసం అహర్నిశలు కష్టపడి పనిచేసిన కార్యకర్తలకు ముందుగా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. అదే ఉత్సాహంతో ఈ నెల 29న మరియు డిసెంబర్ 2వ తేదీన జరగనున్న పంచాయతీ ఎన్నికల్లోనూ క్లీన్ స్వీప్ చేయాలని పిలుపునిచ్చారు. మండలంలోని 21 పంచాయతీలను పూర్తిస్థాయిలో కైవసం చేసుకునేలా శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు దమర్ల రేవతి, ఎంపీటీసీ రంబాల నాగేశ్వరరావు, రాష్ట్ర నాయకులు పసుపులేటి లక్ష్మణ్, మండల ఉపాధ్యక్షుడు యనమల రమేష్, యువజన విభాగం (యూత్) అధ్యక్షుడు తోట శశి, మాజీ మండల అధ్యక్షుడు వాసు, గ్రామ కమిటీ అధ్యక్షుడు బొల్లా సూరిబాబు, మాజీ ఎంపీటీసీ రామిరెడ్డి అంజలితో పాటు పెద్ద సంఖ్యలో స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అనంతగిరి పరిధిలో పోలీసుల విస్తృత కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్.

అనంతగిరి సబ్ ఇన్స్పెక్టర్ కే శంకర్.

ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు గ్రామస్తులంతా పోలీసులకు సహకరించాలి.



అనంతగిరి మండలం. నవంబర్ 15. అల్లూరి సీతారామరాజు జిల్లా.అనంతగిరి మండలంలో రానున్న గ్రామ పంచాయితీ సర్పంచ్ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు పోలీస్ శాఖ పటిష్ట చర్యలు చేపడుతోందని అనంతగిరి సబ్ ఇన్స్పెక్టర్ కే. శంకర్ తెలిపారు. ఇందులో భాగంగా అనంతగిరి పోలీస్ స్టేషన్ పరిధిలోని వాలాసి లుంగపర్తి పెద్ద బిడ్డ గుమ్మ గ్రామ పంచాయితీలలో పోలీసులు విస్తృతంగా కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ కే. శంకర్ మాట్లాడుతూ గ్రామాలలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ఎన్నికల నేపథ్యంలో గ్రామస్తులంతా పోలీసులకు పూర్తి స్థాయిలో సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఆపరేషన్‌లో భాగంగా గ్రామంలోకి కొత్తగా వచ్చిన వ్యక్తులు, అనుమానాస్పదంగా తిరుగుతున్న వారి వివరాలను పోలీసులు ఆరా తీశారు.గ్రామంలో ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా ప్రవర్తించినా, అక్రమ కార్యకలాపాలకు పాల్పడినా తక్షణమే పోలీసులకు సమాచారం అందించాలని ఎస్.ఐ శంకర్ కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని ఆయన భరోసా ఇచ్చారు.

బాపట్ల అభివృద్ధే లక్ష్యంగా కూటమి అడుగులు. చైర్మన్ అభ్యర్థిగా ఇస్మా సునీల్



బాపట్ల నవంబర్ 15 (ప్రజాజ్యోతి జిల్లా ప్రతినిధి) బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో బాపట్ల మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా తెలుగుదేశం, బీజేపీ, జనసేన కూటమి తరఫున ఇస్మా సునీల్‌ను ప్రకటించారు. కూటమి ప్రభుత్వం బాపట్ల పట్టణ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతుందని తెలిపారు.కొన్నేళ్ల విరామం తర్వాత మున్సిపల్ ఎన్నికలు జరగడం సంతోషకరమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు లేకపోవడంతో గత కొంతకాలంగా పట్టణానికి రావాల్సిన నిధులు, అభివృద్ధి కార్యక్రమాలకు ఆటంకం ఏర్పడిందన్నారు. ప్రస్తుతం స్థానిక సంస్థల ఎన్నికల ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే నిధులతో బాపట్ల పట్టణ అభివృద్ధికి మరింత అవకాశం కలుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా చైర్మన్ అభ్యర్థి ఇస్మా సునీల్ మాట్లాడుతూ బాపట్ల పట్టణంపై తనకు పూర్తి అవగాహన ఉందని, పట్టణ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. పారిశుద్ధ్యం, మురుగునీటి కాలువలు, మంచినీటి సౌకర్యాలు, పట్టణ సుందరీకరణతో పాటు బాపట్ల పర్యాటక రంగ అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తానన్నారు. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ వారి సమస్యలను తెలుసుకుని త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తానని చెప్పారు.ఈ నెల 16 తేదీ సోమవారం కూటమి నాయకులు, కార్యకర్తలతో కలిసి వెళ్లి నామినేషన్ దాఖలు చేయనున్నట్లు ఇస్మా సునీల్ విలేకరుల సమావేశంలో వెల్లడించారు. కార్యక్రమంలో జనసేన సమన్వయకర్త శివన్నారాయణ, బాపట్ల టిడిపి నియోజకవర్గ పరిశీలకులు గోనుగుంట్ల కోటేశ్వరరావు, బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాబోతు రమేష్ నాయుడు, దగ్గు మళ్ళీ బెంజి, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు

ఉమామహేశ్వర స్వామి ఆలయంలో సూర్య నమస్కార ప్రత్యేక పూజలు

- గ్రామ ప్రజలు ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు



ఆమదాలవలస , ప్రజాజ్యోతి న్యూస్: ఆమదాలవలస మున్సిపాలిటీ పరిధిలోని గేదలవానిపేట జంక్షన్ వద్ద వెలసిన శ్రీ ఉమామహేశ్వర స్వామి ఆలయంలో కార్తీకమాస పర్వదినాన్ని పురస్కరించుకుని 30 రోజులపాటు నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఆలయ అర్చకులు, శివమాల గురుస్వామి బంకువల్లి దుర్గ శ్రీనివాస్ శర్మ ఆధ్వర్యంలో ప్రతిరోజూ స్వామివారికి నిత్య పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా కార్తీకమాసంలోని నాలుగు ఆదివారాలు ప్రత్యేకంగా సూర్య నమస్కార పూజలు నిర్వహించనున్నారు.ఇందులో భాగంగా మొదటి ఆదివారం ఆలయంలో సూర్య నమస్కార ప్రత్యేక పూజలను భక్తిప్రపత్తులతో నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు, ఆరాధనలు చేపట్టారు.గ్రామ ప్రజలు ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలు, భోగభాగ్యాలతో సుఖసంతోషాలతో వర్ధిల్లాలని స్వామివారిని ప్రార్థించి ఆశీర్వచనాలు అందించారు. ఈ పూజా కార్యక్రమాల్లో భక్తులు పాల్గొని స్వామివారి కృపకు పాత్రులయ్యారు.

అది నా స్థలం అంటూ కోర్టుకు.. ఇది సర్కారు జాగా కదా అని కబ్జాకు!





పోరుమామిళ్ల 15 నవంబర్ (ప్రజా జ్యోతి ప్రతినిధి) “తన దాకా వస్తే గానీ తెలియదు” అన్న సామెత పోరుమామిళ్లలోని ఓ కబ్జాదారుడికి అక్షరాలా సరిపోతుంది. గతంలో ప్రజా అవసరాల కోసం డ్రైనేజీ నిర్మించాలని అధికారులు కోరితే, “అది నా సొంత స్థలం, అంగుళం కూడా ఇవ్వను” అంటూ ఏకంగా కోర్టు మెట్లు ఎక్కిన ఆ వ్యక్తి.. నేడు అదే నోటితో ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలోని ఫుట్‌పాత్‌ను, సర్కారు స్థలాన్ని యథేచ్ఛగా కబ్జా చేస్తూ అక్రమ నిర్మాణాలు చేపడుతున్నాడు. సొంత స్థలానికి ఒక నీతి, ప్రభుత్వ స్థలానికి మరో నీతి ప్రదర్శిస్తున్న ఈ అక్రమార్కుడి తీరుపై పోరుమామిళ్ల పట్టణ ప్రజలు దుమ్మెత్తిపోస్తున్నారు.రోగుల ప్రాణాలతో చెలగాటం పట్టణంలో నిత్యం అత్యంత రద్దీగా ఉండే ప్రాంతాల్లో ప్రభుత్వ ఆసుపత్రి పరిసరాలు ఒకటి. ఇక్కడికి రోజువారీ వైద్యం కోసం వందలాది మంది రోగులు, గర్భిణీలు, వృద్ధులు వస్తుంటారు. వారు సురక్షితంగా నడవడానికి నిర్మించిన ఫుట్‌పాత్‌ను సైతం వదలకుండా సదరు వ్యక్తి ఆక్రమించి కట్టడాలు చేపడుతున్నాడు. ఫుట్‌పాత్ కబ్జా కావడంతో పాదచారులు తప్పనిసరి పరిస్థితుల్లో ప్రధాన రహదారిపైకి వచ్చి నడవాల్సి వస్తోంది. దీనివల్ల నిత్యం ట్రాఫిక్ జామ్ ఏర్పడటమే కాకుండా, వేగంగా వచ్చే వాహనాల వల్ల ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని స్థానికులు భయాందోళన చెందుతున్నారు.

తప్పును ప్రశ్నిస్తే జర్నలిస్టులపైనే దౌర్జన్యం!

ఫుట్‌పాత్ ఆక్రమణపై స్థానికుల నుంచి అందిన సమాచారంతో క్షేత్రస్థాయిలో వాస్తవాలు తెలుసుకోవడానికి వెళ్లిన విలేకరులకు చేదు అనుభవం ఎదురైంది. “ప్రభుత్వ స్థలంలో అనుమతులు లేకుండా ఎలా నిర్మాణం చేపడుతున్నారు?” అని మీడియా ప్రతినిధులు ప్రశ్నించగా, సమాధానం చెప్పలేని ఆ అక్రమార్కుడు తన అసలు రూపాన్ని బయటపెట్టాడు. విలేకరులపై తీవ్ర దురుసుగా ప్రవర్తిస్తూ, తన మొబైల్ ఫోన్‌లో వారి ఫోటోలు, వీడియోలు తీస్తూ భయభ్రాంతులకు గురిచేసే ప్రయత్నం చేశాడు. ప్రజా సమస్యలను వెలుగులోకి తెచ్చే మీడియానే బెదిరించే స్థాయికి కబ్జాదారుడు తెగబడటంపై జర్నలిస్ట్ సంఘాలు, ప్రజా సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.అధికారుల మౌనం వెనుక పట్టణం నడిబొడ్డున, అది కూడా ప్రభుత్వ ఆసుపత్రి పక్కనే పట్టపగలు ఇంత బహిరంగంగా ప్రభుత్వ భూమి కబ్జాకు గురవుతుంటే రెవెన్యూ, పంచాయతీ అధికారులు ఏం చేస్తున్నారని ప్రజలు నిలదీస్తున్నారు. అధికారుల ఉదాసీనత, కళ్లు మూసుకున్న తీరు చూస్తుంటే కబ్జాదారుడికి వారి అండదండలు ఉన్నాయా అన్న అనుమానాలు కలుగుతున్నాయని పట్టణ వాసులు ఆరోపిస్తున్నారు.ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు ఈ వ్యవహారంపై తక్షణమే స్పందించాలని, ఫుట్‌పాత్‌పై వెలసిన అక్రమ నిర్మాణాన్ని నిర్దాక్షిణ్యంగా కూల్చివేసి ప్రభుత్వ స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. అలాగే, విధి నిర్వహణలో ఉన్న విలేకరులపై దౌర్జన్యానికి, బెదిరింపులకు పాల్పడిన సదరు వ్యక్తిపై కఠినమైన క్రిమినల్ కేసులు నమోదు చేయాలని జర్నలిస్ట్ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

అంబేద్కర్ ఆశయాలే సమాజ అభ్యున్నతికి మార్గదర్శకం





– బాలానగర్‌లో 8 అడుగుల అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎంపీ గడ్డం వంశీకృష్ణ, ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

బాలానగర్ : భారత రాజ్యాంగ నిర్మాత, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని పెద్దపల్లి పార్లమెంట్ సభ్యుడు గడ్డం వంశీకృష్ణ పిలుపునిచ్చారు. సమాజంలో సమానత్వం, సామాజిక న్యాయం, మహిళా సాధికారత కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు అంబేద్కర్ అని కొనియాడారు. ఆదివారం బాలానగర్‌లోని చిత్తరమ్మ డబుల్ బెడ్‌రూమ్ హౌసింగ్ సొసైటీలో ఏర్పాటు చేసిన 8 అడుగుల అంబేద్కర్ విగ్రహా ఆవిష్కరణకు ముఖ్య అతిథులుగా ఎంపీ గడ్డం వంశీకృష్ణ, స్థానిక ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు హాజరై ఘనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, టీపీసీసీ ప్రోటోకాల్ సెక్రటరీ సూరజ్ తివారీ పాల్గొన్నారు. విగ్రహావిష్కరణ అనంతరం ఎంపీ వంశీకృష్ణ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో వారు మాట్లాడుతూ భారత రాజ్యాంగాన్ని రచించి దేశ భవిష్యత్తుకు బలమైన పునాదులు వేసిన అంబేద్కర్, భావితరాలకు ఎప్పటికీ స్ఫూర్తిప్రదాతగా నిలుస్తారని అన్నారు. ప్రజల హక్కుల పరిరక్షణ కోసం అంబేద్కర్ చేసిన పోరాటం చిరస్మరణీయమని, ఆయన ఆలోచనలు యావత్ ప్రపంచానికి ఆశాకిరణంగా నిలిచాయని పేర్కొన్నారు. ముఖ్యంగా మహిళలు, అణగారిన వర్గాల అభ్యున్నతి, సమాన హక్కులు, సామాజిక న్యాయం కోసం ఆయన చేసిన కృషి ఎనలేనిదని కొనియాడారు. అంబేద్కర్ రచించిన భారత రాజ్యాంగం కల్పించిన హక్కులు, అవకాశాల ఫలితంగానే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కూడా సాధ్యమైందని ఎంపీ గుర్తుచేశారు. ఆయన ఆశయాలు, సిద్ధాంతాలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల సంక్షేమం, అభ్యున్నతి కోసం పలు సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తోందని తెలిపారు. దళితులు, బడుగు బలహీన వర్గాలకు సమాన అవకాశాలు కల్పిస్తూ, వారి సామాజిక, ఆర్థిక అభివృద్ధికి తోడ్పడటం ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. దళితుల అభ్యున్నతిలో తెలంగాణ రాష్ట్రాన్ని దేశానికే ఆదర్శంగా నిలిపేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఎంపీ వంశీకృష్ణ పేర్కొన్నారు. అంబేద్కర్ విగ్రహాల ఏర్పాటు కేవలం స్మారక కార్యక్రమం మాత్రమే కాకుండా, ఆయన ఆశయాలను భావితరాలకు అందించే స్ఫూర్తిదాయక చర్యగా నిలుస్తుందని ఈ సందర్భంగా పలువురు అభిప్రాయపడ్డారు.

బిర్సా ముండా ఆశయాలను స్ఫూర్తిగాః తీసుకొని వికసిత్ భారత్ నిర్మాణానికి కృషి చేయాలి....

ఆదివాసీల ఆత్మగౌరవానికి ప్రతీక బిర్సా ముండా -- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ

భారతీయ : నిర్మల్ జిల్లా స్వాతంత్ర్య సమర యోధుడు భగవాన్ బిర్సా ముండా జీవితాన్ని ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకొని వికసిత్ భారత్ నిర్మాణం దిశగా అడుగులు వేయాలని భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. ఆదివారం బిర్సా ముండా జయంతిని పురస్కరించుకొని నిర్వహించిన ‘జన్ జాతీయ గౌరవ దివస్’ వేడుకల్లో భాగంగా జిల్లా గిరిజన అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ నుంచి అధికారులు వర్చువల్ విధానంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి మాట్లాడుతూ, భగవాన్ బిర్సా ముండా జయంతిని జన్ జాతీయ గౌరవ దివస్‌గా నిర్వహించడం ద్వారా ఆదివాసీల ఆత్మగౌరవానికి ప్రత్యేక గుర్తింపు కల్పించామని తెలిపారు. భారత స్వాతంత్ర్య ఉద్యమంలో, ఆదివాసీల హక్కుల పరిరక్షణలో బిర్సా ముండా చేసిన పోరాటం చిరస్మరణీయమని కొనియాడారు. గిరిజనుల అభ్యున్నతి కోసం కేంద్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని వివరించారు. పలువురు ఆదివాసీలతో మాట్లాడి ప్రభుత్వ పథకాల ద్వారా అందుతున్న ప్రయోజనాలను అడిగి తెలుసుకున్నారు.అనంతరం కలెక్టరేట్ సమావేశ మందిరంలో బిర్సా ముండా చిత్రపటానికి అధికారులు, ఆదివాసీ సంఘాల నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి నిహారిక మాట్లాడుతూ, బిర్సా ముండా భారత స్వాతంత్ర్య ఉద్యమంలో, గిరిజనుల హక్కుల సాధనలో విశేష కృషి చేశారని తెలిపారు. ‘ఉల్గులాన్’ పేరుతో పోరాటం సాగించి బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా గిరిజనులను చైతన్యపరిచారని పేర్కొన్నారు. ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. అటువంటి మహనీయుడి జయంతిని జన్ జాతీయ గౌరవ దివస్‌గా నిర్వహించుకోవడం గర్వకారణమని, విద్యార్థి దశ నుంచే బిర్సా ముండా వంటి మహనీయుల జీవిత చరిత్రలు, త్యాగాలు, పోరాట స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని సూచించారు. అనంతరం ఆదివాసీ సంఘాల నాయకులు మాట్లాడుతూ, గిరిజనుల సమగ్ర అభివృద్ధికి అధికారులు నిరంతరం సహకరించాలని కోరారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని, ఆదివాసీలంతా ఐక్యంగా



ఉండి తమ హక్కుల సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఈఈ ఆర్డబ్ల్యూఎస్ సందీప్, ఏసీఎంవో శివాజీ, ఆదివాసీ సంఘాల నాయకులు సుంకరి ముత్యం, తొడసం గోవర్ధన్, నైకం భీమ్ రావ్, ఇతర అధికారులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఆలు రు టిడిపి ఇన్చార్జి వైకుంఠ జ్యోతి కి కృతజ్ఞతలు.


చిత్రంలో: ఆచార్య వైకుంఠం జ్యోతి, ఈ లక్ష్మి, ఈ విజయభాస్కర్ గౌడ్, వాగేంద్ర, వెంకటేశ్వర్లు, చంద్ర తదితరులు.

ప్రజా జ్యోతి న్యూస్ దేవనకొండ ప్రతినిధి. (రాఘవేంద్ర.)టిడిపి ఇన్చార్జి వైకుంఠం జ్యోతి గారిని శాలువుతో సన్మానించిన దేవనకొండ మండలం ఎంపీపీ అభ్యర్థి ఈ లక్ష్మి.. దేవనకొండ మండలంలో ఘన విజయం సాధించిన కూటమీ అభ్యర్థులు 13 మంది ఎంపీటీసీలు గెలుపొందారు. దేవనకొండ జడ్పిటిసి అభ్యర్థి డాక్టర్ షేకు. సాధిక జెడ్పిటిసి గా ఏకగ్రీవంగా గెలుపొందారు. నేలతలమరి గ్రామానికి చెందిన టిడిపి మండల కన్వీనర్ ఈ విజయభాస్కర్ గౌడ్ సతీమణి ఈ లక్ష్మి మండల అధ్యక్షురాలుగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా మండల కన్వీనర్ విజయభాస్కర్ గౌడ్. ఎంపీపీ ఈ లక్ష్మి గారు వైకుంఠ జ్యోతిని షాలువుతో సన్మానించి. కృతజ్ఞతలు తెలిపారు

మూడు మండలాలకు కోఆప్షన్ సభ్యుల ఎంపిక

ముగ్గురి పేర్లను సిఫార్సు చేసిన ఎమ్మెల్యే ఏలూరి



మార్టూరు నవంబర్ 15 (ప్రజా జ్యోతి ప్రతినిధి) పర్చూరు నియోజకవర్గ పరిధిలోని మూడు మండలాలకు మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుల ఎంపిక ప్రక్రియలో భాగంగా ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ముగ్గురు నాయకుల పేర్లను సిఫార్సు చేశారు. మార్టూరు, కారంచేడు, ఇంకొల్లు మండలాలకు సంబంధించి ఆయా ప్రాంతాలకు చెందిన నాయకులకు అవకాశం కల్పించారు.మార్టూరు మండల కోఆప్షన్ సభ్యుడిగా వలపర్ల గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు షేక్ బషీర్, ఇంకొల్లు మండలానికి ఇంకొల్లుకు చెందిన మైనారిటీ నాయకుడు షేక్ బాబర్ భాష, కారంచేడు మండలానికి దగ్గుబాడు గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు పటాన్ మహబూబ్ సుభానీల పేర్లను ఎమ్మెల్యే ఏలూరి సిఫార్సు చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఏలూరి మాట్లాడుతూ పార్టీ పట్ల నిబద్ధతతో పనిచేస్తూ, ప్రజలకు అందుబాటులో ఉంటూ ఆయా మండలాల అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తున్న నాయకులకు అవకాశం కల్పించే ఉద్దేశంతో వారి పేర్లను సిఫార్సు చేసినట్లు తెలిపారు.

ముత్యాలమ్మ దేవత నూతన ఆలయ విగ్రహ ప్రతిష్ఠాపన....

మహోత్సవాలకు ఎమ్మెల్యే ఎలేటి మహేశ్వర్ రెడ్డి వారికి ఆహ్వానం.



ఆదిలాబాద్ :- నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలం యాకర్‌పల్లి గ్రామంలో నవంబర్ 27 నుండి 29 వరకు జరగనున్న శ్రీ ముత్యాలమ్మ దేవత నూతన ఆలయ విగ్రహ ప్రతిష్ఠాపన మరియు ప్రారంభోత్సవ మహోత్సవాలకు ముఖ్య అతిథిగా హాజరుకావాలని బీజేఎల్పీ నేత, నిర్మల్ ఎమ్మెల్యే శ్రీ ఎలేటి మహేశ్వర్ రెడ్డి గారిని గ్రామస్తులు సాదరంగా ఆహ్వానించారు.ఆదివారం నాడు ఎమ్మెల్యే గారిని కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు కాల్వ నరేష్, ఉపసర్పంచ్ శ్రీకాంత్, మేకల చంద్రశేఖర్, మేకల నవీన్‌తో పాటు పలువురు గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

గౌతమ్ నగర్‌లో ఉచిత వైద్య శిబిరం...

కూకట్‌పల్లి : కూకట్‌పల్లి నియోజకవర్గం పరిధిలోని ఫతేనగర్ గౌతమ్ నగర్‌లోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరానికి బీజేపీ సీనియర్ నాయకులు కాంచి మహేందర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. బాలానగర్, చింతల్‌లోని ఆర్.ఎన్.సి. హాస్పిటల్స్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సి. రమేష్ ఆధ్వర్యంలో ఈ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కాంచి మహేందర్ మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను అందించడంలో ఇలాంటి వైద్య శిబిరాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని పేర్కొన్నారు. సమాజంలోని ప్రతి ఒక్కరికీ ఆరోగ్యంపై అవగాహన కల్పించడంతో పాటు, అవసరమైన వైద్య సేవలను అందించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన డాక్టర్ సి. రమేష్‌తో పాటు సొసైటీ ప్రతినిధులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు రఘు బట్టా రాధేశ్యామ్, సొసైటీ అధ్యక్షులు భరత్, జనరల్ సెక్రటరీ సంతోష్, ఉపాధ్యక్షులు ఆకాష్, జాయింట్ సెక్రటరీ సుశాంత్ తదితరులు పాల్గొన్నారు.



బిజినెస్

ఏఐలో అగ్రగామి పోటీదారు భారత్

కంప్యూట్ కంటే నైపుణ్యాలే బలం



కృత్రిమ మేధ (ఏఐ) సాంకేతికతలో ప్రపంచవ్యాప్తంగా అభివృద్ధి చెందుతున్న దేశాల్లో 'రైజింగ్ కంటెండర్ (అగ్రగామి పోటీదారు)'గా మనదేశం నిలిచింది. భారీ స్థాయిలో సూపర్ కంప్యూటర్లు, చిప్‌లు వంటి కంప్యూట్ మౌలిక సదుపాయాల కంటే.. బలమైన టెక్ నైపుణ్యాలు, విస్తృత మానవ వనరులే భారత్‌ను ఈ స్థానంలో నిలిపాయని బోస్టన్ కన్సల్టింగ్ గ్రూప్ (బీసీజీ) నివేదిక తెలిపింది. ఏఐ మెచ్యూరిటీ మ్యాట్రిక్స్ 2026 పేరిట బీసీజీ ఈ నివేదికను వెలువరించింది. 33 సూచీల ఆధారంగా 75 దేశాల వివరాలతో ఈ నివేదిక రూపొందించింది. 7 'ఏఐ పయనీర్స్' తర్వాతి స్థానంలో భారత్ నిలిచింది. భారత్ ఆతిథ్యమిచ్చిన 2026 ఏఐ ఇంపాక్ట్ సమిట్, దేశంలో ఏఐ ఎదుగుదలకు నిదర్శనమని నివేదిక పేర్కొంది. ఏఐ పయనీర్స్‌గా కెనడా, చైనా, జపాన్, సింగపూర్, దక్షిణ కొరియా, బ్రిటన్, అమెరికా ఉన్నాయి. రైజింగ్ కంటెండర్స్‌లో భారత్, చిలీ, ఇండోనేషియా, లిథువేనియా, న్యూజిలాండ్, పోలండ్, తుర్కియే, వియత్నాం నిలిచాయి. రెండేళ్ల క్రితంతో పోలిస్తే జపాన్, దక్షిణ కొరియా పయనీర్స్ హోదాకు వెళ్లగా, గ్రీస్, చెక్ రిపబ్లిక్, చిలీ, లిథువేనియా, ఈక్వెడార్, నైజీరియాలు తమ స్థానాలను మెరుగుపరుచుకున్నాయి. మనదేశం స్థిరంగా కంటెండర్స్ శ్రేణిలో కొనసాగుతోంది.

సవాళ్లు కూడా ఉన్నాయ్

కంప్యూట్ లేదా సర్వర్‌లను కొన్ని నెలల్లో కొనుగోలు చేయొచ్చు. కానీ నైపుణ్యం కలిగిన మానవ వనరులను అంత వేగంగా తయారు చేయలేమని బీసీజీ పేర్కొంది. దేశంలో ఉన్న వనరులను ఎంత త్వరగా సామర్థ్యాలుగా మారుస్తారనేదే భారత్‌కు ముందున్న ప్రధాన పరీక్ష. కంపెనీల ఆదాయంలో ఏఐపై పెట్టుబడులు 2025తో పోలిస్తే ఈ ఏడాది రెట్టింపయ్యాయి. సర్వే చేసిన సీఈఓల్లో 90% మంది వ్యయ నియంత్రణ, రాబడుల ప్రయోజనాలు కనిపిస్తున్నాయని తెలిపారు. జాతీయ వ్యూహాల రూపకల్పన కంటే, వాటిని అమలు చేయడం ముఖ్యం. నిరంతర విద్యుత్ లభ్యత, గ్రిడ్ అనుసంధానత, వేగవంతమైన అనుమతుల ప్రక్రియ ఏఐ మౌలిక సదుపాయాల కల్పనకు కీలకంగా మారుతున్నాయి.

బలాలు ఇవే..

మన దేశంలో ఎక్కువ సంఖ్యలో ఏఐ నిపుణులు ఉండటం, ఐటీ సేవల రంగం బలాలుగా ఉన్నాయి. భారత ఐటీ ప్రాసెస్, డెలివరీ నిర్వహణ.. ఏఐ వ్యవస్థలను నడిపించేందుకు అత్యంత అనుకూలంగా ఉన్నాయి. అమెరికా, బ్రిటన్, యూఏఈ, కెనడాల నుంచి నైపుణ్యం కలిగిన భారతీయులు స్వదేశానికి రావడం భారత్‌కు కలిసివస్తోంది. 2025లో అంతర్జాతీయంగా ఏఐ నిపుణుల వలసలు 12% తగ్గి పోటీ నెలకొన్న తరుణంలో ఈ పరిణామం మనకు లాభం చేకూర్చనుంది. కోటి మంది పౌరులకు ఉచిత ప్రాథమిక ఏఐ నైపుణ్యాలను అందించే లక్ష్యంతో ప్రారంభించిన 'యువ ఏఐ ఫర్ ఆల్', ద్వితీయ శ్రేణి నగరాల్లో ఏఐ ల్యాబ్‌లు, ధ్రువీకరణలను అందించే 'ఇండియా-ఏఐ ఫ్యూచర్స్ స్కిల్స్' వంటివి కలిసొస్తున్నాయి.

సైబర్‌ట్రక్‌కు మరో ఛాన్స్..
మస్క్ సంచలన నిర్ణయం!

టెస్లా సైబర్‌ట్రక్ ఉత్పత్తి విషయంలో.. ఎలాన్ మస్క్ కీలక నిర్ణయం తీసుకున్నారు. 2027 మధ్యలోనే ఈ వాహనం తయారీని నిలిపివేస్తామని ప్రకటించిన కొన్ని రోజుల తరువాత.. తన నిర్ణయాన్ని మార్చుకున్నారు. 2027 వేసవి చివరి వరకు సైబర్‌ట్రక్ ఉత్పత్తిని కొనసాగిస్తామని వెల్లడించారు.

సైబర్‌క్యాబ్ ఉత్పత్తి

నిజానికి టెక్సాస్‌లోని గిగాఫ్యాక్టరీలో సైబర్‌ట్రక్ తయారీని తగ్గించి, ఆ స్థానంలో సైబర్‌క్యాబ్ ఉత్పత్తిని పెంచాలని టెస్లా భావిస్తోంది. సైబర్‌క్యాబ్ అనేది డ్రైవర్ అవసరం లేకుండా ప్రయాణించేలా రూపొందిస్తున్న రోబోటాక్సీ వాహనం. అయితే.. సైబర్‌ట్రక్ కోసం ఇంకా చాలా ఆర్డర్లు పెండింగ్‌లో ఉండటంతో, వాటిని పూర్తి చేసేందుకు మరికొంత సమయం ఇవ్వాలని మస్క్ నిర్ణయించారు. లేదంటే.. వాహనాలు అందించలేని కస్టమర్లకు బుకింగ్ సమయంలో చెల్లించిన డిపాజిట్లను తిరిగి ఇవ్వాల్సి రావచ్చు. ఉత్పత్తిని పొడిగించడం వల్ల కంపెనీకి పెద్దగా లాభం ఉండకపోవచ్చని కూడా మస్క్ కూడా అంగీకరించారు. లాభాలను పెంచుకునే కోణంలో చూస్తే ఇది అంత తెలివైన నిర్ణయం కాకపోవచ్చని, అయితే వ్యాపారంలో కొంత భావోద్వేగానికి కూడా చోటు ఉండాలని ఆయన ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. సైబర్‌ట్రక్ అమ్మకాలు మొదట అనుకున్న స్థాయిలో లేకపోయినా.. దాని ప్రత్యేకమైన స్టెయిన్‌లెస్ స్టీల్ బాడీ, విభిన్నమైన డిజైన్ కారణంగా వాహన ప్రియులను ఆకట్టుకుంది. మరోవైపు సైబర్‌ట్రక్ విషయంలో మస్క్ పెట్టుకున్న అమ్మకాల లక్ష్యాలు ఇప్పటివరకు అందుకోలేకపోయారు.

అమ్మకాలు ఇలా..



ప్రారంభంలో ఏడాదికి 2.5 లక్షల వాహనాలను విక్రయించాలని గతంలో లక్ష్యంగా పెట్టుకున్నారు. కానీ 2023 చివర్లో డెలివరీలు ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకు మొత్తం అమ్మకాలు సుమారు 70 వేల యూనిట్లేనని పరిశ్రమ అంచనాలు చెబుతున్నాయి. తాజా నిర్ణయంతో ఉత్పత్తి మరికొంత కాలం కొనసాగనున్నప్పటికీ, 2027 తర్వాత కూడా ఈ వాహనాన్ని తయారు చేస్తారా లేదా అనే దానిపై టెస్లా ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు. ఇక సైబర్‌ట్రక్ ఉత్పత్తిని నిలిపివేయాలన్న ఆలోచనపై అభిమానులు, యజమానుల నుంచి కూడా వ్యతిరేకత వచ్చింది. ఈ వాహనం తయారీ కొనసాగించాలని కోరుతూ 5,000 మందికి పైగా ఒక పిటిషన్‌పై సంతకాలు చేశారు. మరోవైపు టెస్లా వాహనాలకు యాక్సెసరీలు తయారు చేసే అన్‌ప్లగ్డ్ పెర్ఫార్మెన్స్ సంస్థ కూడా పెట్టుబడిదారుల సహకారంతో సైబర్‌ట్రక్ ఉత్పత్తిని తామే చేపట్టే అవకాశాలను పరిశీలిస్తోంది.

జియో ప్రీపెయిడ్ ప్లాన్స్‌పై గూగుల్ ఏఐ ప్రో సబ్‌స్క్రిప్షన్ తొలగింపు

ఇంటర్నెట్ డెస్క్: ప్రముఖ టెలికాం కంపెనీ రిలయన్స్ జియో తన ప్రీపెయిడ్ ప్లాన్స్‌పై గూగుల్ ఏఐ ప్రో సబ్‌స్క్రిప్షన్‌ను తొలగించింది. అయితే, ఇది కొత్త వినియోగదారులకే వర్తిస్తుంది. ఇదివరకే ప్రీపెయిడ్ రీఛార్జ్‌లపై గూగుల్ ఏఐ ప్రో సబ్‌స్క్రిప్షన్ పొందుతున్న యూజర్లకు ఈ ఆఫర్ కొనసాగుతుంది. ఈ మేరకు కంపెనీ అధికారిక వెబ్‌సైట్‌లో పేర్కొంది. రూ.35,100 విలువైన గూగుల్ ఏఐ ప్రో ప్రయోజనాలను ప్రీపెయిడ్ ప్లాన్స్‌పై ఎలాంటి అదనపు ఛార్జీలు లేకుండానే జియో ఉచితంగా అందించింది. ఇకపై కొత్త యూజర్లకు కాన్వా సబ్‌స్క్రిప్షన్‌ను మాత్రమే లభిస్తుంది. ఎంపిక చేసిన రీఛార్జ్ ప్లాన్స్‌పై కాన్వా ప్రో, కాన్వా ప్రో లైట్ ప్రయోజనాలు పొందొచ్చు. రూ.399 ప్రీపెయిడ్ ప్లాన్ నుంచి రూ.4 వేల విలువైన కాన్వా ప్రో సబ్‌స్క్రిప్షన్‌ను 12 నెలల పాటు ఉచితంగా అందిస్తుంది. దీంతో పాటు జియో హాట్‌స్టార్ మొబైల్ సబ్‌స్క్రిప్షన్, మొబైల్ ద్వారా జియో గేమ్స్ వీక్షించే వెసులుబాటు ఉంది. రూ.349 ప్రీపెయిడ్ ప్లాన్‌పై రూ.1590 విలువైన కాన్వా ప్రో లైట్‌ను 12 నెలల పాటు ఫ్రీగా తీసుకొచ్చింది. దీంతో పాటు జియో హాట్‌స్టార్ మొబైల్ సబ్‌స్క్రిప్షన్, జియో ఏఐ క్లౌడ్ 50 జీబీ స్టోరేజ్ వరకు ఉచితంగా పొందొచ్చు. ఈ రీఛార్జ్ ప్లాన్స్‌ను ఇప్పటికే క్లెయిమ్ చేసుకున్న వినియోగదారులకు గూగుల్ ఏఐ ప్రో సబ్‌స్క్రిప్షన్ యథావిధిగా కొనసాగుతుంది. తొలగింపునకు గల కారణాలు తెలియరాలేదు.



టీమిండియా సంచలన విజయం..
వన్డే సిరీస్ కైవసం.. కివీస్ ఏడేళ్ల రికార్డుకు బ్రేక్

న్యూజిలాండ్ గడ్డపై టీమిండియా చరిత్ర సృష్టించింది. ఐదో వన్డేలో ఆతిథ్య న్యూజిలాండ్‌ను 22 పరుగుల తేడాతో ఓడించి సిరీస్‌ను కైవసం చేసుకుంది. తొలుత బ్యాటింగ్‌లో తడబడినప్పటికీ.. బౌలింగ్‌లో అద్భుతంగా పుంజుకున్న భారత జట్టు 209 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని కివీస్ అందుకోకుండా అడ్డుకుంది. భారత బౌలర్ల సమష్టి ప్రదర్శనతో న్యూజిలాండ్‌ను 48.1 ఓవర్లలో 187 పరుగులకే ఆలౌట్ చేసింది . ఈ విజయంతో సొంతగడ్డపై వరుసగా ఏడు సంవత్సరాలుగా కొనసాగుతున్న న్యూజిలాండ్ ద్వైపాక్షిక వన్డే సిరీస్ విజయాల పరంపరకు భారత్ తెరదించింది.

209 పరుగులకే భారత్ ఆలౌట్

ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన న్యూజిలాండ్ కెప్టెన్ మిచెల్ సాంట్నర్ తొలుత బౌలింగ్ ఎంచుకున్నాడు. దీంతో బ్యాటింగ్‌కు దిగిన భారత్‌కు ఆరంభంలోనే ఎదురుదెబ్బలు తగిలాయి. ఓపెనర్ రోహిత్ శర్మ, స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ తొలి ఎనిమిది ఓవర్లలోనే మాథ్యూ ఫిషర్ బౌలింగ్‌లో పెవిలియన్ చేరారు. దీంతో భారత జట్టు ఒత్తిడిలో పడింది. ఆ తర్వాత కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ కూడా షార్ట్ బాల్‌ను ఎదుర్కోవడంలో ఇబ్బంది పడి వికెట్ సమర్పించుకున్నాడు. టాప్ ఆర్డర్ వైఫల్యంతో భారత్ భారీ స్కోరు సాధించే అవకాశాన్ని కోల్పోయింది. ఈ పరిస్థితుల్లో ఇషాన్ కిషన్, అక్షర్ పటేల్ బాధ్యతాయుతంగా ఆడారు. వికెట్లు పడుతున్నా క్రీజులో నిలదొక్కుకుని పరుగులు రాబట్టారు. ఇద్దరూ 46 పరుగుల చొప్పున సాధించి భారత ఇన్నింగ్స్‌కు కీలకంగా నిలిచారు. అయితే వీరిద్దరూ అర్ధశతకాలకు నాలుగు పరుగుల దూరంలోనే వెనుదిరగడం భారత్‌కు నిరాశ కలిగించింది. ముఖ్యంగా ఇషాన్ కిషన్ కీలక సమయంలో జాకబ్ డఫీ బౌలింగ్‌లో మాథ్యూ ఫిషర్‌కు క్యాచ్ ఇచ్చి ఔటయ్యాడు. మిడిలార్డర్ సైతం విఫలమైనప్పటికీ చివర్లో మహమ్మద్ సిరాజ్, అర్ష్‌దీప్ సింగ్ విలువైన పరుగులు జోడించారు. అర్ష్‌దీప్ కేవలం నాలుగు బంతుల్లోనే రెండు సిక్సర్లు సహా 14 పరుగులు చేశాడు. సిరాజ్ కూడా కీలక బౌండరీలు, సిక్సర్‌తో అలరించాడు. వీరిద్దరి పోరాటంతో భారత్ స్కోరు 200 పరుగుల మార్కును దాటింది.చివరకు 42.1 ఓవర్లలో 209 పరుగులకు భారత ఇన్నింగ్స్ ముగిసింది.

న్యూజిలాండ్ బౌలర్లలో మిచెల్ సాంట్నర్ 3 వికెట్లు, జాకబ్ డఫీ 3 వికెట్లు పడగొట్టారు. మాథ్యూ ఫిషర్ రెండు వికెట్లతో భారత టాప్ ఆర్డర్‌ను దెబ్బతీశాడు. దీంతో 50 ఓవర్లకు



ముందే భారత్ ఆలౌటైంది.

కివీస్‌కు ఆదిలోనే షాక్‌లు

210 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన న్యూజిలాండ్‌కు భారత పేసర్లు ఆరంభంలోనే షాకిచ్చారు. అర్ష్‌దీప్ సింగ్ బౌలింగ్‌లో నిక్ కెల్లీ 24 పరుగుల వద్ద బౌల్డ్ అయ్యాడు. ఆ తర్వాత ఫిన్ అలెన్‌ను మహమ్మద్ సిరాజ్ అద్భుతమైన బంతితో బౌల్డ్ చేశాడు. షార్ట్ లెంగ్త్‌లో వచ్చిన బంతిని ఆడే ప్రయత్నంలో అలెన్ బ్యాట్‌కు, ప్యాడ్‌కు మధ్య నుంచి వెళ్లి ఆఫ్ స్టంప్‌ను ఎగరగొట్టింది. మరోవైపు భారత ఫీల్డింగ్‌లో కొన్ని తప్పిదాలు కనిపించాయి. విరాట్ కోహ్లీ స్లిప్‌లో డీన్ ఫాక్స్‌క్రాఫ్ట్ ఇచ్చిన క్యాచ్‌ను వదిలేశాడు. యశ్ ఠాకూర్ కూడా మైఖేల్ బ్రేస్‌వెల్ ఇచ్చిన అవకాశాన్ని అందుకోలేకపోయాడు. దీంతో న్యూజిలాండ్‌కు కొంత ఊరట లభించింది.

83 పరుగులకే నాలుగు వికెట్లు కోల్పోయిన న్యూజిలాండ్‌ను డీన్ ఫాక్స్‌క్రాఫ్ట్, మైఖేల్ బ్రేస్‌వెల్ ఆదుకునే ప్రయత్నం చేశారు. వీరిద్దరూ ఐదో వికెట్‌కు కీలక భాగస్వామ్యం నెలకొల్పుతూ స్కోరు బోర్డును ముందుకు నడిపించారు. ఫాక్స్‌క్రాఫ్ట్ 42 బంతుల్లో 31 పరుగులు చేయగా.. బ్రేస్‌వెల్ 33 బంతుల్లో 19 పరుగులు సాధించాడు. అయితే ఈ భాగస్వామ్యాన్ని ఔకిబ్ నబీ విడదీశాడు. బ్రేస్‌వెల్ ఇచ్చిన క్యాచ్‌ను నామన్ ధీర్ అందుకోవడంతో న్యూజిలాండ్ ఐదో వికెట్ కోల్పోయింది. ఆ తర్వాతి ఓవర్లోనే యశ్ ఠాకూర్ తన అరంగేట్ర వన్డేలో తొలి వికెట్ సాధించాడు. ఫాక్స్‌క్రాఫ్ట్‌ను బౌల్డ్ చేసి భారత శిబిరంలో ఆనందం నింపాడు. దీంతో కివీస్ 119 పరుగుల వద్ద ఐదు వికెట్లు కోల్పోయింది.

ఆ తర్వాత కెప్టెన్ మిచెల్ సాంట్నర్, క్రిస్టియన్ క్లార్క్ ఇన్నింగ్స్‌ను నిలబెట్టేందుకు ప్రయత్నించారు. సాంట్నర్ 31 బంతుల్లో 24 పరుగులు చేశాడు. ఇందులో రెండు సిక్సర్లు ఉన్నాయి. అయితే నామన్ ధీర్ బౌలింగ్‌లో భారీ షాట్ ఆడేందుకు ప్రయత్నించి అర్ష్‌దీప్ సింగ్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. ఈ వికెట్ మ్యాచ్‌లో కీలక మలుపుగా మారింది. మరోవైపు క్రిస్టియన్ క్లార్క్ 35 బంతుల్లో 16 పరుగులు చేసి పోరాడాడు. కానీ అర్ష్‌దీప్ సింగ్ బౌలింగ్‌లో ఇషాన్ కిషన్‌కు క్యాచ్ ఇచ్చి ఔటయ్యాడు. దీంతో న్యూజిలాండ్ విజయానికి దూరమైంది. చివరి ఓవర్లలో కివీస్ టెయిలెండర్లు బ్లెయిర్ టిక్నర్, జాకబ్ డఫీ కొంత పోరాటం చేసినా ఫలితం లేకపోయింది. అక్షర్ పటేల్ బౌలింగ్‌లో డఫీ క్యాచ్ ఇచ్చి ఔటయ్యాడు. చివరకు 48.1వ ఓవర్‌లో టిక్నర్ భారీ షాట్‌కు ప్రయత్నించగా బంతి బ్యాట్‌కు తగల్లేదు. క్రీజు వదిలి ముందుకొచ్చిన అతడిని వికెట్ కీపర్ ఇషాన్ కిషన్ స్టంపౌట్ చేశాడు. దీంతో న్యూజిలాండ్ ఇన్నింగ్స్ 187 పరుగుల వద్ద ముగిసింది. భారత్ 22 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. భారత బౌలర్లలో అర్ష్‌దీప్ సింగ్ 30 పరుగులిచ్చి మూడు వికెట్లు పడగొట్టాడు. మహమ్మద్ సిరాజ్ 50 పరుగులిచ్చి రెండు వికెట్లు తీశాడు. అక్షర్ పటేల్, యశ్ ఠాకూర్, ఔకిబ్ నబీ, నామన్ ధీర్ తలో వికెట్ సాధించారు.

న్యూజిలాండ్ ఏడేళ్ల రికార్డు బద్దలు


ఈ విజయంతో న్యూజిలాండ్ సొంతగడ్డపై వరుసగా 11 ద్వైపాక్షిక వన్డే సిరీస్‌లలో కొనసాగిన విజయాల పరంపరకు భారత్ బ్రేక్ వేసింది. 2019లో చివరిసారిగా భారత్ చేతిలోనే న్యూజిలాండ్ స్వదేశంలో వన్డే సిరీస్ కోల్పోయింది. ఏడేళ్ల తర్వాత మళ్లీ అదే ప్రత్యర్థి చేతిలో ఓటమి ఎదురైంది. భారత బ్యాటింగ్‌లో లోపాలు స్పష్టంగా కనిపించినప్పటికీ, బౌలింగ్ విభాగం వాటిని కప్పిపుచ్చుతూ జట్టుకు చిరస్మరణీయ విజయాన్ని అందించింది.

స్పోర్ట్స్

మైదానంలోనే యుద్ధం.. బయట స్నేహంగా ఉంటాం



న్యూజిలాండ్ పర్యటనలో టీ20, వన్డే సిరీస్‌లను కైవసం చేసుకోవడం జట్టుకు దక్కిన గొప్ప ఘనత అని టీమిండియా కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ పేర్కొన్నాడు. నిరంతరం మారుతున్న వాతావరణం, విభిన్నమైన పిచ్ పరిస్థితులు అనేక సవాళ్లు విసిరినప్పటికీ, వాటన్నింటినీ అధిగమించి రెండు సిరీస్‌లలోనూ విజేతగా నిలవడం ఎంతో సంతృప్తినిచ్చిందని తెలిపాడు. ప్రస్తుతం న్యూజిలాండ్ పర్యటనలో ఉన్న భారత జట్టు ఇప్పటికే టీ20 సిరీస్ గెలుచుకోగా, నేడు జరిగిన చివరి వన్డేలోనూ గెలిచి 3-1తో వన్డే సిరీస్ ను కూడా చేజిక్కించుకుంది. ఇవాళ్టి మ్యాచ్ ముగిసిన అనంతరం శ్రేయస్ అయ్యర్ జట్టు ప్రదర్శన, వ్యూహాలపై మాట్లాడాడు. ఈ మ్యాచ్‌లో బ్యాటింగ్‌లో ఆశించిన స్థాయిలో పరుగులు చేయలేకపోయినా, మ్యాచ్‌ను ఏ క్షణంలోనైనా మనవైపు తిప్పుకోగలమనే గట్టి నమ్మకం తమలో ఉందని శ్రేయస్ చెప్పాడు. జట్టులోని ప్రతి ఆటగాడూ ఇదే సానుకూల దృక్పథంతో ఆలోచించారని, మైదానంలో ప్రణాళికలను సమర్థవంతంగా అమలు చేయగలిగామని వివరించాడు. ఈ సిరీస్ పూర్తిగా బ్యాటర్లకు అనుకూలించింది కాదని, ఇరు జట్లలోని బౌలర్లదే కీలక పాత్ర అని అన్నాడు. ముఖ్యంగా భారత బౌలర్లు తీవ్ర ఒత్తిడిని తట్టుకుని, పరిస్థితులకు అనుగుణంగా బౌలింగ్ చేసి జట్టుకు విజయాలు అందించారని కొనియాడాడు. ఆటగాళ్లలో కనిపించిన ఆత్మవిశ్వాసం, పోరాట తత్వమే జట్టును ముందుకు నడిపించాయని ప్రశంసించాడు. టెస్టు మ్యాచ్‌ల సన్నాహకాలు, ఆటగాళ్ల గాయాల కారణంగా తుది జట్టులో తరచూ మార్పులు చేయాల్సి వచ్చిందని శ్రేయస్ అయ్యర్ గుర్తుచేశాడు. జట్టులో మార్పులు చేర్పులు జరిగినప్పుడు పరిస్థితులకు అలవాటు పడటం ఆటగాళ్లకు కాస్త కష్టమైన విషయమేనని అంగీకరించాడు. అయితే, తాము ఏ దశలోనూ ఎలాంటి సాకులు చెప్పాలనుకోలేదని స్పష్టం చేశాడు. తమపై ఉన్న అంచనాలకు తగ్గట్టుగా ఆడాలని, మైదానంలోకి దిగిన ప్రతి ఒక్కరూ తమ అత్యుత్తమ ప్రదర్శన ఇవ్వాలనే లక్ష్యంతోనే ముందుకు సాగామని పేర్కొన్నాడు. ఈ ద్వైపాక్షిక సిరీస్‌కు స్టేడియాలకు భారీగా తరలివచ్చిన భారత, న్యూజిలాండ్ అభిమానులకు శ్రేయస్ అయ్యర్ ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపాడు. ఫలితాలతో సంబంధం లేకుండా ఇరు జట్లను సమానంగా ప్రోత్సహించడం క్రీడాస్ఫూర్తికి నిదర్శనమని, ఇది చూడ్డానికి ఎంతో ముచ్చటగా ఉందని అన్నాడు. అభిమానుల నుంచి లభించే ఇలాంటి మద్దతే ఆటగాళ్లకు అసలైన స్ఫూర్తి అని పేర్కొన్నాడు. మైదానంలో దిగితే ఇరు జట్ల మధ్య తీవ్ర పోటీ ఉంటుందని, అది ఒక యుద్ధంలాంటి పోరాటమని చెబుతూనే.. మైదానం వెలుపల ఇరు జట్ల ఆటగాళ్ల మధ్య చక్కని స్నేహం ఉంటుందని, క్రీడల్లో ఎప్పుడూ ఇలాంటి వాతావరణమే ఉండాలని శ్రేయస్ అయ్యర్ స్పష్టం చేశాడు.



ప్రశాంత్ నీల్ హారర్ థ్రిల్లర్ '418'ను
థియేటర్లలో మిస్సయ్యారా?

టాలీవుడ్ టాప్ బ్యానర్లలో ఒకటైన మైత్రీ మూవీ మేకర్స్ కాంపౌండ్ నుంచి వచ్చిన చిత్రం 418 . హారర్ జోనర్‌లో తెరకెక్కిన ఈ చిత్రంలో పతంగ్ సినిమాతో మంచి గుర్తింపు తెచ్చుకున్న ఇంటర్నెట్, సోషల్ మీడియా పర్సనాలిటీ ప్రీతి పగడాల లీడ్ రోల్‌లో నటించగా.. చరణ్ లక్కరాజు, సూర్య రాజ్ కీలక పాత్రలు పోషించారు. ప్రశాంత్ నీల్ సమర్పణలో తెరకెక్కిన ఈ మూవీని కీర్తన్ నాదగౌడ డైరెక్ట్ చేశారు. అక్టోబర్ 26న థియేటర్లలో గ్రాండ్‌గా విడుదలై ఈ చిత్రానికి మిక్స్‌డ్ రివ్యూస్ రాబట్టుకుంది. అయితే థియేటర్లలో ఈ సినిమాను మిస్సయిన వారి కోసం ఆసక్తికర అప్‌డేట్ వచ్చేసింది. 418 ఇక ఓటీటీలోనూ సందడి చేయనుంది. పాపులర్ ఓటీటీ ప్లాట్‌ఫాం నెట్‌ఫ్లిక్స్‌లో నవంబర్ 19 నుంచి స్ట్రీమింగ్ కానుంది. ఈ మూవీ పలు ప్రధాన భారతీయ భాషల్లో అందుబాటులో ఉండనుంది. మరి ఓటీటీలో ఈ చిత్రానికి ఎలాంటి స్పందన వస్తుందనేది ఆసక్తికరంగా మారింది. ఈ చిత్రం సూర్య రాజ్, శషాంక్ పాటిల్, రమేశ్ ఇందిర ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు. దినేశ్ బినకరన్, సినిమాటోగ్రఫర్‌గా పనిచేసిన ఈ చిత్రానికి వెంకీ జీజీ మ్యూజిక్ కంపోజర్‌గా వ్యవహరించాడు.

ప్రశ్నిస్తే.. రాజకీయ ముద్ర వేస్తారా?

విశాఖపట్నంలో పట్టణీకరణ పేరుతో కొండలను తవ్వుతుండటంపై టాలీవుడ్ హీరోయిన్ చాందిని చౌదరి ఇటీవల ఆవేదన వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా ఓ పోస్ట్ పెట్టారు. అయితే ఆమె అభిప్రాయంపై కొందరు నెటిజన్లు విమర్శలు, ట్రోల్స్‌కు దిగారు. ఈ నేపథ్యంలో తాజాగా చాందిని ఓ వీడియోను విడుదల చేస్తూ ట్రోలర్స్‌కు తనదైన శైలిలో సమాధానమిచ్చారు. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. 'ప్రజాస్వామ్య దేశంలో ప్రతి ఒక్కరికీ తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తం చేసే హక్కు ఉండాలి. మనకు బాధ కలిగించే విషయం ఏదైనా జరిగినప్పుడు మర్యాదపూర్వకంగా, గౌరవంగా మన ఆలోచనలను, భావోద్వేగాలను వ్యక్తపరిచే స్వేచ్ఛ ఉండాలి. ఒక సాధారణ పౌరురాలిగా తన అభిప్రాయాన్ని వెల్లడిస్తే దానికి రాజకీయ రంగు పులమడం సరికాదు. గతంలో జరిగినా.. ప్రస్తుతం జరుగుతున్నా.. ఏ విషయంపైనైనా పౌరులుగా స్పందించే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంటుంది. ఒకరి అభిప్రాయాలను తమకు అనుకూలంగా మార్చుకుని, రాజకీయ అనుబంధాలు అంటగడుతూ విమర్శలు చేయడం సరైన పద్ధతి కాదు' అని తన అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది.



సోనాక్షి సిన్హా మార్ఫింగ్ ఫొటోల వివాదం.. నిందితుడికి ఊరటనిచ్చిన ముంబై కోర్టు

నటి సోనాక్షి సిన్హా మార్ఫింగ్ ఫోటోల కేసులో ఢిల్లీలో అరెస్టయిన ఆర్యన్ దీపక్ జైన్‌ను ముంబై కోర్టు విడుదల చేసింది. సరైన అరెస్ట్ నిబంధనలు, బీఎన్ఎస్ఎస్ చట్ట నిబంధనలను పోలీసులు పాటించకపోవడంతో ఈ అరెస్ట్ అక్రమమని మేజిస్ట్రేట్ స్పష్టం చేసింది. సోనాక్షి సిన్హా ఫిర్యాదు మేరకు ముంబైలోని బాంద్రా పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు కాగా, పోలీసులు ఢిల్లీలోని షహద్రా ప్రాంతంలో ఆర్యన్ దీపక్ జైన్‌ను అదుపులోకి తీసుకుని ముంబైకి తీసుకువచ్చారు. అయితే, నిందితుడిని ముంబైకి తీసుకువచ్చే ముందు ఢిల్లీలోని స్థానిక మేజిస్ట్రేట్ ముందు హాజరుపర్చడంలో పోలీసులు విఫలమయ్యారని కోర్టు గుర్తించింది. ఏడు సంవత్సరాల వరకు శిక్ష పడే అవకాశం ఉన్న కేసుల్లో బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 35(1)(ఎ) ప్రకారం తప్పనిసరిగా పాటించాల్సిన నిబంధనలను, అరెస్ట్ కారాణన్ని నమోదు చేయడంలో దర్యాప్తు అధికారులు విఫలమయ్యారని న్యాయస్థానం పేర్కొంది. కేవలం దర్యాప్తు అవసరం అనే సాకుతో చట్టపరమైన రక్షణలను విస్మరించి ఎవరినీ నిర్బంధించలేమని తేల్చిచెప్పిన మేజిస్ట్రేట్, నిందితుడిని తక్షణమే విడుదల చేయాలని ఉత్తర్వులు జారీ చేశారు.





అల్లు అర్జున్ నుంచి 'రాకా' అప్‌డేట్స్ వస్తాయా అభిమానుల్లో భారీ అంచనాలు!

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ ప్రస్తుతం వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. ముఖ్యంగా కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ అట్లీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ చిత్రం 'రాకా'పై ఇప్పటికే ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమాకు సంబంధించిన వివరాలను మేకర్స్ ఇప్పటివరకు చాలా గోప్యంగా ఉంచుతున్నారు. దీంతో బన్నీ అభిమానులు ఎప్పుడెప్పుడు కొత్త అప్‌డేట్స్ వస్తాయా అని ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో తాజాగా అల్లు అర్జున్ పాల్గొనబోతున్న ఓ సినిమా ఈవెంట్‌పై అందరి దృష్టి పడింది. తాజాగా అల్లు అర్జున్ హైదరాబాద్‌లో జరగనున్న 'ఆకాశంలో ఒక తార' సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఈ కార్యక్రమంలో ఐకాన్ స్టార్ ఏం మాట్లాడబోతున్నారు? సినిమాకు సంబంధించి ఎలాంటి విశేషాలు పంచుకోబోతున్నారు? అనే ఆసక్తి నెలకొంది. అయితే ఈ ఈవెంట్‌కు హాజరవుతున్న బన్నీ నుంచి తమ అభిమాన చిత్రాలకు సంబంధించిన అప్‌డేట్స్ కూడా వస్తాయని ఫ్యాన్స్ ఆశిస్తున్నారు. ముఖ్యంగా అట్లీ దర్శకత్వంలో రూపొందుతున్న 'రాకా' సినిమా గురించి అల్లు అర్జున్ ఏదైనా కీలక విషయం వెల్లడిస్తారా? షూటింగ్‌కు సంబంధించిన విశేషాలను పంచుకుంటారా? అనే చర్చ సోషల్ మీడియాలో మొదలైంది. అల్లు అర్జున్, అట్లీ కాంబినేషన్‌లో వస్తున్న 'రాకా'పై మొదటి నుంచే భారీ అంచనాలు ఉన్నాయి. ఇప్పటికే ఈ ప్రాజెక్ట్‌పై సినీ అభిమానుల్లో విపరీతమైన ఆసక్తి నెలకొంది. అట్లీ తన సినిమాల్లో చూపించే గ్రాండ్ విజువల్స్, భారీ యాక్షన్ సన్నివేశాలు, కమర్షియల్ ఎలిమెంట్స్‌కు ప్రత్యేకమైన గుర్తింపు ఉంది. ఇప్పుడు ఆయన అల్లు అర్జున్‌ను ఏ తరహా పాత్రలో చూపించబోతున్నారనేది ఆసక్తికరంగా మారింది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్‌లో అల్లు అర్జున్ పూర్తిగా నిమగ్నమై ఉన్నారు. అయితే కథ, పాత్రలు, ఇతర నటీనటుల వివరాల విషయంలో చిత్ర బృందం పెద్దగా సమాచారం బయటకు వెల్లడించడం లేదు. దీంతో అభిమానులు ప్రతి చిన్న అప్‌డేట్ కోసం ఎదురుచూస్తున్నారు. మరోవైపు అల్లు అర్జున్ తదుపరి ప్రాజెక్ట్ 'ఏఏ23'పై కూడా అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. కోలీవుడ్ దర్శకుడు లోకేష్ కనగరాజ్‌తో బన్నీ ఈ సినిమా చేయబోతుండటంతో అంచనాలు మరింత పెరిగాయి. లోకేష్ తనదైన యాక్షన్ కథలు, ప్రత్యేకమైన మేకింగ్ స్టైల్‌తో ప్రేక్షకుల్లో మంచి గుర్తింపు సంపాదించుకున్నారు. ఇప్పుడు అల్లు అర్జున్, లోకేష్ కనగరాజ్ కలయికలో ఎలాంటి సినిమా రాబోతోంది? ఇది పూర్తిస్థాయి యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఉండబోతుందా? అనే ప్రశ్నలు అభిమానులను వెంటాడుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో 'ఏఏ23' గురించి కూడా బన్నీ ఏదైనా ఆసక్తికరమైన విషయం వెల్లడిస్తారని ఫ్యాన్స్ ఆశిస్తున్నారు.

Printed by Sree Seshasai Enterprises Published by Vaddi Srinivas Reddy on behalf of Sai Krishna Publications, printed at # 3-88, Chandra Theater, Main Road, Gosala, Krishna District - 521151 Andhra Pradesh and published at D.No. 6-121, 1st Floor, Sphurthy Building, Gosala Village, Urdu School Street, Vijayawada, Krishna District-521151 Andhra Pradesh. Editor Vaddi Srinivas Reddy- 94402 31967 . PRGI No. APTEL/26/A0119,